RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



27 మే 2025 మంగళవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:306

## పాక్‌ఏకైక లక్ష్యం భారత్‌తో శత్రుత్వమే : ప్రధాని మోదీ





గాంధీ నగర్, మే26 ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ ప్రతీకారదాడులకు ప్రయత్నించగా, భారత సైన్యం వాటిని తిప్పికొట్టినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. దేశ విభజన తర్వాత ఏర్పడిన పాకిస్థాన్ భారత్‌తో శత్రుత్వమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆరోపించారు. గుజరాత్ పర్యటనలో భాగంగా దోహద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నరు పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు.

'విభజన తర్వాత ఏర్పడిన పాకిస్థాన్ ఏకైక లక్ష్యం భారత్‌తో శత్రుత్వం. భారత్ అంటే ద్వేషంతో మన దేశానికి హాని కలిగించాలనే తపనే ఉంటుంది. కానీ, భారత్ లక్ష్యం పేదరికాన్ని నిర్మూలించటం. ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయటం. అభివృద్ధి చెందటం. దేశ సైన్యం బలంగా ఉన్నప్పుడే వికసిత్ భారత్ సాధ్యమవుతుంది. అప్పుడు మన ఆర్థికవ్యవస్థ బలంగా ఉంటుంది' అని ప్రధాని మోదీ అన్నారు. అంతేకాకుండా 2014లో ఇదే తేదీన ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారని గుర్తు చేసుకున్నారు.దోహద్?లో దాదాపు రూ.24వేల కోట్ల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. రైల్వే లోకోమోటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌తోపాటు 9వేల హార్స్‌పవర్ సామర్థ్యం కలిగిన దేశంలోనే తొలి లోకోమోటివ్ ఇంజిన్‌ను ప్రారంభించారు. రెండు రోజుల గుజరాత్ పర్యటనలో భాగంగా దోహద్, భుజ్, గాంధీనగర్‌లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. దాదాపు రూ.83వేల కోట్లతో చేపట్టే వేర్వేరు అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.మోదీపై పూల వర్షం

అంతకు ముందు పర్యటన సందర్భంగా రోడ్‌షో నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి గుజరాత్ పర్యటనకు వచ్చిన ప్రధానికి ఘనస్వాగతం లభించింది. వడోదర విమానాశ్రయం నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న వైమానిక కేంద్రం వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానిపై స్థానికులు పూలవర్షం కురిపించారు. ప్రధాని మోదీ కాన్వాయ్ సాగుతుంటే ప్రజలు తివర్ణ పతాకాలను చేతబూని సైన్యానికి అనుకూలంగా నినాదాలు చేశారు. ప్రధాని రోడ్‌షోలో అంతర్జాతీయ విద్యార్థులతోపాటు ఆపరేషన్ సిందూర్ సందర్భంగా మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన కర్నల్ సోఫియా ఖురేషి తల్లిదండ్రులు, సోదరుడు మహ్మద్ సంజయ్ ఖురేషి, సోదరి స్యానా సున్‌సారా పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** మే 26: నగర ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేయర్ గద్వాల విజయ లక్ష్మీ డివిజన్ ప్రజలను కోరారు. సోమవారం బంజారాహిల్స్ లోని ఎన్.బి.టి నగరంలో ప్రీ మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్ ను మేయర్ గద్వాల్ విజయ లక్ష్మీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... ఇంటిలో ఉన్న చెత్తను తప్పని సరిగా స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని, తెలిసిన వేయడక పోవడం, చెత్తను బయట వేయడం వలన దోమలు ప్రబలి వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని తెలిపారు. డివిజన్ ప్రజలు స్వచ్ఛ డివిజన్ గా తీర్చి దిద్దేందుకు నివాసితులు సహకరించాలన్నారు. వార్డు ప్రజలు తమ చెత్తను తప్పనిసరిగా స్వచ్ఛ ఆటో లకే ఇవ్వాలని కోరారు. కొన్ని ఏరియాలో బిన్స్ పెట్టిన వేయడం లేదని చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయవద్దని కోరారు. అదే విధంగా భవన నిర్మాణ వ్యర్థాలు కూడా రోడ్డుపై వేయ వద్దని, జీహెచ్ఎంసీ సి అండ్ డి వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ వారికి ఫోన్ చేస్తే వారే తీసుకొని పోతారని, బయట వేయడం మూలంగా అనారోగ్య బారిన పడే అవకాశం ఉంటుందని మేయర్ తెలిపారు.



హార్వెస్ట్ పిట్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. గత పదేళ్ల నుండి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించామన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు వద్దని చెప్పారు. ఎన్నికల సందర్భంలో మాత్రమే రాజకీయాలు చేయాలని అన్నారు. పరిశు భ్రతకు అందరు ఒక్కటై నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. బంజారాహిల్స్ వార్డు లో ఎన్.బి.టి నగర్, బోలానగర్, ఉదయ్ నగర్, ఖాజా నగర్, శ్రీరామ్ నగర్ లలో ఇల్లు కట్టుకోవడానికి అనుమతులు ఇవ్వడం జరిగిందని, నిర్మాణ సందర్భంగా ఏర్పడిన వ్యర్థాలు రోడ్డు పైన గాని, నాలాలలో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ లో అంగన్వాడీ, కమ్యూనిటీ హాల్, హెల్త్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. నల్ల వాటర్ కూడా రోడ్డు పై రాకుండా చేయాలని కొందరు నివాసితులు నల్ల పైపు రోడ్డు పై వదలడం మూలంగా రోడ్డు పై నీటి ప్రవాహం రావడంతో ప్రజలకు ఇబ్బంది కలుగుతున్నదని అందుకు పెద్దపెద్ద హార్వెస్ట్ పిట్లు ఏర్పాటు చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. దోమలు బెడదను నివారించేందుకు ముందస్తు గానే అన్ని కాలానిలో పాగింగ్ చేస్తారని మేయర్ అన్నారు.

అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ... ప్రీ శానిటేషన్ డ్రైవ్ లో బంజారాహిల్స్ మూడు నుండి 5 రోజుల్లో క్లీన్ చేయడం జరుగుతుందని, డివిజన్ లోని పలు కాలనీలో పనిచేసే శానిటేషన్ కార్మికులు వారిని ఏ మాత్రం వారికి ఇబ్బంది లేకుండా రెండో సారి అటెండెన్స్ తీసుకొనే సమయంలో కార్మికులు అందరూ ఒకే చోట పని చేసి మొత్తం శుభ్రం చేస్తారని అడిషనల్ కమీషనర్ తెలిపారు. ఇక్కడ మూడు రోజుల్లో పూర్తి చేసే మరొక డివిజన్ లో క్లీన్ వార్డు గా చేయడం జరుగుతుందన్నారు. ఆ విదంగా గ్రేటర్ లో ఉన్న150 వార్డులను క్లీన్ చేయడం జరుగుతుందని అడిషనల్ కమీషనర్ రఘు ప్రసాద్ పేర్కొన్నారు.

జలమండలి జి.ఎం హరిశంకర్ మాట్లాడుతూ... వర్షాకాలంలో పబ్లిక్ సేఫ్టీ వర్కర్ సేఫ్టీ ప్రాధాన్యనివ్వడం జరిగిందన్నారు. వాటర్ లాగింగ్ ఏరియాలో రెడ్ కలర్లో ఉన్న మ్యాన్ హెూల్స్ ప్రజలు ఓపెన్ చేయవద్దన్నారు. జిహెచ్ఎంసి చేసే ప్రతి కార్యక్రమానికి జలమండలి పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ... ఈ సారి వర్షాలు ముందుగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు, ఫాగింగ్, లాంటి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సహకరిస్తే క్లీన్ వార్డు గా చేస్తామన్నారు. స్వచ్ఛ ఆటో లోనే చెత్త వేయాలన్నారు. నీటినిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల ద్వారా 3 వేల మెగా వాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం

-సౌర విద్యుత్ ను ప్రోత్సహించే బృహత్తర పథకం పిఎం కుసుమ్

-రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

-4 పిఏసిఎస్ ఆధ్వర్యంలో ముందస్తుగా సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు

-పీఎం కుసుమ్ క్రింద సోలార్ ప్రాజెక్ట్ మంజూరు పత్రాలు అందించిన మంత్రి శ్రీధర్ బాబు



మంథని 3 వేల మెగా వాట్ల సోలార్ విద్యుత్ ను మహిళా సంఘాలు, వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు.

సోమవారం మంథని పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ కార్యాలయంలో మంథని ఫ్యాక్స్ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రూ. 2.90 కోట్ల నిధులతో మంథని మండలం గుంజ పడుగు గ్రామంలో పీఎం కుసుమ్ కార్యక్రమం క్రింద చేపట్టనున్న సోలార్ ప్రాజెక్టు మంజూరి పత్రాలను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు , కరీంనగర్ డిసిసిబి చైర్మన్ కే. రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సౌర విద్యుత్ ను ప్రోత్సహించే బృహత్తర పథకమే పిఎం కుసుమ్ అని,

కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పీఎం కుసుమ్ పథకాన్ని రైతులకు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అనుకూలంగా ఉండేలా రాష్ట్రంలోనే మొదటిసారిగా మన జిల్లాలో 4 చోట్ల సోలార్ ప్రాజెక్టు మంజూరు చేసుకున్నామని , దీనికి కృషి చేసిన జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పిఏసిఎస్ మంథని, పిఏసిఎస్ అప్పన్నపేట, పిఏసిఎస్ కాల్వ శ్రీరాంపూర్, పిఏసిఎస్ ధర్మారం, పిఏసిఎస్ చొప్పదండి పరిధిలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం కరీంనగర్ సహకార బ్యాంకు నుంచి 3 కోట్ల రూపాయల రుణం మంజూరు చేసినందుకు సంబంధిత అధికారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి సంవత్సరం వ్యవసాయ సహకార సంఘాలకు సోలార్ ప్రాజెక్టు ద్వారా 50 లక్షల రూపాయల ఆదాయం వస్తుందని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఉన్న ప్యాక్స్ ద్వారా సంవత్సరానికి 7300 కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయని అన్నారు. వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పెట్రోల్ పంప్, రైస్ మిల్ వంటి వివిధ వాణి వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు కృషి జరుగుతోందని అన్నారు.

జిల్లాలో ఉన్న 131 పిఏసిఎస్ లలో కూడా పీఎం కుసుమ్ క్రింద సోలార్ ప్రాజెక్టు విస్తరించేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న విద్యుత్ అవసరాలను తీరుస్తూ మహిళా సంఘాలు, వ్యవసాయ సహకార సంఘాలకు ఆదాయ వనరులు సృష్టిస్తున్నామని మంత్రి తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. రైతులకు, పరిశ్రమలకు గృహ వినియోగదారులకు ఇబ్బంది రావద్దని ప్రజా ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు తీసుకొని వచ్చిందని, 3 వేల మెగావాట్ల ఉత్పత్తి మహిళా సంఘాలు, వ్యవసాయ సహకార సంఘాల ద్వారా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. రైతు సంక్షేమ కార్యక్రమంలో భాగంగా 2 లక్షల రూపాయల రుణమాఫీ, రైతు భరోసా, ఆధునిక పరికరాల సబ్సిడీ, సన్న వడ్లకు బోనస్ వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామని, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రైతులందరికీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని అన్నారు.

విద్యుత్ వినియోగం పెరిగినప్పటికీ ఎక్కడ కూడా కోతలు విధించడం లేదని, 200 యూనిట్ల వరకు ఉచితంగా పేదలకు సరఫరా చేస్తున్నామని అన్నారు. జిల్లాలో సహకార సంఘాల తో పూర్తి స్థాయిలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కు కలెక్టర్ అధ్యక్షతన కృషి చేయాలని మంత్రి సూచించారు. నాప్ స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్టు విద్యుత్ ఉత్పాదన చేయడం ద్వారా సంవత్సరానికి రూ.50లక్షల ఆదాయం సమ కూరుతుందని అన్నారు. సహకార సంఘాలు వరి ధాన్యం కేంద్రాలను నిర్వహించకముందు సంఘాల పరిస్థితి అధ్వాన్నంగా ఉండేదని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆనాడు పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉన్న దుద్దిళ్ల శ్రీధర్ బాబు గొప్ప ఆలోచన చేసి కేంద్రాల బాధ్యతను సంఘాలకు అప్పగించడంతో పాటు గ్రామగ్రామన కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో సంఘాలు చాలా మెరుగుపడ్డాయని అన్నారు. ఈసారి 55లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు.అనంతరం

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పీఎం కుసుమ్ క్రింద ప్రతి మండలంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, మన జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చే కూడా సోలార్ ప్రాజెక్టు పెట్టించాలని నిర్ణయించి ముందుగా గుంజపడుగు, అప్పన్నపేట, ధర్మారం కాల్వ శ్రీరాంపూర్ 4 ప్యాక్స్ ఎంపిక చేసి అవసరమైన భూమి గుర్తించి మంజూరు చేస్తున్నామని తెలిపారు.ఎన్.పి.డి.సి.ఎల్ తో చర్చించి ప్రాజెక్టు ఆమోదింప చేశామని, నాబార్డు వారు కూడా అతి తక్కువ ఒక్క శాతం వడ్డీతో రుణాలు మంజూరు చేశారని, ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి సంవత్సరం కనీసం 50 నుంచి 70 లక్షల వరకు ఆదాయం వస్తుందని , ప్యాక్స్ వద్ద నిధులు అందుబాటులో ఉంటాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో కెడిసిసీ బ్యాంక్ జిల్లా సిఈఓ సత్యనారాయణరావు,జిల్లా సహకార అధికారి శ్రీమాల, పీడిసి సెల్ ఇన్చార్జ్ సత్యనారాయణ, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ,

సిరిసిల్ల గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఆర్.డి.ఓ. సురేష్,

సంఘ ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రాజబాపు, పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీష్ కుమార్, గడ్డం పోచం, లెక్కల కిషన్ రెడ్డి , కొత్త శ్రీనివాస్, ఉడుత మాధవి-పర్వతాల్ యాదవ్, దేవళ్ల విజయకుమార్, ఆర్డీఓ సురేష్, తహశీల్దార్ కుమారస్వామి,టిజిఈఆర్సీ సలహాదారు శశిభూషణ్ కాచే, ఆర్టీఐ మెంబర్ మంథని సురేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నాయకులు తొట్ల తిరుపతి యాదవ్, పేరవేన లింగయ్య, మూల సరోజన, కొమ్మిడి స్వరూప్, గుండా పాపారావు, పెంటరి రాజు, వొడ్నాల శ్రీనివాస్,శ్రీపతి బానయ్య, వికే.రవి, కెడిసిసి బ్యాంక్ డీజీఎం బ్రహ్మానందం, ఎజిఎం లొకె రాజశేఖర్, మేనేజర్ ఉదయశ్రీ, డిఈ దిలీప్, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, పలువురు నాయకులు, కెడిసిసి బ్యాంక్, సంఘ సిబ్బంది. రైతులు పాల్గొన్నారు.



ఢిల్లీ... ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తో కుటుంబ సమేతంగా కలిసిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా రాహుల్ గాంధీ తో రాష్ట్రంలో తాజా రాజకీయ అంశాలపై పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చర్చించారు.

# ప్రజాబలం

27 మే 2025 మంగళవారం


## కౌలు రైతులపై శీతకన్ను

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో కౌలు రైతులు (%ఖీఱతీఎవతీం%) తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. భూమిపై కౌలు హక్కులు లేకపోవటం వలన ప్రభుత్వ పథకాలకు, పంట నష్ట పరిహారాలకు, సంస్థాగత రుణాలకు దూరమవుతున్నారు. ముఖ్యంగా కౌలు భూమిని పొందటం భూకామందుల ఇష్టాలపై ఆధారపడవలసి వస్తున్నది. భారతదేశం వ్యవసాయిక దేశమని, వ్యవసాయం దేశానికి ఆయువు పట్టని పాలక పార్టీలతోపాటు ప్రతిపక్ష పార్టీలు నిత్యం జపించే మాటలుగా ఉన్నాయి. నేటికీ అత్యధిక ప్రజలకు జీవనాధారంగా ఉన్న వ్యవసాయ రంగం పరిస్థితి, వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్న కౌలు రైతులు, పేద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం ఎడల పాలక పార్టీలు అనుసరిస్తున్న విధానాలు నేడు దేశంలో, రాష్ట్రంలో చర్చించాల్సిన అంశంగా ఉంది. వ్యవసాయానికి సేద్యపు భూమి పునాదిగా ఉంది. ఆ భూమి సేద్యం చేసే వారి వద్ద ఉందా లేక సేద్యం చేయని వారి వద్ద బందీగా ఉందా అన్నదే కీలక అంశం. ఈ అంశమే వ్యవసాయ రంగం స్వరూపాన్ని తెలియచేస్తుంది. అధికార మార్పిడి జరిగి 77 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత కూడా భూసంబందాల్లో మౌలిక మార్పులు జరగలేదు. భూసంస్కరణ చట్టాలు పేదలకు భూములు పంచడంలో విఫలమై అలంకార ప్రాయంగానే ఉన్నాయి. సేద్యం చేసి పంటలు పండించే కౌలురైతుల, పేదరైతులకు సాగు భూమి లేదు. సేద్యం చేయని భూకామందుల వద్ద భూమి కేంద్రీకరణ జరిగింది. ఫలితంగా సేద్యం పై మక్కువ ఉన్న పేదలు భూకామందుల వద్ద భూమిని కౌలుకి తీసుకుని కౌలు దారులుగాను మరి కొందరు కూలీలుగా మారి భూకామందుల దోపిడీకి గురవుతున్నారు. అధికార మార్పిడి జరిగిన ప్రారంభంలో గ్రామీణ జనాభాలో 35% కౌలు రైతులే. కౌలుదారుకి సాగుదారుగా గుర్తింపు లేని పరిస్థితుల్లో దేశంలోని అనేక రాష్ట్రాల్లో హక్కుల కోసం,సేద్యపు భూమి కోసం కౌలు రైతులు, గ్రామీణ పేదలు ఆందోళనా పోరాటాలు చేశారు. ఈ పోరాటాలు కొన్ని ప్రాంతాల్లో మిలిటెంట్ రూపం తీసుకున్నాయి. వాటిల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అతి ముఖ్యమైనది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కౌలుదారీ సంస్కరణలు, భూసంస్కరణలు చేపట్టక తప్పలేదు. కేంద్ర ప్రభుత్వ కౌలుదారీ సంస్కరణల్లో భాగంగా 1950లో తెలంగాణ కౌలుదారీ చట్టం చేయబడింది. ఈ చట్టానికి ముందు వరుసగా ఆరు సంవత్సరాలు కౌలుదారులుగా ఉన్న వారిని రక్షిత కౌలుదారులుగా గుర్తించి వారికి భూమిపై హక్కులు కల్పించారు. సేద్యపు అవసరాల కోసం భూమిని తనకా పెట్టే హక్కు కూడా చట్టం కల్పించింది. నిబంధనల ప్రకారం కౌలు చెల్లించినంత కాలం కౌలుదారుగా కొనసాగుతాడు. కౌలు దారుకి కల్పించిన హక్కులతోపాటు భూయజమాని సొంత సేద్యం చేసుకునే హక్కు చట్టం కల్పించబడింది. దీన్ని ఉపయోగించుకుని భూకామందులు సొంత సేద్యం పేరుతో భూమి నుంచి కౌలుదారులను తొలగించారు. చివరికి కౌలు విధానం రాత పూర్వకం నుండి నోటి మాటకు మారింది. కౌలు రైతులకు ఎటువంటి హక్కులు లేకుండా పోయాయి. ఆచరణలో కౌలుదారీ చట్టం నిరుపయోగంగా మారింది. 1956లో రాష్ట్రాల పునర్వ్యస్థీకరణ చట్టం వచ్చింది. దేశంలోని రాష్ట్రాల సరిహద్దులు మారాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఒకే రాష్ట్రంగా ఏర్పడింది. 1956 లో ఆంధ్రప్రదేశ్ కౌలుదారీ చట్టం ఆనాటి ప్రభుత్వం చేసింది. ఇది ఆంధ్రా ప్రాంతానికే పరిమితం. తెలంగాణలో 1950 కౌలుదారీ చట్టమే అమల్లో ఉంది. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో తెచ్చిన కౌలుదారీ చట్టంలో లైసెన్స్ పొందిన కౌలు రైతులకు సంవత్సర ప్రాతిపదికన అర్హత కార్డులు ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. తెలంగాణలో అప్పటికి ఉన్న 17.4 లక్షల కౌలు రైతుల్లో 6.8 లక్షల మంది అర్హత కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా 2011- 12లో 5.1 లక్షల మందికి మాత్రమే కార్డులు ఇచ్చారు. 2012-13లో 4.1 లక్షల మంది కౌలుదారులకే కార్డులు పరిమితమయ్యాయి. ఈ కార్డులు కూడా బ్యాంకుల నుంచి కౌలు రైతులకు పంట రుణాలు అందించలేక పోయాయి. అందుకు కారణం రైతుల అనుమతి పత్రం లేకపోవటమే. ఈ చట్టం కూడా కౌలు రైతులను మభ్యపెట్టి వారి సమస్యలను పక్కదారి పట్టించేందుకు తెచ్చిందే. 2014లో ముఖ్యమంత్రిగా బాధ్యత చేపట్టిన కెసిఆర్ అసలు కౌలు రైతులనే గుర్తించలేదు. ఇది ఫ్యూడల్ అహంకారంనుంచి వచ్చిందే. రేవంతరెడ్డి ముఖ్యమంత్రిగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కౌలు రైతుల పరిష్కార విధానాలు చేపట్టలేదు. తెలంగాణలో 2021 -22లో వ్యవసాయ గణాంకాల లెక్కల ప్రకారం 63.12 లక్షల హెక్టార్ల భూవిస్తీర్ణంలో మొత్తం కమతాల సంఖ్య 64 లక్షలు. అందులో దాదాపు 22 లక్షల కమతాలు కౌలు రైతులవే. వారి సాగు చేస్తున్న భూమి 42% గా ఉంది. ప్రతి ముగ్గురు రైతుల్లో ఒకరు కౌలురైతే. 91% కౌలు చెల్లింపు నగదు రూపంలో ఉండగా, 7.5 శాతం పంట రూపంలో చెల్లిస్తున్నారని, 38.3% ఒప్పంద సమయంలోనే పూర్తిగా కౌలు చెల్లిస్తుంటే, 20.5% సగం కౌలు ముందు సగం తర్వాత చెల్లిస్తున్నారని, 41% కౌలు పంట కోతల తర్వాత చెల్లిస్తున్నారని రైతు స్వరాజ్ వేదిక స్టడీ తెలియచేస్తున్నది. రాష్ట్రంలో కౌలు రైతుల సంఖ్య, కౌలు భూమి విస్తీర్ణం నిరంతరం పెరుగుతూ ఉంది. అత్యధిక మంది కౌలుదారులు ముందుగానే కౌలు డబ్బులు చెల్లించి భూమి సాగు చేస్తున్నారు. పంట నష్టపోయిన సందర్భంలో ఎటువంటి సహాయం అందక అప్పుల్లో కూరుకుపోతున్నారు. భూమిని కౌలుకు ఇవ్వటం ప్రోత్సహించాలని ప్రపంచ బ్యాంక్ చెప్పినందుకు భారతదేశ రాష్ట్ర ప్రభుత్వాలు, భూసంస్కరణలు అమలు జరపకుండా భూమిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే వ్యవసాయ విధానాలు రూపొందిస్తున్నారు. దీన్ని సమర్ధించుకోవటానికి చిన్న కమతాల వ్యవసాయం లాభదాయకం కాదని, ఉత్పాదక పెరగదనే ప్రచారం ప్రారంభించారు. వాస్తవంగా చిన్న కమతాల వల్లే ఎక్కువ దిగుబడులు వస్తున్నాయని అనేక సర్వేలు వెల్లడించాయి. మోడీ ప్రభుత్వ సూచనల మేరకు నీతిఆయోగ్ భూమిలేని పేదల వ్యవసాయ సామర్థ్యం మెరుగు పరచటం కోసమంటూ 2016లో వ్యవసాయ భూమి కౌలుపై నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. దేశంలోని వివిధ రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోగల వ్యవసాయ భూమి లీజింగ్‌పై నమూనా చట్టం రూపొందించింది. ఈ నమూన చట్టంలో ప్రభుత్వ అందించే అన్ని రకాల సహాయాలకు కౌలురైతులు అర్హులు అయ్యే విధంగా చట్టం రూపొందించినట్లు చెప్పింది. యజమానికి పూర్తి భద్రత కల్పిస్తూ, కౌలు రైతుకు భూమిపై ఎటువంటి హక్కు ఉండదని, దీర్ఘకాలికంగా భూమిని కౌలుకు తీసుకున్న వారసత్వంగా భూమిని పొందలేడని, ఎలాంటి సమయంలోనైనా కౌలుదారుని ముందుగా హెచ్చరించి కౌలు రద్దు చేసుకోవచ్చని నమూన చట్టంలో పేర్కొన్నారు. భూపంపిణీ గురించి చట్టంలో ప్రస్తావనే లేదు.

గత కౌలుదారీ చట్టాల్లోనూ, నీతిఆయోగ్ నమూనా చట్టంలో గాని కౌలురైతుకు ఎటువంటి హక్కులు లేవు. భూయజమాని ఇష్టాయిష్టాలపై భూమి కోసం కౌలు రైతు ఆధారపడి ఉండాలి. ఇలాంటి చట్టాలు కౌలు రైతుల సమస్యలు పరిష్కరించవు. మానవ మనుగడకు వ్యవసాయం ప్రధాన జీవనాధారం. అలాంటి వ్యవసాయంలో ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతాంగం పరిస్థితి ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. సేద్యపు ఖర్చులు ఎక్కువ కావటం, అందుకు అనుగుణంగా పంటలకు ధరలు లభించకపోవటం, సంస్థాగత రుణాలు అందక అధిక వడ్డీలకు అప్పులు చేయటం, ప్రభుత్వం ప్రకటించే పరిహారాలు అందకపోవటం వల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్కో రైతు కుటుంబంపై 1,53,113 ఉండగా, కౌలు రైతు కుటుంబాలు మాత్రం సగటున 2.70 లక్షల రూపాయల అప్పుల్లో ఉన్నారు. ఇందులో రెండు లక్షలు ప్రైవేట్ వ్యక్తుల నుండి అధిక (24% నుండి 60% వరకు) వడ్డీలకు అప్పులు తీసుకున్నారు. రైతుల ఆత్మహత్యల్లో కూడా కౌలు రైతులు సంఖ్య ఎక్కువగానే ఉంది. పాలక ప్రభుత్వాలన్నీ భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను కాపాడుతూ పేద, కౌలు రైతుల వ్యతిరేక విధాలు అనుసరిస్తూ ఉన్నాయి. ప్రభుత్వాలు చేసిన కౌలు చట్టాలన్నీ అందుకు అనుగుణంగానే ఉన్నాయి. ఈ చట్టాలేవి కౌలు రైతుల సమస్యలు పరిష్కరించలేక పోయాయి. ఈ వాస్తవాన్ని తెలంగాణ కౌలు రైతులు గమనించి సమగ్రమైన కౌలుదారీ చట్టం కోసం గత ఉద్యమాల స్ఫూర్తితో ఉద్యమించాలి.

## ప్రపంచ స్థాయిలో మంథని మేధస్సుకు చిహ్నంగా నిలవాలని కృషి

-రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి డి.శ్రీధర్ బాబు

-స్థానిక యువత నైపుణ్యం పెంపోందించి పరిశ్రమల స్థాపనకు కృషి

-గ్రామీణ ప్రోటో టైపింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



మంథని ప్రపంచ స్థాయిలో మంథని మేధస్సుకు చిహ్నంగా నిలవాలని కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంథని పట్టణంలో బస్ డిపో సమీపంలో డ్రీమ్ స్టార్ట్ అండ్ రైస్ ఇన్నోవేషన్ నెట్వర్క్ లో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామీణ ప్రోటో టైపింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ ను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ టీ వర్క్స్ వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సాంకేతికత పరంగా వారికి ఉన్న నైపుణ్యాన్ని బయటికి తీసుకుని వచ్చేందుకు మంథని పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రోటోటైపింగ్ డ ఇన్నోవేషన్ సెంటర్ ఉపయోగపడుతుందని అన్నారు.

మంథని పట్టణంలో టీ వర్క్స్ బృందం నుంచి 3 శిక్షకులను నియమిస్తామని, భావితరాలకు విజ్ఞాన నిలయం గా మంథని ప్రాంతం నిలవాలని కృషి చేస్తున్నామని అన్నారు. స్థానికంగా ఉన్న పిల్లలకు కింది స్థాయి నుంచి సంపూర్ణ పరిజ్ఞానం అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు.

మన జిల్లా పరిధిలో ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రోటో టైపింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ ను పరిశీలించేలా చూడాలని కలెక్టర్ కు మంత్రి సూచించారు. పాఠశాల విద్యార్థులకే కాకుండా ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు కూడా వీటిని వినియోగించుకోవాలని అన్నారు.రైతులకు ఉన్న వివిధ సమస్యల పరిష్కారానికి వారికి వచ్చే వివిధ ఆలోచనలు కూడా కార్యరూపం దాల్చేందుకు సహకారం అందిస్తామని అన్నారు. ప్రపంచ స్థాయిలో మంథని మేధస్సుకు చిహ్నంగా నిలవాలని కృషి చేస్తున్నామని అన్నారు. హైదరాబాద్ కు దాదాపు 250 కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రాంతమైన మంథనిలో చిన్న సాఫ్ట్ వేర్ కంపెనీ తీసుకొని వచ్చామని, భవిష్యత్తులో ఇక్కడ విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని చూపించి అనేక కంపెనీలను తీసుకొని వస్తామని మంత్రి తెలిపారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రోజు వారి జీవనంలో మనకు ఉన్న అనేక సమస్యలను సాంకేతికతను వినియోగించి చిన్న చిన్న మార్పులు చేస్తే పరిష్కారం అవుతాయని మనకు ఆలోచన వస్తుందని, అటువంటి ఆలోచనలను వాస్తవ రూపంలో దాల్చేందుకు సహకారం అందించే దిశగా టీ వర్క్స్, డ్రీమ్ స్టార్ట్ అండ్ రైస్ ఇన్నోవేషన్ నెట్ వర్క్ బృందం ఆధ్వర్యంలో ముందుకు సాగడం జరుగుతుందని అన్నారు.పాఠశాలలో విద్యార్థులకు వచ్చే నూతన ఆలోచనలను ఇక్కడ ఉన్న ప్రోటో టైపింగ్ యంత్రాల , మెషిన్స్ ద్వారా తయారీకి ప్రయత్నిస్తామని అన్నారు. రోజువారి సమస్యల పరిష్కారం ఆలోచనలు ముందుగా చిన్న స్థాయిలో తయారుచేసి సరిగ్గా పని చేసినట్లయితే పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసేందుకు కూడా సహకారం అందుతుందని అన్నారు.

డ్రీమ్ స్టార్ట్ అండ్ రైస్ ఇన్నోవేషన్ నెట్ వర్క్ కు వయసుతో సంబంధం లేకుండా వినూత్న ఆలోచనలు ఉన్న ప్రతి ఒక్కరూ వచ్చి వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీ వర్క్స్ సంచాలకులు జోగేందర్, ఆర్.డి.ఓ. సురేష్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి: అడిషనల్ కమీషనర్ స్నేహ శబరీష్

### జిహెచ్ఎంసి వ్యాప్తంగా ప్రజావాణికి 166 ఆర్జీలు




హైదరాబాద్, మే 26: ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగర నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యల పై విన్నపాలను అడిషనల్ కమీషనర్ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత విభాగం అధికారులకు ఆదేశించారు.

ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ... ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలు వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికారులు వాటిని బాధ్యతతో పరిష్కరించాలని తెలిపారు.

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 62 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 33, ఇంజనీరింగ్ 4, ట్యాక్స్ సెక్షన్ 3, ల్యాండ్ అక్విజిషన్, హెల్త్, యు.సి.డి, యు.బి.డి విభాగాలకు రెండు చొప్పున, ఎలక్ట్రికల్, పి.ఓ.ఎల్.డబ్ల్యూ ఎస్, అడ్మిన్, కూకట్ పల్లి జోన్, శానిటేషన్, ఖైరతాబాద్ జోన్, ఎలక్షన్, ఎల్బీనగర్ జోన్, డి.సి 18, డి.సి 17 లకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు వచ్చాయి.

జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 104 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 40, సికింద్రాబాద్ జోన్ లో 27, శేరిలింగంపల్లి జోన్ లో 18, ఎల్బీనగర్ జోన్ లో 12, చార్మినార్ జోన్ లో 7 ఆర్జీలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జోనల్ కమీషనర్ అధికారులకు ఆదేశించారు

ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ లు యాదగిరి రావు, అశోక్ సామ్రాట్, వేణు గోపాల్, వేణుగోపాల్ రెడ్డి, అడిషనల్ సిసిపి లు గంగాధర్, వెంకన్న, ఎల్.ఏ.ఓ రాము నాయక్, హార్టికల్చర్ అధికారి సునంద, ఎలక్ట్రిసిటీ ఈఈ మమత, డిప్యూటీ సిఈ లు పనస రెడ్డి, పి వి రావు, హౌసింగ్ ఈ ఈ రాజేశ్వర రావు, జాయింట్ కమీషనర్ రెవెన్యూ మహేష్ కులకర్ణి, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్ ఏ ఏం సి జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహానాడుకు వెళ్తూ కార్యకర్త కొట్టుకెళ్లి టీతాగిన లోకేష్!

### అభిమాన నేత కదిలిరావడంతో చెంగాచారి భావోద్వేగం



కుప్పం/శాంతిపురం: కుప్పం నియోజకవర్గం శాంతిపురానికి చెందిన చెంగాచారి సాధారణ టిడిపి కార్యకర్త. గృహప్రవేశం నిమిత్తం కుప్పం వచ్చి గత రెండురోజులుగా బిజీబీజీగా ఉన్న రాష్ట్ర మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను కలిశాడు. చెంగాచారి బాగోగులను వాకబుచేసిన లోకేష్ మాటల్లో ఏం చేస్తుంటావని అడిగాడు. తాను తెలుగుదేశం పార్టీ వీరాభిమానినని, శాంతిపురంలో టీకొట్టు నడపుతూ జీవనం సాగిస్తున్నానని చెప్పాడు. కుప్పం నుంచి కడప మహానాడుకు బయలుదేరిన యువనేత లోకేష్ సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా టీకొట్టు వద్దకు వెళ్లాడు. అన్నా... చాలా దూరం వెళ్లాలి... టీ ఇస్తావా అని అడిగాడు. చెంగాచారికి కొద్దిసేపు నోటమాట రాలేదు. తమ అభిమాననేత నేరుగా తమ కొట్టుకురావడంతో సంభ్రమాశ్చర్యానికి లోనయ్యాడు. యువనేత లోకేష్ కు టీ గ్లాసు అందించాడు. వ్యాపారం ఎలా ఉందని అడగ్గా చెంగాచారి స్పందిస్తూ... సర్... నేను 1994 నుంచి తెలుగుదేశం పార్టీలో ఉంటున్నా. చంద్రబాబు గారంటే అభిమానం. నేను టిడిపికి చెందిన వాడినన్న కోపంతో గత అయిదేళ్లుగా నా టీ అంగడిని మూయించేశారు. గత ఏడాది జూన్ 12న చంద్రబాబు గారు సిఎంగా ప్రమాణ స్వీకారం చేశాక 17వతేదీ మళ్లీ టీకొట్టు ప్రారంభించా. నాకు ఇద్దరు ఆడబిడ్డలు, ఒకబిడ్డకు పెళ్లయింది... మరో కూతురికి పెళ్లి చేయాలి. మీరు మా అంగడికి రావడం నమ్మలేక పోతున్నా చిన్నయ్యా అంటూ భావోద్వేగానికి గురయ్యాడు. చెంగాచారి భుజం తట్టిన యువనేత లోకేష్... ఇప్పుడు నువ్వు ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. నీ వెంట నేనున్నా... ఏ అవసరమొచ్చినా నాకు ఫోన్ చెయ్యి అని చెప్పి ముందుకు సాగారు. కార్యకర్తకు యువనేత లోకేష్ ఎంతటి ప్రాధాన్యత నిస్తారనడానికి ఇదొక మచ్చుతునక.



లేఅవుట్లను తారుమారు చేసిన ప్రభుత్వ ఉద్యోగి కోగురి రాజేంద్రప్రసాద్ తండ్రి లక్ష్మి కాంతారావు పై చర్యలు తీసుకోవాలంటూ మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ కు తిమ్మసాని పల్లెకు చెందిన కందనూరి మంజుల కారెడ్డి బాల్రెడ్డిలు వినతి పత్రం అందజేశారు రెవెన్యూ విలేజ్ ఏనుగొండ తిమ్మసానీ పల్లె గ్రామం సర్వే నెంబర్ 222/1,224/%జూ% లో మొదట ఒక లే అవుట్ చూయించి దాని ప్రకారంగా ప్లాట్లు అమ్మారని ఏజెంట్గా వ్యవహరించిన కోగూరి ప్రసాద్ ప్రభుత్వ ఉద్యోగి కొంతమంది పెద్దల అండర్ దండలతో తిరిగి అదే ప్లాట్లను రివైజ్డ్ లేఅవుట్లుగా మార్చి తమ ప్లాట్లు తమకు దక్కకుండా చేశాడని అందువల్ల దస్తావేజు నెంబరు 14346/2015, మార్టిగేజ్ దస్తావేజు నెంబర్ 7719/2016 విస్తీర్ణం గల 500 గజాల స్థలం 250 210 గజాలు ఒక ప్లాట్లు తాము మొదట చూసిన దగ్గర లేవని వారు కంప్లైంట్ లో పేర్కొన్నారు కావున మేము కొన్న ప్లాట్ల స్థలము ఎక్కడుందో తెలియుట లేదు. కావున అట్టి లే-ఔట్ సంబంధిత కర్తలు = ఏజెంట్ సంబంధిత అధికారుల ద్వారా ఇట్టి అంశమును పరిశీలింపజేసి -ఇట్టి స్థలములో జరుగుచున్న నిర్మాణాలు, ఇట్టి అవకతవకల ప్లాట్ల వ్యవహారము పరిష్కారమయ్యే వరకు ఆపుదల చేసి మా ప్లాట్ల స్థలము మాకు తిరిగి స్వాధీనం చేయించగలరని వారు కలెక్టర్కు విన్నవించుకున్నారు

# సాహిత్య చరిత్రలో వెలుగు దీపం

తెలుగు సాహిత్య ప్రపంచంలో దీపాల పిచ్చయ్య శాస్త్రి (1894 – 1983) ఒక అద్భుతమైన పాండిత్యమూర్తి, సాహిత్య విమర్శకులు, కవి, అనువాదకులు. ఆయన సాహిత్య సేవ, విమర్శనాశక్తి, భాషా పరిశీలన, భక్తిరస కవిత్వం, శాస్త్రీయమైన రచనలతో తెలుగు సాహిత్యాన్ని ఒక కొత్త దిశలో నడిపించారు. 1894 మే 27న గుంటూరు జిల్లా బొమ్మరాజు పల్లె (కొన్ని ఆధారాల ప్రకారం కూచిరాజు పల్లె) గ్రామంలో వెంకట నరసయ్య, సరస్వతమ్మ దంపతులకు జన్మించిన శాస్త్రి బాల్యంలోనే అసాధారణ జ్ఞాపకశక్తి కలిగి, తండ్రి వద్దే సంస్కృతాంధ్రాలు, వ్యాకరణం నేర్చుకున్నారు. చిన్నతనం లోనే సంగీతం లోని ప్రవేశం, వీణ వాద్యంలో నైపుణ్యం, పద్యగానం విద్యార్థిగా తిరుపతి వేంకట కవుల ప్రభావం ఆయనను ఆశువుగా పద్యాలు చెప్పగలిగే స్థాయికి తీసుకు వెళ్ళింది. వినుకొండలో ప్రాథమిక విద్యతో పాటు గుర్రం జాషువాతో స్నేహం ఏర్పడింది. తిరుపతి వేంకట కవులు 1912లో వినుకొండలో అవధానానికి వచ్చినప్పుడు పిచ్చయ్య శాస్త్రి పద్యాల ప్రతిభతో ఆకట్టుకొని ప్రశంసలు పొందారు. విద్యాభ్యాసంలో మద్రాసు విశ్వవిద్యాలయం పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి, నెల్లూరు జిల్లా వెంకటగిరి మహారాజా కళాశాలలో 19 సంవత్సరాలు తెలుగు పండితులుగా పని చేశారు. సాహిత్య ప్రస్థానం కవిత్వంతో మొదలై, శాస్త్రీయ వ్యాఖ్యానాలు, విమర్శలు, సాహిత్య పరిశీలన వైపు మళ్లింది. విమర్శా రంగంలో ఆయనకు “విమర్శకాగ్రేసర” బిరుదు ఆంధ్ర సారస్వత పరిషత్తు ద్వారా లభించింది. భాషలోని లోపాలను నిర్భయంగా ఎత్తిచూపి, ఆంధ్రభాషా పరిశుద్ధత కోసం కృషి చేశారు. 1927లో వేదం వేంకటరాయ శాస్త్రి “మేఘసందేశ” వ్యాఖ్యానం లోని లోపాలను ఆంధ్రపత్రికలో విశ్లేషణ చేసి సంచలనం రేపారు. గిడుగు రామ్మూర్తి శాస్త్రి కూడా పిచ్చయ్య శాస్త్రి పాండిత్యాన్ని లేఖలో పొగిడారు. సూర్యరాయాంధ్ర నిఘంటువులో తప్పులను సవరించడం ద్వారా భాషా పరిశీలనలో ఆయనకున్న మక్కువను చాటారు. ఆయన రచనలు విస్తృతమైనవి. చిన్నతనంలోనే చాటు పద్యాలపై మక్కువతో “చాటు పద్య రత్నాకరము” (1917) సంకలనాన్ని వెలువరించారు. భక్తి ప్రధానమైన “భక్త కల్పద్రుమ శతకము” (1917) రచించారు. “కాలము”, “భారతి”, “సువర్ణ మేఖల”, “గాలివాన”, “ప్రణయ కుసుమము” వంటి కవితా సంపుటాలతో పాటు, “కుమార కథామంజరి”, “దశకుమార చరిత్రము”, “రఘు వంశము”, “మేఘ దూతము” వంటి వచన అనువాదాలు చేశారు. భాస నాటకాలను తెలుగులోకి అనువదించడం ఆయన ప్రతిభకు ఉదాహరణ. “సాహిత్య సమీక్ష” వ్యాసాల సంపుటి, “సారంగధర–జితకాశి” వ్యాఖ్యానాలు, “కానన ప్రహసనము”, “అరుణకిరణ” వంటి రచనలు ఆయన సాహిత్య విభిన్నతకు ప్రతీకలు.గుర్రం జాషువాతో చిన్ననాటి స్నేహం పిచ్చయ్య శాస్త్రి జీవితానికి ప్రత్యేక సంఘటన. జాషువా కవిత్వ రుచిని పిచ్చయ్య శాస్త్రి పరిచయం చేసినదని కూడా ప్రస్తావన ఉంది. జాషువా–పిచ్చయ్య శాస్త్రి జంటగా రచనలు చేయాలని ప్రయత్నించినప్పటికీ, అది కార్యరూపం దాల్చలేదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1969లో శాస్త్రిని విశిష్ట సభ్యుడిగా గౌరవించింది. భాషాసంస్కృతులను కడదాకా ఊపిరిగా భావించి1983 అక్టోబర్ 17న కాలం చేసిన దీపాల పిచ్చయ్య శాస్త్రి... విశ్వనాథ, తుమ్మల, జాషువా, జంధ్యాల, పుట్టపర్తి, గడియారం వంటి కవి పండిత మూర్ధన్యుల సరసన నిలువదగిన ప్రజ్ఞులు. ఆయన సాహిత్య జీవితం తెలుగు పాండిత్యపు వైభవానికి ఒక ప్రకాశవంతమైన సాక్ష్యం. భక్తిరసంతో కూడిన రచనలు, భాషా పరిశీలనలోని సాహసం, విమర్శనాశక్తి, శాస్త్రీయత, సులభభాషా శైలి ద్వారా పిచ్చయ్య శాస్త్రి తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయ వ్యక్తిగా నిలిచారు. ఆయన రచనలు నేటికీ పాఠకులను, పరిశోధకులను ఆకట్టు కుంటున్నాయి. తెలుగు భాషా చరిత్రలో దీపాల పిచ్చయ్య శాస్త్రి ఒక వెలుగు చూపే దీపస్తంభంగా నిలిచిపోయారు.

# నవయుగ వైతాళికుడు వీరేశలింగం

తెలుగులో తొలి నవల రచనకు నాంది పలికిన గొప్ప కవి ఆయన. మొదటి స్వీయ చరిత్ర రాసిన మహెూన్నత వ్యక్తి ఆయనే. తెలుగులో తొలి ప్రహసనం వ్రాసింది కూడా ఆయనే. మొట్ట మొదటి వితంతు వివాహం జరిపించిన గొప్పతనం ఆయనదే. ఆయనే నవయుగ వైతాళికుడిగా ప్రఖ్యాత గాంచిన కందుకూరి వీరేశలింగం పంతులు.బాల్యవివాహాల రద్దుకోసం ఉద్యమించిన మహెూన్నతుడు, గొప్ప సంఘ సంస్కర్త. మూఢ నమ్మకాలపై యుద్ధం ప్రకటించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 రాజమండ్రిలో జన్మించారు. బ్రిటిష్ హయాంలో బాల్య వివాహాలను నిరసిస్తూ ఆయన పెద్ద ఎత్తున ఉద్యమమే నిర్వహించారు. దీంతోపాటు అనేక సంఘ సంస్కరణలకు పాటు పడ్డారు. సామాజిక దురాచారాల నిర్మూలన కోసం నిరుప మానంగా కృషి చేశారు. ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించిన కందుకూరి, బాల్య వివాహాలు రద్దు కోసం ఉద్యమిస్తూనే .. వితంతు వివాహాలు జరిపించాలని కోరేవారు. దేశంలో మొదటి వితంతు వివాహం జరిపింది ఆయనే. సాహితీ వ్యాసంగంలోనూ విశేషంగా కృషిచేశారు కందుకూరి వీరేశలింగం పంతులు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన కందుకూరి. మొట్టమొదటి సహవిద్యా పాఠశాలను కూడా ప్రారంభించారు. తెలుగులో తొలి నవల వ్రాసింది. మొదటి స్వీయ చరిత్ర రాసింది కూడా ఆయనే. అంతేగాక తొలి ప్రహసనం కూడా కందుకూరి చేతినుంచి జాలువారింది. కందుకూరి జయంతిని నాటకరంగ దినోత్సవంగా జరుపుకుంటారు. జాతికి నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త, మన తెలుగు జాతి గర్వించదగ్గ మహెూన్నత వ్యక్తి . సంఘ సంస్కరణకు, సామాజిక దురాచారాల నిర్మూలనకు,తెలుగు సాహితీ వ్యాసంగంలోనూ నిరుపమానమైన కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. యుగకర్త గా, హేతువాదిగా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఒక వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయితగా అనేక విషయాలలో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు, ఆరాధ్యుడు. తెలుగు కవుల జీవిత చరిత్ర రాసిన మొదటి వ్యక్తి. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు రచయిత. ఆంధ్ర దేశంలో బ్రహ్మ సమాజం స్థాపకులు. యువజన సంఘాల స్థాపన కూడా ఆయనతోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేశారు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పని చేసారు. తాము నమ్మిన సత్యాన్ని, సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా పాటించిన ఆదర్శ వ్యక్తి. యుగకర్త గా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఆంధ్ర సమాజాన్ని సంస్కరణాల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం. ఆయన చేసిన ఇతర సంస్కరణా కార్యక్రమాలొక ఎత్తు, వితంతు పునర్వివాహాలొక ఎత్తు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని విస్తృత ప్రచారం చేసారు.వీరేశలింగం హేతువాది. ఆయన జీవితం సంఘసంస్కరణ, సాహిత్య కృషి రెండింటితో పెనవేసుకు పోయింది. ప్రభుత్వంలోని అవినీతిని ఏవగించుకుని ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాన్ని, అబద్ధాలు ఆడక తప్పదని న్యాయవాద వృత్తిని వదులుకున్న వ్యక్తి అటువంటి దురాచారాలపై ధ్వజమెత్తి, తన సంస్కరణా భిలాషను నిరూపించు కున్నారు. ఉన్నత విద్యానంతరం వీరేశలింగం అధ్యాపక వృత్తిని చేపట్టారు. రాజమండ్రి, కోరంగి, ధవళేశ్వరం, మద్రాసులలోని పాఠశాలల్లో పని చేశారు. అధ్యాపకుడిగా పనిచేస్తుండడంతో ‘పంతులు’గారని, వీరేశలింగం పంతులుగారని ప్రాచుర్యం పొందారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి 1876లో ఉపాధ్యావృత్తి నుండి జర్నలిస్టుగా మారి ‘వివేకవర్థిని’ అనే మాసపత్రికను ప్రారంభించారు. మొదట ఈ పత్రిక మద్రాసు నుండి వచ్చేది. తర్వాత కొంతమంది స్నేహితులతో కలిసి, రాజమండ్రి లోనే సొంత ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి పత్రికను నిర్వహించారు.ఆ రోజుల్లోనే లంచగొండితనం, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు%ా% ఇలా ఎన్నో అన్యాయాలు సమాజంలో జరుగుతుండేవి. వాటిపైకి తన పత్రిక ‘వివేకవర్థిని’ని ఆయన ఎక్కుపెట్టారు. ఉపన్యాసాలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా, ఆచరణాత్మకంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. తొలి వితంతు పునర్వివాహాన్ని 11 డిసెంబర్ 1881న తన ఇంట్లోనే జరిపించారు. నవల, వ్యాసం, ఉపన్యాసం, విమర్శ వంటి ప్రక్రియలకు ఆద్యులు. తెలుగులో వచ్చిన తొలి సాంఘిక నవల ‘రాజశేఖర చరిత్ర’ (1878) పంతులు గారు రాసిందే. సంఘసేవలో వీరేశలింగం ఎంత కృషి చేసారో, సాహిత్యం లోనూ అంతే కృషి జరిపారు. చదువుకునే రోజుల్లోనే రెండు శతకాలు రాసాడు. పత్రికలకు వ్యాసాలు రాస్తూ ఉండేవారు. వివేకవర్ధనిలో సులభశైలిలో రచనలు చేసేవారు. వ్యావహారిక భాషలో రచనలు చేసిన ప్రథమ రచయితలలో ఆయన ఒకరు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో అద్వితీయ ప్రతిభ కలవారు కందుకూరి. ఆయన 130కి పైగా గ్రంథాలు రాసాడు. అన్ని గ్రంథాలు రాసిన వారు తెలుగులో అరుదు. సాంఘిక దురాచారాలను సంభాషణాత్మకంగా, వినోదాత్మకంగా విమర్శించే ప్రహసనాల వంటి ప్రయోగానికి వీరేశలింగమే ఆద్యుడు.ఆంధ్ర సమాజాన్ని సంస్కరణల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం 1919 మే 27 న మరణించారు. వీరేశలింగం గొప్ప సంస్కర్తే కాదు, గొప్ప కవి, రచయిత. తెలుగు సాహిత్యంలో ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. ఆయన రచనలు, కవిత్వాల్లో కూడా అభ్యుదయ భావాలు నిండి ఉండేవి. తెలుగు సాహిత్యంలో ఆయనకు సమున్నతమైన స్థానం ఉంది. నవలలు, కథలు, వ్యాసాలు అన్ని రకాల సాహితీ ప్రక్రియల్లో వీరేశలింగం గారు తన దైన ముద్ర వేశారు. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకూ వీరేశలింగం ఉంటారు. సంస్కరణోద్యమం ఉన్నంత వరకూ ఆయన పేరు చిరస్థాయిలో నిలుస్తుంది. ఆయన వ్యక్తి కాదు,గొప్ప వ్యవస్థ అనేది నూటికి నూరుపాళ్లు నిజం.

# నవభారత నిర్మాత పండిత నెహ్రూ

హిందూ స్త్రీల దాస్య విముక్తికి, సమానత్వ సాధనకు కృషిచేసి సంఘ సంస్కరణ కర్తగా, స్వతంత్ర భారతావని సాంప్రదాయాలు, విధానాల రూపశిల్పిగా, నవభారత నిర్మాతగా, పేరెన్నిక గన్నారు చాచా నెహ్రూ. వివాహం కనీస వయస్సును, 12 నుండి 15 కి పెంచడం, సతులు... పతుల నుండి విడాకులు తీసుకుని ఆస్తి వారసత్వ హక్కు పొందడం, వరకట్న పద్ధతిని చట్టవిరుద్ధం చేయడం, దేశ తొలి ప్రభుత్వాధినేతగా, సమాజ సంస్కరణలలో సఫలీకృతులయ్యారు, జవహర్ లాల్. న్యాయవాదిగా పరిపూర్ణ రాజకీయవేత్తగా, రచయితగా, దేశ స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధానిగా, భారత రాజకీయాలను అత్యంత ప్రభావితం చేసిన నెహ్రూ – గాంధీ కుటుంబ అ మూలపురుషుడిగా సుపరిచితుడు అయిన నెహ్రూ, నేటి ఉత్తర ప్రదేశ్ లోని అలహాబాద్ నగరంలో కాశ్మీరీ బ్రాహ్మణ వంశంలో, ధనిక కుటుంబంలో, ప్రముఖ న్యాయవాది మోతిలాల్ నెహ్రూ, స్వరూప రాణిల తొలి సంతానంగా నవంబర్ 14, 1989లో జన్మించారు. సోదరీమణులైన కృష్ణ విజయలక్ష్మి పండిట్ లతో పాటు, “ఆనంద భవన్” లో ఆంగ్ల సాంప్రదాయ శిష్ట పద్ధతులలో పెరిగారు. బాల్యంలోనే హిందీ, సంస్కృతాలు, భారత సారస్వత గ్రంథాల పఠనా సక్తులు అయినారు. ఇండియన్ సివిల్ సర్వీసులో అర్హత పొందాలని తండ్రి కోరికను అనుసరించి, ఇంగ్లాండ్ నందలి హార్రో వెళ్ళాడు. పాఠశాల విద్య అక్కడ పూర్తిచేసి, 1907లో, కేంబ్రిడ్జ్ లో ప్రవేశ పరీక్ష రాసి, జీవశాస్త్ర అధ్యయనానికి కళాశాలకు వెళ్లి, 1910లో పట్టా పొందారు. అనంతరం న్యాయశాస్త్ర అ అధ్యయనానికి ఇన్నెర్ టెంపుల్ వెళ్లి, 1912లో ఉత్తీర్ణుడై అక్కడే న్యాయవాద వృత్తి చేపట్టాడు. వెనువెంటనే భారతదేశానికి తిరిగి రావడం జరిగింది. 1919లో జలియన్వాలా బాగ్ దుర్ఘటనకు ప్రభావితుడై, కాంగ్రెస్ ఆధ్వర్యంలో, దేశ స్వాతంత్ర్య సంగ్రామానికి ఆకర్షితుడై, సంగ్రామంలో తన శక్తులు లోడ్డుటకు ఉద్యుక్తుడయ్యాడు. మొదట మోతిలాల్ నెహ్రూ కుమారుని నిర్ణయాన్ని వ్యతిరేకించినా, తర్వాత ఆయన సైతం సంగ్రామంలో భాగస్వామి అయినాడు. అనంతరం మహాత్ముని నమ్మిన బంటుగా నెహ్రూ గుర్తింపు పొందాడు. ఆ సమయంలో 9 ఏళ్ళు జీవితం అనుభవించాడు. జీవితం సమయంలోనే 1334 లో “గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ’, 1936 లో తన జీవిత చరిత్ర 1946లో “ది డిస్కవరీ ఆఫ్ ఇండియా” రచనలు పూర్తిచేశాడు తొలిసారిగా గాంధీ నాయకత్వ పోరాటంలో, 1929 లో భారత జాతీయ కాంగ్రెస్ నేతగా, లాహెూర్ సమావేశాలకు నాయకత్వం వహించాడు. 1936,1937,1940 లలో, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైనాడు. యువకునిగా ఉన్న నాటి నుండే జాతీయ కాంగ్రెస్ లో, వామపక్ష భావజాల ప్రభావితుడై, సంపూర్ణ స్వాతంత్ర్య సముపార్జన ఆసక్తుడై, గాంధీ సలహాలతో, ప్రజాకర్షణ గల నేతగా, సంస్కరణవాదిగా స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖ్య భూమిక నిర్వహించి గాంధీ అనంతరం, రెండవ అగ్రశ్రేణి నాయకుడిగా గుర్తించబడి నాడు.1916లో కాశ్మీరీ బ్రాహ్మణ వంశస్థులు రాలైన కమలా కౌల్ తో వివాహితుడైన నాడు. ఫలితంగా కుమార్తె ఇందిరా ప్రియదర్శిని 19 17 నవంబర్ 19న జన్మించింది. కమలా నెహ్రూ 19 46 లో క్షయ వ్యాధితో మృతి చెందగా, కుమార్తె ఇందిర, సోదరి విజయలక్ష్మిలపై, ఎక్కువగా ఆధార పడడం జరిగింది. 1947 నుండి 64 వరకు దేశ ప్రధానిగా ఉన్న నెహ్రూ, సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు లో ప్రధాన పాత్ర పోషించి, 1952 లో దేశ తొలి ప్రధాని గా ఎన్నుకొనబడినాడు. 1947 ఆగస్టు 15న స్వతంత్ర్య భారత పతాకాన్ని ఎగరవేసిన తొలి భారతీయుడిగా, గౌరవం దక్కించుకున్న ఘనత ఆయనది. పార్లమెంటరీ తరహాలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛావాదం, పేద అణగారిన వారి పట్ల అనురాగం, ప్రధానిగా ఆయన రూపొందించిన విధానాలపై ప్రభావం చూపాయి.1964 మే 27న తన 74వ ఏట పరమపదించాడు. పంచశీల సూత్ర అనువర్తిగా, అలీనోద్యమ స్థాపనకులలో ఒకరిగా, యుద్ధానంతర కాల అంతర్జాతీయ ప్రముఖుడిగా, గౌరవసూచకంగా “పండిట్” గా పిలువబడిన నెహ్రూ, సుధీర్ఘ పదవీకాలం అనుభవాన్ని రంగరింప చేసుకున్న కూతురు ఇందిర, మనమడు రాజీవ్, ప్రధాని పదవులు పొందడానికి స్ఫూర్తి పొందా రనాడంలో, రవంతైనా అతిశయోక్తి లేదు.

# ఎల్ఐసీ గిన్నిస్ రికార్డు

ఎల్ఐసీ ఆఫ్ ఇండియా ఒక్కరోజులోనే 5,88,107 పాలసీల ద్వారా వెయ్యి కోట్ల రూపాయల ప్రీమియాన్ని 4,52,839 ఏజెంట్ల ద్వారా సేకరించి ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించింది. దీనికి సంబంధించి ఎల్ఐసీ చైర్మెన్ సిద్ధార్థ మహంతికి ధ్రువీకరణ పత్రాన్ని గిన్నిస్ బుక్ నిర్వాహకులు అందజేశారు. జనవరి 20న దేశవ్యాప్తంగా ”మాడ్ మిలియన్ డే” పేరుమీద నూతన వ్యాపారాన్ని సేకరించే లక్ష్యంతో ఏజెంట్లందరినీ పుర మాయించి ఎల్ఐసీ ఈ ఘనత సాధించింది. ఆ కార్యక్రమాన్ని దిగ్విజం చేసిన ఉద్యోగులు, ఏజెంట్లు, మార్కెటింగ్ అధికారులు సర్వదా అభినంద నీయులు. ఎల్ఐసీ రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని రికార్డులను నెలకొల్పే అవకాశముందని దీని ద్వారా ప్రస్ఫుటమవుతున్నది. గతేడాది ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ) ఏజెంట్ల కమిషన్, తదితర మార్పులను ఏకపక్షంగా అమలు చేసింది. దీంతో సంస్థలో కొంత నిస్పృహ పూరిత వాతావరణం నెలకొంది. మరోవైపు చట్టాల్లో పెనుమార్పులు తీసుకొచ్చి విదేశీ పెట్టుబడికి అనుకూలంగా ఇన్సూరెన్స్ రంగాన్ని మార్చే ప్రయత్నాలను కేంద్రం ముమ్మరం చేసింది. ఇన్సూరెన్స్ ప్రీమి యంపై జీఎస్టీని తగ్గించడంపై తాత్సారం చేస్తున్నది. అవసరం లేకున్నా జరిపిన వాటాల ఉపసంహరణ (ఐపీఓ) కూడా ఎల్ఐసీకి నష్టదాయకమే. ప్రతికూల పరిస్థితులన్నింటి మధ్య ఒక్క రోజులోనే మహత్తర రికార్డును సాధించడానికి నెహ్రూ స్థాపించిన ఈ ఆధునిక దేవాల యం పట్ల ప్రజలకున్న విశ్వాసమే కారణం.ఎల్ఐసీలో మెజారిటీ కార్మిక సంఘమైన ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) ప్రతి సంవత్సరం జనవరి 19ని ఇన్సూరెన్స్ బిజినెస్ జాతీయ దినోత్సవాన్ని నిర్వ హిస్తూ నూతన వ్యాపార విస్తరణ కోసం కృషిచేస్తున్నది. చైర్మెన్ పిలుపు మేరకు సదరు దినోత్సవాన్ని జనవరి 20న జరపాలని సభ్యులందర్నీ పురమాయించి ఈ మహత్తర కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడంలో ప్రధాన పాత్ర పోషించింది. పాలసీదారులకు గట్టి నమ్మకదారిగా ఉంటూ ప్రతిఫలాత్మక ఫలితాలను ఇవ్వడంలో ముందున్న ఎల్ఐసీలోకి యుకరక్తం రావాల్సిన ఆవశ్యకత ఉంది. రానున్న పదేండ్లలో పెద్ద సంఖ్యలో ఎల్ఐసీలో ఖాళీలు ఏర్పడబోతున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాలి. కానీ, కేంద్రం ఈ విషయంలో సహ కరించక పోవడం దురదృష్టకరం. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియో గించుకునేందుకు, కొత్త నియామకాలను చేపట్టేందుకు, ప్రతిభావంతులైన ప్రస్తుత సిబ్బందిని మరింత కార్యోన్ముఖులను చేసేందుకు ఎల్ఐసీకి స్వయం ప్రతిపత్తి కల్పించడం ఎంతో అవసరం. ఇది దేశ ఆర్థిక స్వావలంబనను పరిపుష్టం చేసే అంశం.మనదేశంలో ఇన్సూరెన్స్ రంగంలో ఎల్ఐసీతో పాటు మరో 26 కంపెనీలు న్నాయి. ఎల్ఐసీ ఒక్కరోజులో సాధించిన ఘనతను కొన్ని కంపెనీలు ఏడాది మొత్తం పనిచేసినా సాధించట్లేదు. దీన్నిబట్టే ఎల్ఐసీ పట్ల ప్రజలకున్న విశ్వాసమేంటో అర్థమవుతున్నది. ప్రయివేటు కంపెనీల వ్యాపా రాల్లో యాభై శాతం తప్పుదోవలోనే జరుగుతున్నట్టు పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక సర్వే ఎత్తిచూపింది. ఆ కంపెనీల్లో సిబ్బంది తొలగింపు నిష్పత్తి కూడా ఎక్కువే. పైగా, అవి పట్టణ ప్రాంతాలకే పరిమితం. ఎల్ఐసీ మాత్రం తన లక్ష్యాన్ని ఏనాడు కూడా మర్చిపోలేదు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ మంది ప్రజలకు ఇన్సూ రన్స్ కవరేజీ అందించే బాధ్యతను భుజాన వ్టేసుకున్నది. ఇలాంటి తరు ణంలో ఎల్ఐసీని కేంద్ర ప్రభుత్వం బలపర్చడం దేశ భవిష్యత్తుకు అవసరం.

# మహానాడులో టీడీపీ బిగ్ స్కెచ్...

కడప, మే 26, కడపజిల్లాలో ఫ్యాన్ ముక్కలవుతోందా? వైయస్సార్ కుటుంబ హవా తగ్గుతోందా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కడప అంటే ముందుగా గుర్తొచ్చేది వైయస్సార్. రాజకీయంగా మిగతా ప్రాంతాల్లో ఎలా ఉన్నా.. కడప జిల్లా అనేసరికి వైయస్ కుటుంబ అభిమానులు ఎక్కువగా ఉండేవారు. అందుకే అక్కడ రాజశేఖర్ రెడ్డి ఉన్నంతకాలం కాంగ్రెస్ పార్టీ హవా నడిచింది. తరువాత జగన్ నేతృత్వంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షిఫ్ట్ అయింది. కానీ మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణంగా దెబ్బతింది. అప్పటివరకు బలంగా కనిపించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రమేపి బలహీనపడడం ప్రారంభించింది. ఇప్పుడు ప్రత్యర్థులు సవాల్ విసిరుతుండడంతో కనీసం సమాధానం చెప్పేవారు కూడా కడపలో కరువవుతున్నారు.అధికారంతో సంబంధం లేకుండానే కడప జిల్లాలో వైయస్సార్ కుటుంబ హవా నడిచేది. కాంగ్రెస్ పార్టీని విభేదించి కడప పార్లమెంటు స్థానానికి పోటీ చేశారు జగన్మోహన్ రెడ్డి. దాదాపు ఐదున్నర లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. తిరుగులేని విజయం సాధించారు. 2014, 2019 ఎన్నికల్లో జిల్లాలో క్లీన్ స్వీప్ చేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. 2024 ఎన్నికలకు వచ్చేసరికి సీన్ మారింది. కూటమి ప్రభంజనం సృష్టించింది. పది అసెంబ్లీ స్థానాలకు గాను ఏడింట విజయం సాధించింది. అయితే ఈసారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అక్కడ కష్టాలు ప్రారంభమయ్యాయి. అక్కడ ఇక్కడ అన్న తేడా లేకుండా అన్ని నియోజకవర్గాల్లో టిడిపి కూటమి పట్టు బిగించడం ప్రారంభించింది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు మౌనం దాల్చుతున్నారు. మరికొందరైతే పార్టీకి గుడ్ బై చెబుతున్నారు.అధికారంలో ఉన్నన్నాళ్లు విభేదాలు కనిపించలేదు కానీ.. ఎప్పుడైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటమి ఎదురైందో.. అప్పటినుంచి అన్ని నియోజకవర్గాల్లో విభేదాలు బయటపడ్డాయి. సహజంగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ఇక్కడ బలంగా ఉంది. కానీ ఆ పార్టీ ద్వారా పదవులు దక్కించుకున్న వారు మాత్రం గుడ్ బై చెబుతున్నారు. దీంతో పార్టీ శ్రేణులను సమన్వయం చేసేవారు కరువవుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పదవులకు ఇటీవల రాజీనామా చేశారు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం. కేవలం పార్టీలో తలెత్తిన విభేదాలతోనే దూరమయ్యారు. మైదుకూరు మున్సిపల్ చైర్మన్ చంద్ర సైతం పార్టీకి రాజీనామా చేశారు. కడపలో ఒకేసారి ఎనిమిది మంది కార్పొరేటర్లు టిడిపిలో చేరారు. ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాల్లో కూడా అదే పరిస్థితి ఉంది.ఈనెల 27 నుంచి కడపలో మహానాడు జరగనుంది. ఈ వేదికపై కడప ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాడర్ టిడిపిలో చేరే పరిస్థితి కనిపిస్తోంది. దాదాపు అన్నిచోట్ల నేతలతో రాయబారాలు నడుస్తున్నాయి. అదే జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ పడటం ఖాయం. అయితే మహానాడు దృష్ట్యా చాలామంది పార్టీకి గుడ్ బై చెప్పే ఆలోచనతో ఉన్నట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి సమాచారం ఉంది. కానీ ఎటువంటి చర్యలకు దిగకపోవడం విశేషం.

# టీ03 డీ03 తో విజయసాయిరెడ్డి...

## వైరల్ గా మారిన వీడియో

విజయవాడ, మే 26 రాష్ట్రంలో లిక్కర్ స్కామ్ వ్యవహారంపై వేగంగా దర్యాప్తు జరుగుతోంది. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన వారిని అధికారులు ప్రశ్నించారు. వారిలో విజయసాయి రెడ్డి కూడా ఉన్నారు. అయితే.. ఆయన విచారణకు హాజరయ్యే ముందు టీడీపీ కీలక నేతతో భేటీ అయ్యారనే వార్త ఇప్పుడు సంచలనంగా మారింది.లిక్కర్ స్కామ్‌పై ప్రత్యేక దర్యాప్తు బృందం దూకుడుగా వెళ్తోంది. ఇప్పటికే గత ప్రభుత్వంలో కీలక వ్యవహరించిన నాయకులు, అధికారులను ప్రశ్నించింది. ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి సహా మరికొందరిని అరెస్టు చేసింది. అంతకుముందు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించారు. తాజాగా విజయసాయికి సంబంధించి సంచలన విషయం టాక్ ఆఫ్ ది ఏపీగా మారింది.లిక్కర్ స్కామ్ కేసులో సిట్ విచారణకు హాజరు కాబోయే ముందు రోజు సాయంత్రం.. విజయసాయి రెడ్డి తెలుగుదేశం పార్టీ కీలక నేత టీడీ జనార్ధన్‌ను కలిసినట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. టీడీ జనార్ధన్, విజయసాయి రెడ్డి ఒకరి వెంట ఒకరు.. ఒక ఇంట్లోకి వెళ్లడం, ఆ తర్వాత ఎవరికి వారుగా బయటకు వచ్చి వేర్వేరు కార్లలో వెళ్లడానికి సంబంధించిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ మద్యం స్కామ్ కేసులో విజయసాయిరెడ్డికి టీడీపీనేతలతో సంబంధం ఉన్న వీడియోను వైసీపీ నేతలు బయటపెట్టారు. ఇటీవల వైఎస్ జగన్ కూడా విజయసాయిరెడ్డి చంద్రబాబుతో విజయసాయిరెడ్డి లాలూచీ పడ్డారని ఆరోపించిన నేపథ్యలో ఈ వీడియో ప్రాధాన్యత సంతరించకుంది. విజయసాయిరెడ్డికి టీడీపీ నేతలు టచ్ లో ఉన్నారని తెలియజేసేందుకు ఈ వీడియోను వైసీపీ నేతలు విడుదల చేసినట్లు కనపడుతుంది. తెలుగుదేశం పార్టీతో కుమ్మక్కై విజయసాయిరెడ్డి తన పదవులకు రాజీనామా చేశారన్న దానికి కూడా ఈ వీడియో ఒక ఉదాహరణ అని వైసీపీ నేతలు చెబుతున్నారు. విజయసాయిరెడ్డిని లోబర్చుకున్న టీడీపీ నేతలు ఆయనను కలిసి జగన్ పై కావాలని మద్యం స్కాం కు సంబధించి ఆరోపణలు చేశారని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ హయాంలో జరిగిన మద్యం స్కామ్ కేసులో ఇప్పటికే ఏడుగురు కీలక నిందితులను అరెస్ట్ చేసిన స్పెషల్ ఇన్విస్టిగేషన్ చేసిన పోలీసులు ఈ కేసులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు మిధున్ రెడ్డితో పాటు అవినాష్ రెడ్డి తో పాటు జగన్ పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. ఇందులో మిధున్ రెడ్డికి ఇప్పటికే నోటీసులు ఇచ్చారు. అసలు ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డి పేరును బయటపెట్టింది విజయసాయిరెడ్డి. ఆయన ఆ పేరు బయటపెట్టిన తర్వాత మాత్రమే కేసులో మరింత వేగం పెరిగింది. రాజ్ కేసిరెడ్డితో పాటుగా తాజాగా మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, జగన్ ఓస్డీగా పనిచేసిన కృష్ణమోహన్ రెడ్డిలను కూడా సిట్ అధికారులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. . అయితే విజయసాయిరెడ్డిని కూడా సిట్ అధికారులు విచారణకు పిలిచిన సమయంలో తెలుగుదేశం పార్టీ కి చెందిన కీలక నేత, చంద్రబాబు నాయుడుకు అత్యంత ఆప్తుడు అయిన తొండెపు దశరథ జనార్ధన్ విజయసాయిరెడ్డితో సమావేశమవ్వడం ఈ వీడియోలో కనిపిస్తుంది. వైర్ పత్రిక కథనం కూడా ఈ విషయాన్ని ప్రచురించింది. దీంతో మద్యం స్కామ్ కేసులో విజయసాయిరెడ్డి టీడీపీ డైరెక్షన్ లోనే పనిచేస్తున్నారనడానికి ఇదే నిదర్శనమంటూ వైసీపీ నేతలు సోషల్ మీడియాలో పెద్దయెత్తున పోస్టింగ్ లు పెడుతున్నారు. కావాలని జగన్ తో పాటు ఆయన కోటరీగా చెప్పుకునే వారిని ఇబ్బంది పెట్టేందుకు విజయసాయిరెడ్డి టీడీపీ చేతిలో పావుగా మారారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. సిట్ విచారణకు హాజరయ్యే ఒకరోజు ముందు టీడీపీ నేత తొండెపు దశరథ జనార్ధన్ తో విజయసాయిరెడ్డి మాట్లాడటం, తర్వాత ఆయన బయటకు వచ్చి రాజ్ కేసిరెడ్డి పేరు బయటకు చెప్పడంతో పాటు కోటరీ గురించి కూడా ప్రస్తావించడం వంటి అంశాలను కలగలిపి ఈ అంశాన్ని హైలెట్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మార్చి 11 సాయంత్రం 5:49 గంటలకు విజయసాయి రెడ్డి.. తాడేపల్లిలోని పార్క్ విల్లేలో.. విల్లా నెం. 27లోకి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విల్లా ప్రముఖ నిర్మాత ఆది శేషగిరిరావుదని సమాచారం. విజయసాయి రెడ్డి లోపలికి వెళ్లిన కొద్ది సేపటికి.. టీడీ జనార్ధన్ అదే విల్లాలోకి వెళ్లారు. సుమారు 45 నిమిషాల పాటు వారిద్దరూ ఆ ఇంట్లోనే భేటీ అయినట్టు ప్రచారం జరుగుతోంది. సాయంత్రం 6:50 గంటలకు విజయసాయి రెడ్డి బయటకు రాగా.. ఆ వెంటనే జనార్ధన్ కూడా విల్లా నుంచి వెళ్లిపోయారు. దీనికి సంబంధించి సీసీ టీవీ ఫుటేజీ అంటూ వీడియోలు వైరల్ అవుతున్నాయి.లిక్కర్ స్కామ్ కేసు విచారణకు హారజరు కావడానికి కొన్ని గంటలు ముందు ఈ భేటీ జరగడం పలు అనుమానాలకు దారితీస్తోందని.. వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ భేటీ జరిగిన కొన్ని గంటలు తరువాత.. విజయసాయి రెడ్డి సీఐడీ విచారణకు హాజరైనట్టు తెలుస్తోంది. అయితే విజయసాయిరెడ్డి నుంచి జగన్ మీడియా సమావేశంలో విమర్శలు చేసిన తర్వాత ఎటువంటి రెస్పాన్స్ రాలేదు. దీంతో పాటు త్వరలోనే విజయసాయిరెడ్డి బీజేపీలో చేరి పదవులు పొందుతారన్న ప్రచారం కూడా సోషల్ మీడియాలో జరుగుతుంది. మొత్తం మీద జగన్ చేసిన ఆరోపణలకు అద్దం పడుతూ సాయిరెడ్డితో తొండెపు దశార్ధన్ కలిసిన వీడియో బయటకు రావడం ఏపీ రాజకీయాల్లో కలకలం రేపుతుంది. విచారణ తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు.

# పల్నాడులో ప్రతీకారాలు..

గుంటూరు, మే26 పల్నాడు జిల్లా.. సున్నితమైన ప్రాంతం. అందులోనూ మాచర్ల నియోజకవర్గం అత్యంత సున్నితమైనది. ఇక్కడ ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టం. ఫ్యాక్షన్ గొడవలు నిత్యం జరుగుతాయి. తాజాగా ఆధిపత్య పోరు కారణంగా.. ఇద్దరు టీడీపీ నాయకులను దారుణంగా చంపేశారు. పల్నాడు ప్రాంతం మరోసారి ఉలిక్కిపడింది. వెల్దుర్తి మండలంలో ఆధిపత్య పోరు ఇద్దర్ని బలి తీసుకుంది. బోదిలవీడులో జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు అనే అన్నదమ్ములిద్దరిని కారుతో ఢీకొట్టి హతమార్చారు. అత్యంత సమస్యాత్మక గ్రామం గుండ్లపాడుపై ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతోనే హత్యలు జరిగాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ రెండు హత్యలు ముందస్తు వ్యూహంలో భాగంగానే జరిగినట్టు తెలుస్తోంది.గుండ్లపాడు గ్రామానికి చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు.. తెలంగాణలోని నక్కలగూడెంకు ఓ శుభకార్యానికి వెళ్లారు. మొత్తం నాలుగు ద్విచక్ర వాహనాలపై 8 మంది వెళ్లారు. కార్యక్రమం ముగించుకుని అందరూ గుండ్లపాడుకు బయలుదేరారు. అయితే.. మాచర్ల నుంచి గ్రామానికి వెళ్లే క్రమంలో రెండు బైక్‌లు కొంత ముందుగా వెళ్లాయి. ఆ తర్వాత జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు బయలుదేరారు. వీరి వెనకాల జవిశెట్టి వెంకటేశ్వర్లు అల్లుడు, మరొకరు వస్తున్నారు.వీరందరికంటే ముందు గుండ్లపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై వెళుతూ.. వీరి సమాచారాన్ని ఎప్పటికప్పుడు హంతకులకు తెలియజేశారు. ఈ సమాచారం ఆధారంగా.. తొలుత రెండు ద్విచక్ర వాహనాలు వెళ్లిన తర్వాత.. మూడో బైక్‌పై వస్తున్న అన్నదమ్ములిద్దరిని కారుతో గుద్ది చంపేశారు. కోటేశ్వరరావు కొనఊపిరితో ఉన్నాడని గుర్తించి.. రాయితోమోది చంపేశారు. వెనుకగా వస్తున్న వారిని చూసి హంతకులు పరారయ్యారు. హంతకులకు సమాచారం ఇచ్చిన వ్యక్తి కూడా తన వాహనాన్ని అక్కడే పడేసి పారిపోయినట్లు ప్రచారం జరుగుతోంది.గుండ్లపాడు.. సున్నితమైన గ్రామం. ఇక్కడ గొడవలు జరగకుండా పోలీసులు అనేక చర్యలు చేపట్టారు. స్వయంగా జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పల్లె నిద్ర చేశారు. ప్రశాంత వాతావరణంలో జీవించాలని హితబోధ చేశారు. అయినా ఫలితం లేదు. వర్గపోరు ఆగలేదు. టీడీపీ కార్యకర్త చంద్రయ్య హత్య జరిగిన నాటి నుంచి గ్రామంలో పోలీసుల పికెట్ కొనసాగుతోంది. అయినా గొడవలు జరుగుతూనే ఉన్నాయి.ఈ గ్రామంలో ఏప్రిల్‌లో ఫ్లెక్సీ వివాదం రాజుకుంది. అప్పటినుంచీ శాంతిభద్రతలు అదుపులో లేవనే టాక్ వినిపిస్తోంది. వర్గపోరు నివురుగప్పిన నిప్పులా ఉంది. పోలీసులు ముందే ఈ విషయాన్ని గ్రహిస్తే.. ప్రాణాలు పోయేవి కావని అంటున్నారు. ఈ హత్యలపై స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. టీడీపీలోనే ఉంటూ కొందరు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని, అందుకే వారిని దూరం పెట్టానని, వీరికి పిన్నెల్లి సోదరులు వత్తాసు పలకడంతో జంట హత్యలు చేసినట్లుగా ఆయన ఆరోపించారు.

# కుప్పంలో చంద్రబాబు గ్రాండ్ ఎంట్రీ....

తిరుపతి, మే 26, ఏపీ సీఎం చంద్రబాబకొత్త ఇంటి గృహప్రవేశం అంగరంగ వైభవంగా సాగింది. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో సొంత ఇంటిని నిర్మించుకున్నారు. వేకువ జామున శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి.. కుటుంబ సభ్యులకు కలిసి గృహప్రవేశం చేశారు. ఈ వేడుకకు సుమారు 25 వేల మందికి విందు భోజనం ఏర్పాటు చేశారు. సొంత నియోజకవర్గంలో ఇల్లు కట్టుకోవాలనే ఆయన చిరకాల కోరిక నెరవేరింది. ఈ వేడుకలు పసుపు కుంకుమలతో మహిళలను ఆహ్వానించడం విశేషం. ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ అభిమాన నేత గృహప్రవేశంలో భాగస్వామ్యులయ్యారు. ఈ గృహప్రవేశంతో కుప్పంలో సందడి వాతావరణం నెలకొంది. కొద్ది రోజుల కిందట గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. అన్ని హంగులతో దీనిని నిర్మించారు.మూడున్నర దశాబ్దాలుగా కుప్పంనియోజకవర్గ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు చంద్రబాబు. అక్కడ సొంత ఇల్లు కట్టుకోవాలని చాలాకాలంగా భావిస్తూ వచ్చారు. స్థానికంగా ఇల్లు లేకపోవడంతో ప్రతిపక్షాలు సైతం విమర్శలు చేసేవి. అందుకే సొంత ఇంటిని నిర్మించుకోవాలని కొన్నేళ్ల కిందట నిర్ణయించుకున్నారు చంద్రబాబు. కుప్పంలోని శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ పరిధిలోని శివపురం వద్ద రెండు ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించారు. అన్ని హంగులతో ఇంటిని నిర్మించి ప్రారంభోత్సవం చేసుకున్నారు. కాగా శనివారం రాత్రికి చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి కుప్పం చేరుకున్నారు. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శనివారం మధ్యాహ్నం అక్కడకు చేరుకున్నారు. పి ఈ ఎస్ మెడికల్ కాలేజీ గెస్ట్ హౌస్ లో ఉన్నారు. గృహప్రవేశ ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్నారు.గృహప్రవేశ వేడుకల్లో మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు.. వారి కుమారుడు దేవాన్ష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. లోకేష్ దంపతులు కుప్పం చేరుకున్నారు. మరోవైపు ఏపీ సీఎం చంద్రబాబు మూడు రోజుల ఢిల్లీ పర్యటనను ముగించుకుని నేరుగా కుప్పం చేరుకున్నారు. గృహప్రవేశ వేడుకకు భారీగా ఏర్పాట్లు చేశారు. సుమారు 25 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. దీనికోసం ప్రత్యేకంగా షెడ్లు నిర్మించారు. శనివారం రాత్రి బంధుమిత్రులకు, విఐపి లకు విందు వడ్డించారు. ఇందుకుగాను ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. 25 వేల మంది సాధారణ ప్రజలకు, 2000 మంది వీఐపీలకు భోజనాలు సిద్ధం చేశారు.కుప్పం నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఇంటికి ఆహ్వానాలు పంపారు. ప్రతి ఒక్కరూ గృహప్రవేశానికి వచ్చి భోజనం చేసి వెళ్లాలని టిడిపి శ్రేణులకు సూచనలు అందాయి. మరోవైపు పసుపు కుంకుమలు ఇచ్చి మహిళలకు సాంప్రదాయ బద్ధంగా ఆహ్వానించారు. కుప్పంలో పండుగ వాతావరణం లో చంద్రబాబు గృహప్రవేశం జరిగింది. టిడిపి శ్రేణులు తమ సొంత కార్యక్రమంలో భావించి ఏర్పాట్లలో మునిగిపోయాయి.

# 42 మంది మహిళలు ఎక్కడ...

విశాఖపట్టణం, మే 26 విశాఖలో మహిళల మిస్సింగ్ కేసులు ఊహించని విధంగా పెరుగుతున్నాయి. కేవలం 4 నెలల్లో 175 మంది మాయమయ్యారు. ఇప్పటి వరకు 133 మంది ఆచూకీ మాత్రమే లభ్యమైంది. 42 మంది మహిళల అదృశ్యం ఇంకా మిస్టరీగానే మిగిలిపోయింది. ప్రేమ, వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలే మిస్సింగ్‌లకు కారణమని తెలుస్తోంది.విశాఖలో వరుసగా మహిళల అదృశ్య ఘటనలు కలవరం రేపుతున్నాయి. దాదాపుగా ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట మహిళలు మాయమవుతూనే ఉన్నారు. బాలికల నుంచి వివాహితుల వరకు చాలామంది కనిపించకుండా పోతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు.. తిరిగి ఇంటికి చేరకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వీరి కోసం కుటుంబ సభ్యులు.. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో.. చివరకు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.ఇటీవల విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మిస్సింగ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గత ఐదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా.. కేవలం నాలుగు నెలల్లోనే 175 మంది మహిళలు అదృశ్యమైనట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. మహిళల అదృశ్యానికి ప్రధానంగా ప్రేమ వ్యవహారాలు, వివాహేతర సంబంధాలే కారణమని పోలీసుల దర్యాప్తులో వెల్లడవుతోంది. కనిపించకుండా పోయిన యువతుల్లో ఎక్కువ మంది.. ప్రేమించుకోవడం, ప్రేమికుడిని దక్కించుకోవడం కోసమే ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లు సమాచారం.మధ్య వయస్కులైన మహిళలు కూడా.. వివాహేతర సంబంధాల కారణంగా కుటుంబాన్ని వదిలి వెళ్తున్నారు. మిస్సింగ్ కేసుల్లో సుమారు 75 శాతం వరకు ఈ రెండు కారణాలే ఉన్నాయని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. గత ఐదేళ్లలో ప్రతి ఏటా 50 నుంచి 186 కేసులు వరకు మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది నాలుగు నెలల్లోనే 175 కేసులు నమోదవడం.. పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందిజనవరి నెలలో 37, ఫిబ్రవరిలో 49, మార్చిలో 43, ఏప్రిల్‌లో 46 మంది అదృశ్యమయ్యారు. వీరిలో 133 మంది ఆచూకీని పోలీసులు గుర్తించారు. వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇంకా 42 మంది ఆచూకీ లభ్యం కాలేదు. వారి కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మిస్సింగ్ కేసుల పరిష్కారం కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారుమిస్సింగ్ అయిన మహిళలు, బాలికలను పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారుతోంది. కొంతమంది ఆచూకీ తెలుసుకున్నప్పటికీ.. మేజర్లు, చట్టాలు, హక్కులు పేరుతో చుక్కలు చూపించిన సంఘటనలు ఉన్నాయి. ఇటువంటి కేసుల్లో అదృశ్యమైన వారి ఆచూకీని పోలీసులు గుర్తించడం మినహా.. వారిని కుటుంబ సభ్యులకు అప్పగించడం పెద్ద సమస్యగా మారుతోంది. దీంతో కేసులు త్వరగా పరిష్కారం కావడం లేదు.

# ఏపీలో ఫేస్ పే టెక్నాలజీ...

విజయవాడ, మే 26 వేగంగా సేవలు అందించడానికి బ్యాంకులు ఎన్నో వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. అయినా క్షేత్రస్థాయిలో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సరికొత్త ఆలోచన చేసింది. ఫేస్ పే యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది.టెక్నాలజీ ఇంత పెరుగుతున్నా.. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు పొందడానికి ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. డబ్బులు తీసుకోవడానికి బ్యాంకుల్లో గంటల తరబడి నిలబడుతున్నారు. అప్పుడప్పుడు ప్రభుత్వ పథకాల నిధులు విడుదలైన సమయంలో రద్దీ విపరీతమైన ఉంటోంది. ఈ పరిస్థితుల్లో మార్పులు తెచ్చేందుకు ఏపీ గ్రామీణ బ్యాంకు.. కీలక నిర్ణయం తీసుకుంది. ఫేస్ పే పేరుతో.. ఓ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఖాతాదారులు రెండు నిమిషాల్లోపే బ్యాంకు నుంచి డబ్బు తీసుకెళ్లవచ్చని అధికారులు చెబుతున్నారు.సాధారణంగా ఖాతాదారులు బ్యాంకుకు వెళ్లి విత్ డ్రా ఫామ్ నింపి, కౌంటరులో ఇచ్చాక డబ్బులు తీసుకునేందుకు సమయం పడుతోంది. చదువురాని వారైతే.. మరొకరితో ఫామ్ నింపించుకోవాల్సి వస్తోంది. అప్పుడప్పుడు రాసే వారు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను నివారించేందుకు ఫేస్ పే యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉన్నవారు.. ఈ యంత్రం వద్ద నిల్చుంటే అందులోని కెమెరా ఆన్ అవుతుంది. అకౌంట్ నంబరు ఎంటర్ చేయాల్సిన పని లేదు. యంత్రం ఖాతాదారు ముఖాన్ని గుర్తించి వారి ఖాతాలో ఎంత సొమ్ము ఉందో చెబుతుంది. ఎంత కావాలో నమోదు చేయగానే.. వారి పేరుతో వోచర్ వస్తుంది. దీన్ని సరిచూశాక ఓకే అనే బటన్ నొక్కితే.. యంత్రం నుంచి ప్రింట్ వస్తుంది. దానిపై సంతకం లేదా వేలిముద్ర వేసి కౌంటర్‌లో ఇస్తే నగదు ఇస్తారు.ఫేస్ పే యంత్రాలను ప్రయోగాత్మకంగా ప్రస్తుతం పది శాఖల్లో ఏర్పాటు చేశామని.. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. ఖాతాదారుల ఫొటో డేటా ఆధారంగా ఇవి పని చేసేలా సాంకేతిక బృందం రూపొందించిందని వివరించారు. భవిష్యత్తులో ఏటీఎం తరహాలో డబ్బులు తీసుకునేలా సాంకేతికత అందుబాటులోకి తేవడానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలు సులభంగా నగదు తీసుకోవచ్చు అని స్పష్టం చేశారు.దేశంలో కొన్ని బ్యాంకులు, సంస్థలు ఈ సాంకేతికతను ప్రవేశపెడుతున్నాయి. దీని ద్వారా కార్డులు లేదా ఫోన్ అవసరం లేకుండానే నగదు తీసుకోవచ్చు. ఇది వేగవంతమైనదని బ్యాంకింగ్ రంగ నిపుణులు చెబుతున్నారు.

ఇది సురక్షితమైనదని అంటున్నారు. ప్రత్యేకించి డేటా సురక్షితంగా ఉంటుందని.. మోసపూరిత ప్రయత్నాలను నిరోధిస్తుందని వివరిస్తున్నారు. కళ్ల మధ్య దూరం, ముక్కు ఆకారం మొదలైనవి ఈ యంత్రం గుర్తిస్తుందని స్పష్టం చేస్తున్నారు.

# మహానాడులో రాయలసీమ రుచులు

కడప, మే 36, డపలో మహానాడు ప్రారంభం అవుతుంది. మొత్తం మూడు రోజుల పాటు జరిగే మహానాడుకు కోం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేపటి నుంచి మహానాడులో పాల్గొనేందుకు కడప కు కార్యకర్తలు రావడం ప్రారంభమవుతుంది. దీంతో మహానాడు ప్రాంగణం వద్ద, కడప జిల్లాలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐదారుగురు ఎస్పీ స్థాయి అధికారులు మహానాడు పర్యవేక్షణ బాధ్యతను తీసుకున్నారు. మహానాడు మూడు రోజుల పాటు అంటే ఈ నెల 27వ తేదీన ప్రారంభమై29వ తేదీన ముగియనుంది. మూడు రోజుల పాటు కడప నుంచే పరిపాలన జరుగుతుంది. ముఖ్యమంత్రి నుంచి మంత్రివర్గం దాదాపు అక్కడే ఉండటంతో అక్కడి నుంచే పాలన అందించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పార్టీ నేతలు చేశారు. ఇక మహానాడు అంటే అందరికీ గుర్తుకు వచ్చేది భోజనాలు. తెలుగుదేశం పార్టీ కార్యక్రమం అంటే భోజనం విషయంలో రాజీ ఉండదు. తృప్తిగా కార్యకర్తలకు భోజనాలు పెట్టే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమే. అత్యంత పకడ్బందీగా భోజన ఏర్పాట్లు చేయడంలో మంచి అనుభవం ఉన్న పార్టీ కూడా అది. రాష్ట్రంలోని అన్ని రకాల రుచులను ఎక్కడ పెట్టినా వండి వడ్డించడం మహానాడులో ప్రతి ఏడాది జరిగేదే. అదే సమయంలో ఎక్కడ మహానాడు జరిగితే అక్కడ ఫేమస్ అయిన వంటకాలు మిగిలిన ప్రాంతాల నుంచి వచ్చిన వారికి అందించడం కూడా ఒక్క టీడీపీలోనే సాధ్యమవుతుంది. భోజన ఏర్పాట్లు కూడా పకడ్బందీగా చేస్తారు. కార్యకర్తలు, నేతలు, మంత్రులు, అధికారులు, పోలీసులు ఇలా విడివిడిగా వారికి కౌంటర్లతో పాటు వివిధ ప్రదేశాల్లో ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తారు కడప జిల్లాలో జరిగే మహానాడులోనూ అదరిపోయే వంటకాలు సిద్ధం చేస్తున్నారు. దాదాపు ఇరవై రెండు రకాల వంటకాలు సిద్ధమవుతున్నాయి. కడపలో ప్రసిద్ధి చెందిన వంటకాలతో పాటు ఇరవై రెండు రకాల మెనూను సిద్ధం చేసినట్లు తెలిసింది. రోజులకు వేలాది మందికి టిఫిన్లతో పాటు స్నాక్స్ రెండు పూట భోజన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. మూడు రకాల చెట్నీలు కారంపొడి మామూలే. కాఫీ, టీలు మామూలే. వచ్చిన కార్యకర్త నుంచి నేతలు, మంత్రులు వరకూ ఇక్కడే భోజనాలు చేయనుండటంతో వారికోసం ప్రత్యేకంగా తయారు చేయడానికి ఇప్పటికే వంట తయారు చేసేవాళ్లు కడపకు చేరుకున్నారు. వారికి ప్రత్యేకంగా రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించడంతో అక్కడే వంటకాలు ప్రారంభించనున్నారు. కూరగాయలు తరగడం దగ్గర నుంచి వంటలు సిద్ధమయ్యే వరకూ ఆ రెండు ఎకరాల్లోనే చేయాలని, వెజ్, నాన్ వెజ్ లకు ప్రత్యేకంగా నిపుణులైన వారిని రప్పించారు. కడపలో మహానాడులో బ్రేక్ ఫాస్ట్ కింద కడప ఎర్ర కారం దోసెలతో పాటు ఇడ్లీ, వడ, పొంగల్, పూరిలను సిద్ధం చేయనున్నారు. అలాగే భోజనాల్లోకి వెజిటేరియట్ లో గుత్తివంకాయ కూరతో పాటు దొండకాయ ఫ్రై, పప్పు, సాంబారు, రసం, గడ్డ పెరుగుతో వడ్డించనున్నారు. ఇక నాన్ వెజ్ లో మటన్ కర్రీ, రొయ్యల వేపుడు, చికెన్ వేపుడు, చేపల పులుసు వంటివి సిద్ధం చేస్తున్నారు. అయితే అన్నిజిల్లాలకుచెందిన వారు వస్తుండటంతో రాయలసీమ రుచులతో పాటు కోనసీమా, కోస్తాంధ్రకు సంబంధించిన ప్రత్యేక వంటకాలు కూడా సిద్ధం చేశారు. దీంతో పాటు తూర్పు గోదావరి జిల్లా నుంచి కాకినాడ కాజా, పూతరేకులు, కాళహస్తి పాలకోవా, బాదూషా, మాడగుల హల్వా వంటివి కూడా తెప్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని ప్రాంతాల పిండి వంటకాలతో పాటు అన్ని ప్రాంతాలకు చెందిన రుచులను మహానాడులో అందించనున్నారు.

# నాసిరకం రోడ్ల నిర్మాణం వాహనదారుల ఆగచాట్లు

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్లో నాసిరకం పనులు నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యం గా నిలుస్తున్నాయి. పెట్రోల్ బంక్లో డీజిల్ కోసం వెళ్లిన లారీ రోడ్డు కుంగి పల్టీ కొట్టిన ఘటన నాణ్యత లేమి పనులను తేటతెల్లం చేస్తుంది.జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మించిన డ్రైనేజీ బ్రిడ్జిపై నుంచి లారీ వెళ్తుండగా, ఒక్కసారిగా కుంగిపోయింది. నాసిరకం పనుల వల్ల వాహనాలు పల్టీ కొట్టడం ఇది మొదటిసారేమీ కాదంటున్నారు స్థానికులు. గతంలో మోటార్ బైక్లు వెళ్లినా కుంగిపోయిన సందర్భాలున్నాయని చెబుతున్నారు. ×నాణ్యతా ప్రమాణాలు గాలికి వదిలేసిన క్వాలిటీ కంట్రోల్ అధికారుల నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతోంది. నేషనల్ అథారిటీ కావడంతో పట్టించుకునేవారే లేక, ప్రజలు నరకయాతన పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నాణ్యతలేని పనులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సింహాచలంలో స్వర్ణపుష్పార్చన

విశాఖపట్నం విశాఖ సింహాచల పుణ్య క్షేత్రంలో వరాహలక్ష్మీనృసింహ స్వామి వారికి బంగారు సంపెంగలతో స్వర్ణ పుష్పా ర్చన నిర్వహించారు భక్తులు. దేవ స్థాన వేద పండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా పలు ఆర్జిత సేవలు వైభ వంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్ర భాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్ర దాయబద్ధంగా నిర్వహించారు. అనం తరం ఆలయ మండపంలోకి దేవేరులు శ్రీదేవి, భూదేవితో శ్రీగోవిందరాజుల స్వామి వేంపుచేశారు. అనంతరం వేద పండితులు శాస్త్రోక్తంగా అర్చన నిర్వహించారు.

# మన్యంలో సిరులు కురిపిస్తున్న బిర్యానీ ఆకులు

విజయనగరం, మే 25, వ్యవసాయ దండగ అన్నమాట ఇటీవల ప్రతి నోటా వినిపిస్తుంది. దానికి కారణాలు లేకపోలేదు. సరైన నీటి వసతి లేకపోవడం, ప్రకృతి విపత్తులు, చీడపీడలు, మద్దతు ధర లేకపోవడం, సాగు ప్రోత్సాహం కరువు అవ్వడం వంటి కారణాలతో వ్యవసాయం అంటేనే ఒక రకమైన భావం ఏర్పడింది. రైతులు సైతం ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు ఎంచుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో సరికొత్త సాగు విధానంలో అడుగుపెట్టిన కొంతమంది రైతులు విజయవంతం అయ్యారు. సంప్రదాయ పంటలకు భిన్నంగా.. అధిక ఆదాయం ఇచ్చే పంటలను పండించి లక్షలు, కోట్లు ఆర్జించిన వారు ఉన్నారు. అటువంటి వారు మిగతా వారికి ఆదర్శంగా మారుతున్నారు.పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఉత్తర్ దినాజ్ పూర్ జిల్లా లఖిపూర్ గ్రామానికి చెందిన సుకుమార్ బర్మన్ అనే యువరైతు వినూత్నంగా ఆలోచించాడు. 2007లో తొలిసారి బిరియాని ఆకు సాగు మొదలుపెట్టాడు. తనకున్న నాలుగు ఎకరాల్లో.. ఒక ఎకరాను బిరియాని ఆకు కోసం వదిలేశాడు. నాటిన మొక్కలు మూడేళ్ల తర్వాత చెట్లుగా ఎదిగాయి. వాటిని విక్రయిస్తే క్వింటా రూ.2500 వరకు పలికింది. బియ్యం క్వింటా వెయ్యి రూపాయలు కూడా రాని రోజులు ఇవి. ఆ లాభంతో ఉబ్బితబ్బిబైన సుకుమార్ బర్మన్ ఇతర రైతులను అటువైపు ప్రోత్సహించాడు. దీంతో ఆ జిల్లా వ్యాప్తంగా బిర్యానీ ఆకు సాగు విస్తరించింది. ఎకరా పొలంతో మొదలుపెట్టిన సాగు.. ఎనిమిది వందల ఎకరాలకు చేరింది. 100 కోట్ల టన్నుల దాకా దిగుబడి వస్తోంది. చెట్లనుంచి దూసిన ఆకులను గ్రేడ్లను బట్టి విభజించి ఎండబెట్టే బాధ్యత మహిళదే. దీంతో మహిళలకు కూడా ఉపాధి దొరుకుతుంది. బిర్యానీ ఆకు సాగులో ప్రతి మూడేళ్లకు ఒకసారి రైతు 5 లక్షల వరకు లాభ పొందుతున్నాడు. రైతులంతా కలిసి దీన్ని సుమారు 400 కోట్ల పరిశ్రమగా మార్చారు అంటే.. ఏ స్థాయిలో మార్పు చేశారో అర్థం అవుతోంది.పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన గూడలు అధికంగా ఉండేవి. 15 ఏళ్లు వచ్చేసరికి బాలికలకు అక్కడ వివాహం చేసేవారు. బాలురు సైతం చిన్న చిన్న పనులకు బయటకు వెళ్లేవారు. అటువంటిది ఇప్పుడు ఆ గిరిజన గ్రామాల్లో బాల్యవివాహాలు తగ్గాయి. బాలికలతో పాటు బాలురు విశాఖతో పాటు విజయనగరంలో పాలిటెక్నిక్ డిప్లమోలలో చేరుతున్నారు. దానికి కారణం ప్రకృతి వ్యవసాయం. పార్వతీపురం మన్యం జిల్లాలోని ఓ 30 గిరిజన గూడల్లో ఆర్ట్స్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రకృతి వ్యవసాయంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించింది. పూర్తిగా మట్టిలోని సహజ పోషకాలను నమ్మి చేసేదే ఈ తరహా వ్యవసాయం. ఓ పంట కింద అంతర్ పంటలను వేస్తూ.. అవి పరస్పర పోషకాలుగా మారేలా చూస్తారు. ముఖ్యంగా ఫిబ్రవరి నుంచి ఆగస్టు దాకా ఖాళీగా ఉండే పంట పొలాల్లో వంగ, బీర, సొర తదితర కూరగాయల సాగు చేపడుతున్నారు. ఇక్కడ రైతులు ఎకరం పొలంలోనే ఏడాదికి 25 రకాల పంటలను వేస్తున్నారు. ఏటా ఎకరాకు మూడు లక్షల రూపాయల ఆదాయం వస్తుండడంతో తమ పిల్లలను చదువుకు ప్రోత్సహిస్తున్నారుఅంతరించిపోతున్న బార్లీ సాగును ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేశాడు సెతాన్ దుర్జేయ్ అనే యువకుడు. లద్దాక్ ప్రాంతంలో బార్లీ పంట విస్తారంగా పండేది. అయితే బార్లీ పంట సాగు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు లభించేది కాదు. దీంతో భారత సైనికుల దగ్గర బరువులు మోసే పోర్టర్ గా మారాడు. ఉత్తర భారత దేశంలో బార్లీ సూప్ లకు ఉండే డిమాండ్ చూసాడు. ఈ నేపథ్యంలో లద్దాక్ ప్రాంతంలో పండే బార్లీ ని.. ఎండు జున్నులకు వివిధ మూలికలను చేర్చి.. సూప్ మిక్స్ లను తయారుచేసి విక్రయించాడు. వాటికి మంచి ఆదరణ దక్కడంతో సియాచిన్ నేచురల్స్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేశాడు. స్టార్ టాప్ కంపెనీగా ప్రారంభమైన దాని ప్రస్థానం.. ప్రతి బార్లీ రైతు కుటుంబంలో వెలుగు నింపుతోంది. సాగు గిట్టుబాటు అవుతోంది.

# టాలీవుడ్ పెద్దలు రాజకీయం

హైదరాబాద్, మే 26 టాలీవుడ్ పెద్దల తీరుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అసంతృప్తికి గురయ్యారు. గత ప్రభుత్వం ఎంత వేధించినా.. ప్రస్తుత ప్రభుత్వం టాలీవుడ్ సమస్యల పట్ల ఎంతో సానుకూలంగా ఉంది. ఎలాంటి ప్రతిపాదన వచ్చినా అంగీకారం తెలియచేస్తోంది. అయినప్పటికీ టాలీవుడ్ ప్రభుత్వం, ప్రభుత్వ పెద్దల పట్ల వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. సినీ పరిశ్రమ వైపు నుంచి కుట్రలు చేయడానికి కూడా వెనుకాడటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం సినీ పరిశ్రమను చూసే విధానం కూడా మారే సూచనలు కనిపిస్తున్నాయి. దీనంతటికి కారణం సినీ పరిశ్రమ పెద్దలే. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో టాలీవుడ్ చాలా సమస్యలు ఎదుర్కొంది. మినిమం టిక్కెట్ రేటును పది రూపాయలుగా ఖరారు చేశారు. అక్కడి నుంచి మెగాస్టార్ చిరంజీవి చేతులు జోడించి జగన్ ను వేడుకునే వీడియో విడుదల చేయడం వరకూ టాలీవుడ్ అనేక అవమానాలు ఎదుర్కొంది. టిక్కెట్ రేట్లు పెంచాలంటే.. హీరోలు వచ్చి వ్యక్తిగతంగా కలిసి దండాలు పెట్టుకుని వెళ్లాల్సిన అవసరం ఉండేదన్న విమర్శలు వచ్చాయి. చివరికి టిక్కెట్ రేట్లను పెంచడానికి అనేక షరతులు పెట్టారు. వ్యక్తిగతంగా వచ్చి కలిస్తేనే టిక్కెట్ రేట్లు పెంచుకోవడానికి జీవోలు వచ్చేవి.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సినీ పరిశ్రమకు ప్రోత్సాహం లభిస్తోంది. ఇండస్ట్రీ గుర్తింపు ఇస్తామని కూడా ప్రభుత్వం టాలీవుడ్ పెద్దలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో కొంత మంది టాలీవుడ్ పెద్దలు పవన్ కల్యాణ్ తో సమావేశమయ్యారు. అప్పటి నుంచి సినీ పరిశ్రమకు సంబంధించి ఎలాంటి అవసరాన్ని అయినా ప్రభుత్వం పరిష్కరిస్తోంది. టిక్కెట్ రేట్ల పెంపుదల జీవోలు ఇస్తోంది. షూటింగ్‌లకు అనుమతుల విషయంలో ఆలస్యం కావడం లేదు. స్వయంగా టాలీవుడ్ అగ్రహీరో డిప్యూటీ సీఎంగా ఉండటంతో సమస్యలు ఉండవనుకున్నారు. కానీ ఇప్పుడు కొంత మంది డిప్యూటీ సీఎం సినిమానే టార్గెట్ చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. థియేటర్లు యజమానుల చేతుల్లో లేవు. నలుగురు చేతుల్లోనే ఉన్నాయి. ఇప్పుడు ఆ నలుగురు కలిసి థియేటర్లు మూసేద్దామని ప్లాన్ చేశారు. అది కూడా పవన్ సినిమా ఎదురుగా ఉన్న సమయంలో. దీంతో కుట్రలేమిటో అర్థమైపోయింది. టాలీవుడ్ మీద గత ప్రభుత్వం కుట్రలు చేస్తూంటే.. ఈ ప్రభుత్వంపై టాలీవుడ్ పెద్దలే కుట్రలు చేస్తున్నారన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై స్పష్టమైన అవగాహన ఉండటంతో పవన్ కల్యాణ్ కూడా అసహనానికి గురవుతున్నారని అంటున్నారు. అందుకే తమకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలనుకున్నారని ఆయన నర్మగర్భంగా వ్యాఖ్యానిస్తున్నారు. థియేటర్ల విషయంలో చర్యలకు పవన్ సిద్ధమయ్యారు. ఇప్పటి వరకూ టాలీవుడ్ పెద్దలంతా కలిసి చంద్రబాబును కలవకపోవడంతో వారి ఇంటెన్షన్ ఏమిటో తెలిసిపోతుందని అంటున్నారు. ఏపీ ప్రభుత్వం పట్ల సినిమా పెద్దలు వ్యవహరిస్తున్న తీరు చూసిన తర్వాత చాలా మంది.. జగన్ లా ఉంటేనే సినిమావాళ్లకు తిక్క కుదురుతుందని మంచిగా ఉంటే ఇలాగే రాజకీయ కుట్రల్లో భాగమవుతూంటారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇండస్ట్రీ మొత్తం నలుగురి చేతుల్లో ఉందని..వారంతా కలిసి ఈ పనులు చేస్తున్నారని అంటున్నారు. టాలీవుడ్ నిర్మాతలు అడిగినట్లు టికెట్ రేట్స్ పెంచుతూ... అడిగినన్ని షోలకు అనుమతులు ఇవ్వడంలో పవన్ కళ్యాణ్ ఎటువంటి అభ్యంతరాలు పెట్టకుండా ముందుకు వెళుతుంటే... ఆయన సినిమా విడుదల సమయంలో అడ్డంకులు సృష్టించడం పట్ల ఘాటుగా స్పందించారు. టాలీవుడ్ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్‌ను స్వీకరించినట్లు తెలిపారు. అలాగే, థాంక్స్ చెప్పారు. ఇప్పటినుంచి వ్యక్తిగత హోదాలో వచ్చే టాలీవుడ్ నిర్మాతలను కలిసేది లేదని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఎటువంటి చర్చలకు తావు లేదని స్పష్టం చేశారు. సంబంధిత విభాగం ప్రతినిధులతోనే చర్చిస్తామని వివరించారు. సినిమా రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక పాలసీ తీసుకు రావాలని పవన్ కళ్యాణ్ డిసైడ్ అయ్యారు. థియేటర్ల ఆదాయం, వాటి వసతుల మీద నివేదిక ఇవ్వాలని అధికారులను కోరారు.ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఒక గ్రూపుగా ఏర్పడి చేస్తున్న వ్యవహారాలతో పాటు ప్రేక్షకులు పెడుతున్న టికెట్ రేటు, అందుకు పొందుతున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయి? వంటి అంశాలను సంబంధిత అధికారులతో పవన్ కళ్యాణ్ ఇప్పటికే చర్చించారు" అని ఏపీ ఉప ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది. థియేటర్లు లీజుకు తీసుకున్న వ్యక్తుల నుంచి పన్ను సక్రమంగా వస్తుందా? లేదా? టికెట్ రేట్స్ పెంచినప్పుడు అందుకు తగ్గట్టుగా పన్ను కట్టారా? లేదా? అనేది చూడమని ఆదేశించారు. పార్కింగ్ ఫీజ్ నుంచి పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ వరకు ఎక్కువ రేటుకు అమ్మడం పట్ల అధికారులు తనిఖీలు చేయాలని ఆదేశించారు.

# దూరం ఆధారంగా టోల్...

ముంబై, మే 26, : కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై ప్రయాణాన్ని సరళీకృతం చేసేందుకు కొత్త టోల్ విధానంపై పనిచేస్తోంది. హైవేలపై ట్రాఫిక్ జామ్ కాకుండా టోల్ వసూలు విషయంలో అనేక సంస్కరణలు తీసుకువస్తోంది. శాటిలైట్ ఆధారిత టోల్ వసూలుకు కూడా ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో మరో వినూత్న విధానం అందుబాటులోకి తెచ్చిందిదేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రాష్ట్ర ఎక్స్‌ప్రెస్‌వేలపై అపరిమితంగా ప్రయాణించేందుకు కేంద్రం కొత్త, వినూత్న విధానం అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానం కింద, వాహనదారులు వార్షికంగా 3 వేల ??పాయలు చెల్లించి ఏడాదిపాటు టోల్ చెల్లించకుండా ప్రయాణం చేయవచ్చు. ప్రతి టోల్ గేట్ వద్ద విడిగా ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకపోవడం వల్ల, ఈ పథకం వాహనదారులకు సమయం, ఖర్చు ఆదా చేస్తుంది. ప్రస్తుత ఫాస్ట్‌ట్యాగ్ వ్యవస్థతో ఈ ప్యాకేజీ అనుసంధానం అవుతుంది, కాబట్టి అదనపు డాక్యుమెంట్లు అవసరం లేదు. ఫాస్ట్‌ట్యాగ్‌ను రీఛార్జ్ చేయడం ద్వారా ఈ సౌలభ్యాన్ని పొందవచ్చు. ఈ విధానం దీర్ఘకాలిక ప్రయాణికులు, వ్యాపారవేత్తలకు ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.వార్షిక ప్యాకేజీతోపాటు, దూరం ఆధారిత టోల్ విధానం కూడా ప్రవేశపెట్టనుంది. ఈ విధానంలో, 100 కిలోమీటర్ల దూరానికి 50 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. స్థానికంగా తరచూ ప్రయాణించే వాహనదారులు, చిన్న వ్యాపారులు ఈ ఎంపికతో ఆర్థిక భారం తగ్గించుకోవచ్చు. ఈ విధానం టోల్ చెల్లింపుల్లో పారదర్శకతను పెంచడమే కాక, టోల్ గేట్ల వద్ద రద్దీని తగ్గించడానికి దోహదపడుతుంది. అయితే, గతంలో ప్రతిపాదిత 30 వేల రూపాయలతో 15 ఏళ్లపాటు అపరిమిత ప్రయాణం అనే జీవితకాల ఫాస్ట్‌ట్యాగ్ ఆలోచనను ప్రభుత్వం విరమించుకుంది. దీనిని అమలు చేసే అవకాశం లేదని తెలుస్తోంది.ఈ కొత్త టోల్ విధానం జాతీయ రహదారులపై ట్రాఫిక్ జామ్‌లను తగ్గించి, డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని పెంచుతుందని అధికారులు ఆశిస్తున్నారు. ఫాస్ట్‌ట్యాగ్ వ్యవస్థ ద్వారా టోల్ సేకరణ సులభతరం కావడంతో, రహదారి నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు సమకూరుతాయి. ఈ పథకం రాష్ట్రాల సమన్వయంతో త్వరలో అమలులోకి రానుంది, ఇది విజయవంతమైతే రాష్ట్ర రహదారులకు కూడా విస్తరించే అవకాశం ఉంది. ఈ విధానం వాహనదారులకు ఆర్థిక సౌలభ్యం కల్పించడమే కాక, రహదారి రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మారుస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, ఈ పథకం అమలులో సాంకేతిక సమస్యలు, రాష్ట్రాల మధ్య సమన్వయం వంటి సవాళ్లను అధిగమించాల్సి ఉంటుంది.

# ప్రాంతీయ పార్టీల్లో పవర్ పంచాయతీలు

అధికారాన్ని చాలామంది ముళ్ళకిరీటంతో పోల్చుతుంటారు. కానీ కొంతమందికి ఆ అధికారాన్ని ఎలా వాడుకోవాలో తెలుసు. ఆ అధికారం ద్వారా ఏం చేయాలో కూడా తెలుసు. అందుకోసమే ఆ అధికారం కోసం ఏదైనా చేస్తారు. మనదేశంలో జాతీయ పార్టీల కంటే ఎక్కువగా ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. ప్రాంతీయ పార్టీలు జాతీయస్థాయి పార్టీలను సవాల్ చేస్తూ అధికారంలోకి వస్తున్నాయి. ఓ తమిళనాడులో డీఎంకే, తెలంగాణలో రెండుసార్లు భారత రాష్ట్ర సమితి, ఆంధ్రప్రదేశ్లో వైఎస్ఆర్సిపి, జార్ఖండ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్.. ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా చాలా పెద్దది. ప్రాంతీయ పార్టీలు ప్రారంభంలో రాజకీయ మనుగడ కోసం ఇబ్బందిపడినప్పటికీ.. ఆ తర్వాత అధికారాన్ని సుస్థిరం చేసుకున్నాయి. ఏకంగా జాతీయ పార్టీలను సవాల్ చేసే స్థాయి దాకా ఎదిగిపోయాయి. సీట్ల పంపకం.. టికెట్ల పొత్తు.. ఇలా అనేక విషయాల్లోనూ ప్రాంతీయ పార్టీలు జాతీయ పార్టీల ముందు కాలర్ ఎగరేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇప్పుడు కేంద్రంలో ఎన్డీఏ అధికారంలో ఉన్నప్పటికీ.. కొన్ని ప్రాంతీయ పార్టీలు ఆ కూటమికి సపోర్ట్ చేస్తున్నాయి. అందువల్లే నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రిగా కొనసాగుతున్నారుప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పవర్ పంచాయతీలు చాలానే చోటుచేసుకున్నాయి. ఇప్పుడే కొత్తగా షర్మిల తోనే మొదలు కాలేదు. ఇది కల్వకుంట్ల కవితతోనే ముగిసిపోదు.. మనదేశంలో ప్రాంతీయ పార్టీలలోనే పవర్ పాలిటిక్స్ ఎక్కువగా చోటుచేసుకున్నాయి. దీనికి బీజం సీనియర్ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్ర ప్రదేశ్ లో పడింది. నాడు ముఖ్యమంత్రిగా సీనియర్ ఎన్టీఆర్ ఉన్నప్పుడు అధికారం కోసం గొడవలు మొదలయ్యాయి. చివరికి సీనియర్ ఎన్టీఆర్ కు ఎటువంటి దుస్థితి ఎదురయిందో అందరికీ తెలుసు. చంద్రబాబు, లక్ష్మీపార్వతి మధ్య ఎలాంటి వివాదాలు చోటు చేసుకున్నాయి అప్పటి తరం వారికి బాగా తెలుసువైయస్సార్ కుటుంబంలో అధికారం కోసం ఇటీవల ఎన్నికల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం. నాడు జగన్మోహన్ రెడ్డి జైల్లో ఉన్నప్పుడు షర్మిల కాలికి బలపం కట్టుకుని పాదయాత్ర చేశారు. చివరికి పార్టీలో తన ప్రభను కోల్పోయేసరికి అన్నపై తిరుగుజెండాను ప్రదర్శిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి పార్టీ ఓడిపోవడానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ.. అందులో ప్రధానమైనది వైయస్ షర్మిల అనడంలో ఎటువంటి సందేహం లేదు.ఇక ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబంలోనూ అధికారం కోసం చిచ్చు రేగినట్టు తెలుస్తోంది. కవిత పార్టీలోని విషయాలపై ప్రముఖంగా ప్రస్తావించినప్పటికీ.. ఆ విషయాలు బయటకు వచ్చిన తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటిదాకా లోగోట్టు బయటకు తెలియకుండా వ్యవహరించిన గులాబీ బాస్ కుటుంబం.. ఇప్పుడు ఒక్కసారిగా కట్టు తప్పింది. ఇప్పటికైతే కవిత మరో షర్మిల అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే ఈ రాజకీయ సంక్షోభాన్ని కెసిఆర్ ఎలా నివారిస్తారనేది చూడాలి.అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ కు అమితమైన ప్రాధాన్యాన్ని కేసీఆర్ ఇచ్చారు. ఇది సహజంగానే కల్వకుంట్ల కవితకు నచ్చలేదట. పైగా రెండవ టర్మ్ చివరి రెండు సంవత్సరాలు సంతోష్ రావు ప్రభుత్వంలో అన్ని తానై నడిపించాడట. అది కల్వకుంట్ల కవితకు ఇబ్బందికరంగా పరిణమించిందట. ఒకానొక దశలో ఈ పరిణామాన్ని కేటీఆర్ కూడా తట్టుకోలేకపోయాడట. ఇక అప్పట్నుంచి కల్వకుంట్ల కవితలో ఆగ్రహం పెరిగిపోయిందట. చివరికి హరీష్ రావు కూడా ఫామ్ హౌస్ గేట్లు తెరుచుకోలేదట. ఇక ఇటీవల పార్లమెంట్ ఎన్నికల ముందు హరీష్ రావుతో బిజెపి పెద్దలు అప్రోచ్ అయ్యారట. దీంతో అప్రమత్తమైన కేసీఆర్ హరీష్ రావుకు టచ్ లోకి వెళ్ళాడట. వాస్తవానికి కల్వకుంట్ల కవిత అరెస్టు అయిన సందర్భంగా బిజెపి పెద్దలతో కేసిఆర్ టచ్ లోకి వెళ్తే.. అతని వ్యవహార శైలి గతంలో కాంగ్రెస్ పార్టీతో ఎలా ఉందో తెలుసుకున్న కమలం పెద్దలు వద్దనుకున్నారట.అటు కేటీఆర్.. ఇటు సంతోష్ రావు వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులను మనసులో పెట్టుకున్న కవిత హరీష్ రావుకి టచ్లోకి వెళ్లారట. అయితే ఈ పరిణామాన్ని ఊహించిన కేసీఆర్ హరీష్ రావుకి వర్తమానం పంపారట. అందువల్లే ఆయన ఇటీవల ఫామ్ హౌస్ కి వెళ్లి చాలాసేపు చర్చించారట. అంతేకాదు ఇటీవల కేటీఆర్ కూడా హరీష్ రావును కలవడానికి ప్రధాన కారణం కూడా ఇదేనట. ఇక కవితకు బాల్క సుమన్ కు ఇచ్చిన ప్రాధాన్యం కూడా పార్టీలో ఇవ్వడం లేదట. ఇటీవల అమెరికాలో భారత రాష్ట్ర సమితి రజతోత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి బాల్క సుమన్ కేటీఆర్ ప్రతినిధిగా అమెరికా వెళ్లిపోయాడు. అయితే అమెరికాకు వెళ్లిన కవితకు అక్కడి తెలుగు సంఘాలు.. అక్కడి భారత రాష్ట్ర సమితి నాయకులు ఆహ్వానం పలకలేదట. కనీసం పట్టించుకోలేదట.. అందువల్లే కవిత ఈ స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలుస్తోంది.మహారాష్ట్రలో శివసేన పార్టీలో ఠాక్రే కుటుంబ సభ్యుల మధ్య ఎలాంటి వివాదాలు జరుగుతున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదం అధికారాన్ని దూరం చేస్తోంది. రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన విభేదాలను ఇతర పార్టీలు క్యాష్ చేసుకుంటున్నాయి.ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సమాజ్వాది పార్టీలో అఖిలేష్ యాదవ్, శివపాల్ యాదవ్ మధ్య అధికారం కోసం ఒక యుద్ధమే సాగింది. చివరికి అఖిలేష్ యాదవ్ పార్టీ మీద పట్టు సాధించినప్పటికీ.. శివపాల్ యాదవ్ తో ఇప్పటికీ వైరుధ్యాలే కొనసాగుతున్నాయి.ఇక తమిళనాడులో కరుణానిధి కుటుంబంలో అధికారం కోసం గతంలో గొడవలు జరిగాయి. కరుణానిధి చనిపోయిన తర్వాత పార్టీ మీద స్టాలిన్ పూర్తిస్థాయిలో పట్టు పెంచుకున్నాడు. కనిమొళి, అలగిరి ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారు. ఇప్పటికైతే స్టాలిన్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నప్పటికీ.. భవిష్యత్తు కాలంలో ఏదైనా జరగొచ్చు అనే సంకేతాలు మాత్రం కనిపిస్తున్నాయి.పంజాబ్ రాష్ట్రంలో శిరోమణి అ కాళి దళ్ పార్టీలో ఏర్పడిన పవర్ పాలిటిక్స్ గురించి చాలా రోజుల పాటు జాతీయ మీడియాలో భారీ ఎత్తున్నే కథనాలు ప్రసారమయ్యే.. బాదల్ కుటుంబ సభ్యుల పెత్తనాన్ని నిరసిస్తూ పార్టీ నాయకులు వేరే దారులు చూసుకున్నారు. ఇక నాటి నుంచి పంజాబ్లో శిరోమణి అ కాళిదల్ అధికారంలోకి రావడం అటు ఉంచితే.. కనీసం చెప్పుకోదగ్గ స్థానాలు కూడా గెలవలేకపోతోంది.ఇక బీహార్లో లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంలో అధికారం కోసం చాలానే పంచాయతీలు జరిగాయి. ఇప్పటికైతే తేజస్విని యాదవ్ చేతిలో పార్టీ ఉన్నప్పటికీ.. భవిష్యత్తు కాలంలో ఎటువంటి ఘటనలైనా చోటు చేసుకోవచ్చని తెలుస్తోంది. త్వరలో అక్కడ జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తేజస్విని యాదవ్ నాయకత్వాన్ని లాలూ ప్రసాద్ యాదవ్ మిగతా కుమారులు ప్రశ్నించే అవకాశం లేక పోలేదని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి.


# ఆ నలుగురిపైనే చర్చ అంతా...

హైదరాబాద్, మే 26 తెలుగు సినిమా ఇండస్ట్రీలో ప్రొడ్యూస్ చేయడం నుంచి ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ వరకు అన్ని రంగాల్లో ఉన్న నిర్మాతలు కొందరు ఉన్నారు. అయితే... సురేష్ బాబు, అల్లు అరవింద్, దిల్ రాజు, ఏషియన్ సునీల్ – ఈ నలుగురు మిగతా నిర్మాతలకు చాలా అందనంత ఎత్తులో ఉన్నారు.సురేష్ బాబు చేతిలో రామానాయుడు స్టూడియో ఉంది. ఫిల్మ్ షూటింగ్స్ అండ్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ అందులో చేసుకోవచ్చు. 'మిస్ ఇండియా' సినిమాలో కీర్తి సురేష్ రెస్టారెంట్ పెడతారు కదా... అమెరికాలో! ఆ సెట్ హైదరాబాద్ రామానాయుడు స్టూడియోస్‌లో వేశారు. 'టాక్సీవాలా'లో విజయ్ దేవరకొండ గ్యారేజ్ సెట్ కూడా సేమ్ ప్లేస్‌లో వేశారు. ఎన్నో సినిమాల్లో బస్ స్టాప్ సీన్స్ రామానాయుడులో తీశారు. అక్కడ ప్రివ్యూ థియేటర్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చేసుకోవడానికి అవసరమైన సరంజామా ఉంది. సురేష్ బాబు దగ్గర డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థతో పాటు లీజుకు తీసుకున్న థియేటర్లు ఉన్నాయి.ఏషియన్ సునీల్ విషయానికి వస్తే... మహేష్ బాబు (ఏఎంబీ), అల్లు అర్జున్ (ఏఏఏ) వంటి స్టార్ హీరోల భాగస్వామ్యంతో మల్టీప్లెక్స్‌లు స్టార్ట్ చేశారు. రవితేజతో వనస్థలిపురంలో ఒక మల్టీప్లెక్స్ కడుతున్నారు. మరికొంత మంది హీరోలతో అటువంటి వెంచర్స్ (మల్టీప్లెక్స్)లు ప్లాన్ చేశారు. ఎగ్జిబిషన్ సెక్టార్‌లో ఏషియన్‌కు బలమైన వ్యవస్థ ఉంది. గతంలో తెర వెనుక ఉన్న ఏషియన్ సునీల్, కొన్ని సంవత్సరాలుగా నిర్మాణంలోనూ అడుగు పెట్టారు. నాగచైతన్యతో 'లవ్ స్టోరీ', నాగార్జునతో 'ది ఘోస్ట్' తీశారు. ఇప్పుడు ధనుష్ – నాగార్జునల 'కుబేర' తీస్తున్నారు.మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్, అగ్ర నిర్మాత 'దిల్' రాజు గురించి చెప్పాల్సిన అవసరం లేదు... భారీ బడ్జెట్ ఫిలిమ్స్ నుంచి కాన్సెప్ట్ ఽ కంటెంట్ ఓరియెంటెడ్ ఫిలిమ్స్ వరకు అన్నీ చేస్తున్నారు. ఇద్దరికీ డిస్ట్రిబ్యూషన్‌లో బలమైన నెట్వర్క్ ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో బోలెడు థియేటర్లు వాళ్ళ చేతుల్లో ఉన్నాయి.టాలీవుడ్ ఇండస్ట్రీలో 'ఆ నలుగురు' అంటే వినిపించేది వీళ్ళ పేర్లే. గతంలో నట్టి కుమార్ వంటి నిర్మాతలు 'ఆ నలుగురూ' థియేటర్లను తమ గుప్పెట్లో పెట్టుకుని చిన్న సినిమాలకు ఇవ్వడం లేదని ఆరోపణలు చేసిన రోజులు ఉన్నాయి. అయితే చిన్న సినిమాలకు థియేటర్లు ఇచ్చినా ప్రేక్షకులు రావడం లేదని అగ్ర నిర్మాతలు చెబితే సమంజసం అనిపించింది కనుక ఎక్కువ విమర్శలు రాలేదు. నట్టి కుమార్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం కలగలేదు. ఇప్పుడు ఏకంగా పవన్ కళ్యాణ్ సినిమా విడుదలకు అడ్డుపడుతున్నారనే ప్రచారం మొదలైంది. దాంతో ఇప్పుడు ఈ వ్యవహారం వేడెక్కింది.డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలో 'దిల్' రాజు, అల్లు అరవింద్, ఏషియన్ సునీల్, సురేష్ బాబు కొన్నేళ్లుగా ఆధిపత్యం చెలాయిస్తున్నారు. వాళ్ళ దగ్గర ఎక్కువ థియేటర్లు ఉన్నాయి. సొంతంగా కట్టుకున్నవి కొన్ని అయితే... లీజుకు తీసుకుని మెయింటైన్ చేస్తున్నవి మరికొన్ని.గతంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉండేది. కానీ, ఇప్పుడు సురేష్ బాబు – ఏషియన్ సునీల్ కలిసి సినిమాలు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. దిల్ రాజు ఒక్కోసారి వీళ్ళతో కలిసి సినిమాలు కొని విడుదల చేస్తారు. మెజారిటీ తమిళ్ డబ్బింగ్ సినిమాలు రిలీజ్ చేసేది వీళ్ళే. అల్లు అరవింద్ కూడా కొన్ని సినిమాలు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. 'కాంతార'ను తెలుగులో విడుదల చేసింది ఆయనే. 'బేబీ', 'పొలిమేర 2' వంటి సినిమాల విడుదల వెనుక ఉన్నది ఆయన గీతా ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూషన్. ప్రొడ్యూస్ చేసినవి కావచ్చు... డిస్ట్రిబ్యూట్ చేసేవి కావచ్చు... తమ తమ సినిమాలు థియేటర్లలోకి వచ్చేటప్పుడు ఒక విధంగా, తమ సినిమాలు లేనప్పుడు మరో విధంగా 'ఆ నలుగురు' వ్యవహరిస్తారని పేరుంది. ఏషియన్ సునీల్ ప్రొడ్యూస్ చేస్తున్న 'కుబేర' జూన్ 20న విడుదలకు సిద్ధమైనా... ఆ సినిమాను పక్కన పెడితే డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలో తమకు మేలు కలిగేలా నిర్ణయాలు తీసుకోవడం కోసం మిగతా మిత్రులతో కలిసి థియేటర్స్ బంద్ వ్యవహారాన్ని ముందుకు తెచ్చారని ఇండస్ట్రీలో గుసగుస. 'ఆ నలుగురు' వీళ్ళేనని ఎవరూ పైకి చెప్పరని, అది అందరికీ తెలిసిన ఓపెన్ సీక్రెట్ అని ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్. ఇప్పుడు ఏకంగా ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి నుంచి 'పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు విడుదలకు ముందు థియేటర్లు బంద్ చేయాలని ఆ నలుగురు ఒత్తిడి చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి' అంటూ స్టేట్మెంట్ రావడం గమనార్హం. మరి పవన్ క్యాంపు పేర్కొంటున్న 'ఆ నలుగురు' వీళ్లేనా? కాదా? అనేది తెలియాల్సి ఉంది.

## డబ్బు కంటే కులమే గొప్పదని నేర్చుకున్నాను ఎంపి గడ్డం వంశీ

భూపాలపల్లి కాళేశ్వరం పుష్కరాలకు తనకు ఆహ్వానం ఇవ్వకపోవడంపై కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీ స్పందించారు. డబ్బు కంటే కులమే గొప్పదని నేర్చుకున్నాను, కులానుసారంగా నాయకులు ఎలా ప్రవర్తిస్తున్నారో చూశాను. నన్ను ఆహ్వానించకపోవడంతో బాధపడ్డాను, రాజ్యాంగం ప్రకారం కులాలకు సంబంధం లేకుండా మనుషులు దేవస్థానాలను వెళ్లొచ్చని మరొకసారి గుర్తుచేస్తున్నానని అన్నారు.

# కరొనా జేఎన్1 వేరియంట్...




హైదరాబాద్, మే 26 జేఎన్1 వేరియంట్ కొవింద్ -19 వైరస్‌కు సంబంధించిన వేరియెంట్‌లో ఉపవేరియెంట్. ఇది ః०.2.86(పిరోలా) నుంచి పుట్టుకొచ్చింది. ప్రపంచవ్యాప్తంగా వేగంగా వ్యాపిస్తున్న ఈ వేరియెంట్ ఇండియాలో కూడా చాలా వేగంగా విస్తరిస్తోంది. విపరీతంగా కేసులు పెరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా కేసులు పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచనలు చేస్తున్నాయి.గతంలో వ్యాప్తి చెందిన ఒమిక్రాన్ వేరియెంట్ లక్షణాలే ఇందులో కూడా కనిపిస్తాయి. జలుబు, దగ్గు, గొంతునొప్పి, తల తిరగడం, అలసటగా ఉండటం దీని ప్రధాన లక్షణాలు. మరికొందరికి జ్వరం వస్తుంది. వాంతులు విరేచనాలు కూడా అవుతుంటాయి. భోజనం తినాలనే ఆసక్తి ఉండకపోవడం కూడా ఈ వ్యాధి లక్షణం. తల భారంగా ఉంటుంది. ఏ పని చేయాలన్నా సరే ఆసక్తి ఉండదు. ఈ లక్షణాలు వ్యాధి వ్యాప్తి చెందిన వారిలో కనిపిస్తాయి. కానీ నార్మల్‌గానే కనిపిస్తారు. అయితే వృద్ధులు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిలో ఈ లక్షణాలు తీవ్రంగా ఉంటాయి. వాళ్లు మాత్రం చాలా జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది. ఈ వేరియెంట్ గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. దగ్గు తుమ్ముల ద్వారా వైరస్ విస్తరిస్తుంది. ఒకరు వాడిన వస్తువులు పట్టుకున్నా, వారు తిరిగిన చోట తిరిగినా సరే వ్యాధి సోకుతుంది.

ఈ వ్యాధి నుంచి రక్షణ పొందాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి
మాస్కులు ధరించాలి
చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి.
సామాజిక దూరం పాటించాలి
గాలి ధారళంగా వచ్చే గదుల్లో ఉండాలి.
రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి
వాక్సిన్ తీసుకోవాలి

వైరస్ సోకిన వాళ్లు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉండాలి, ప్రతి రోజూ ఆక్సిజన్ స్థాయి, ఉష్ణోగ్రతలను పరీక్షించుకోవాలి. లక్షణాలు ఎక్కువగా ఉంటే ఆసుపత్రిలో జాయిన్ అవ్వాలి. ఏజె.1 వేరియెంట్ మిగతా కోవింద్ వేరియెంట్స్‌తో పోల్చుకుంటే కొన్ని ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంది. మిగతా వేరియెంట్స్ వాప్తి కాస్త ఆలస్యంగా ఉంటే... ఇది చాలా త్వరగా వ్యాప్తి చెందే సామర్థ్యం కలిగి ఉంటుంది. చాలా మంది లక్షణాలు లేకుండా ఇది సోకుతుంది. మరికొందరికి తేలికపాటి లక్షణాలు ఉంటాయి. దీనిపై టీకాల ప్రభావం తక్కువగా ఉంటుంది. స్పైక్ ప్రోటీన్‌లో ఎక్కువ మ్యూటేషన్లు ఉండటం వల్ల వైరస్‌ను గుర్తించడం శరీరానికి కష్టమవుతుంది. కొన్ని సందర్భాల్లో గుర్తించడానికి అధునాతన జెనోమ్ సీక్వెన్సింగ్ అవసరం అవుతుంది. పది రోజులుగా వివిధ రాష్ట్రాల్లో నమోదు అయిన కేసుల వివరాలు ఇలా ఉన్నాయి. కేరళలో దాదాపు 70 కేసులు, మహారాష్ట్రలో 44 కేసులు, తమిళనాడులో 34, ముంబైలో 100కిపైగా కేసులు, ఢిల్లీలో 30కిపైగా కేసులు నమోదు అయ్యాయి.

# ఆ నలుగురు వీరేనా

హైదరాబాద్, మే 26 బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎయిర్ పోర్టులో చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. అసలు కేసీఆర్ చుట్టూ ఉన్న కోటరీ ఎవరు? పక్కన ఉన్న దెయ్యాలు ఎవరు? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో మాత్రమే కాదు.. గులాబీ పార్టీలో కూడా హాట్ టాపిక్ గా మారింది. గత కొద్ది సంవత్సరాల నుంచి కల్వకుంట్ల కవిత మాత్రమే కేసీఆర్ ను దగ్గర నుంచి చూసి ఉంటారు. ఎందరో నేతలు చూస్తున్నా నిరంతరం కేసీఆర్ చుట్టూ ఉన్న కోటరీ పై కవితకు మాత్రమే ఖచ్చితమైన సమాచారం అందుతుంది. కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో ఉన్నప్పటికీ అక్కడకు వచ్చి ఎవరెవరు కలుస్తున్నారన్న దానిపై కవితకు ఎప్పటికప్పుడు నివేదిక అందించేవారు కూడా లేకపోలేదు. కల్వకుంట్ల కవిత కామెంట్స్ చేసిన కోటరీ, దెయ్యాలు ఎవరన్న దానిపైనే చర్చ జరుగుతుంది. కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ బీఆర్ఎస్ లో కోవర్టులను పక్కకు తప్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. కేసీఆర్ దేవుడని, కానీ ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయన్నారంటే కవితకు అక్కడ కేసీఆర్ ను ప్రభావితం చేస్తున్నది ఎవరన్నది పక్కాగా తెలిసిన తర్వాత మాత్రమే ఈ వ్యాఖ్యలు చేశారు. తాను రెండు వారాల క్రితం తాను కేసీఆర్‌కు లేఖ రాస్తే, దానిని ఇప్పుడు బయటపెట్టడంపై కూడా కవిత ఆశ్చర్యపోయారు. తనపై కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయన్న కవిత కేసీఆర్ కుమార్తెనైన తాను రాసిన లేఖే బయటికి వచ్చిందంటే పార్టీలో సామాన్యుల పరిస్థితి ఏమిటని కవిత అన్నారంటే దాని వెనక పెద్ద హస్తాలే ఉన్నట్లు ఆమెచెప్పకనే చెప్పారు కల్వకుంట్ల కవిత అనుమానం నలుగురిపైనే ఉనట్లు గులాబీ పార్టీలో చర్చ జరుగుతుంది. ఒకటి తన సోదరుడు కల్వకుంట్ల తారక రామారావు కాగా, రెండో వ్యక్తి కేసీఆర్ మేనల్లుడు హరీశ్ రావు, సంతోష్ తో పాటు పల్లా రాజేశ్వర్ రెడ్డిపైనే అనుమానం ఉన్నట్లు పార్టీలో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. కేసీఆర్ వద్దకు స్వతంత్రగా వెళ్ళి చర్చించే సమయం, వీలు ఈ నలుగురికి మాత్రమే ఉంటుందని కవిత అనుమానంగా చెబుతున్నారు. అందుకే పేర్లు నేరుగా చెప్పకుండా కేవలం దెయ్యాలంటూ అనడంతో నేరుగా వారితో వార్ కు కవిత సిద్ధమయ్యారనే అర్థమవుతుంది. ఈ నలుగురు మాత్రమే తనను కేసీఆర్ కు దూరం చేశారన్న బాధ కూడా కల్వకుంట్ల కవితలో కనపడుతుంది. అందుకే దెయ్యాలంటూ.. కోటరీ అంటూ ఆ నలుగురిని కవిత టార్గెట్ చేశారంటున్నారు. అయితే దీనిపై ఎవరూ స్పందించకపోవడానికి కూడా కవితతో పెట్టుకోవడం ఎందుకని అందరూ మౌనంగా ఉంటున్నారు.

# ఉస్మానియాలో 1000రూపాయలే అద్దె...

హైదరాబాద్, మే 26, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వివాదం కొనసాగుతుండగానే.. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ క్వార్టర్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించడంపై కొత్త వివాదం చెలరేగింది. విద్యార్థి సంఘాలు భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నాయి. ప్రస్తుత వీసీ గత ఇన్‌ఛార్జి వీసీ హయాంలో ఈ కేటాయింపులు జరిగాయని అంగీకరించారు. ప్రొఫెసర్లకు రూ. 40,000 అద్దె వసూలు చేస్తుండగా.. ప్రైవేటు వ్యక్తులకు రూ. 1,000కే కేటాయించడంపై విద్యార్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించడంపై సమగ్ర విచారణ జరిపి, దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదం ఇంకా కొనసాగుతుండగానే.. ఇప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) భూ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ క్వార్టర్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించారనే ఆరోపణలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ఈ విషయంలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని విద్యార్థి సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.ఓయూలోని ప్రొఫెసర్లకు కేటాయించాల్సిన క్వార్టర్లను కొంతమంది ప్రైవేటు వ్యక్తులకు కేటాయించి, ఈ ప్రక్రియలో పెద్దమొత్తంలో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై విద్యార్థి సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. సమగ్ర విచారణకు డిమాండ్ చేస్తున్నాయి. ప్రైవేటు వ్యక్తులకు క్వార్టర్స్ ఇవ్వడంపై ఓయూ వైస్ ఛాన్సలర్ ని విచారించగా.. క్వార్టర్లు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు. అయితే.. ఈ కేటాయింపులు తన హయాంలో జరగలేదని.. గతంలో ఇన్‌ఛార్జి వీసీగా ఉన్న వ్యక్తి ఈ క్వార్టర్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని ప్రస్తుత వీసీ వెల్లడించారు. మినిట్స్ బుక్‌లో ఈ విషయాన్ని తాను కూడా చూసినట్లు పేర్కొన్న ఆయన.. తనకు ఈ విషయంతో ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.వీసీ వివరణ పట్ల విద్యార్థి సంఘాలు తీవ్రంగా స్పందించాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు క్వార్టర్స్ కేటాయించడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓయూ ప్రొఫెసర్లు ఈ క్వార్టర్స్‌లో నివాసముంటే వారి వేతనం నుంచి నెలకు రూ. 40,000 కట్ చేస్తారని, కానీ అదే క్వార్టర్లను ప్రైవేటు వ్యక్తులకు మాత్రం కేవలం రూ. 1,000 కే ఇవ్వడాన్ని విద్యార్థి సంఘాలు తప్పు పడుతున్నాయి. ఈ భారీ వ్యత్యాసం అవినీతికి నిదర్శనమని.. దీనిపై సమగ్ర విచారణ జరిపి, ఈ ఇష్యూకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.వాస్తవానికి.. ఓయూలో ఉన్న క్వార్టర్లు ప్రొఫెసర్లకు కేటాయిస్తే వారి నుంచి రూ. 40,000 అద్దె వసూలు చేస్తున్నారు. బయట ఇదే సౌకర్యాలున్న ఇళ్లకు ఇందులో సగం చెల్లిస్తేనే సరిపోతుండటంతో, అంత మొత్తం చెల్లించడానికి ప్రొఫెసర్లు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో ఆ క్వార్టర్లు ఖాళీగా ఉంటున్నాయి. ఈ ఖాళీలను పూరించడానికి, లేదా వాటి ద్వారా కొంత ఆదాయాన్ని పొందడానికి కొందరు అధికారులు ఈ క్వార్టర్లను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించినట్లు చెబుతున్నారు.అయితే.. ప్రొఫెసర్లకు సైతం తక్కువ అద్దెకు, అంటే మార్కెట్ రేటుకు అనుగుణంగా కేటాయిస్తే వారు ఉండటానికి అవకాశం ఉంటుందని విద్యార్థి సంఘాలు, కొంతమంది ప్రొఫెసర్లు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంలో అధికారులు పునరాలోచన చేసి, యూనివర్సిటీ ప్రయోజనాలను కాపాడాలని.. విద్యార్థుల, ఉపాధ్యాయుల హక్కులను గౌరవించాలని వారు కోరుతున్నారు. ఈ వివాదం ఓయూ ప్రతిష్టను దెబ్బతీసే అవకాశం ఉందని, కాబట్టి దీనిపై పారదర్శకమైన విచారణ జరిపి, దోషులను శిక్షించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి

## గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ప్లాంటు
## వరల్డ్ హైడ్రోజన్ సమిట్ లో ఎంఓయూపై సంతకాలు

హైదరాబాద్ గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ప్లాంటు ఏర్పాటు కానుంది. నెదర్లాండ్స్లో జరుగుతున్న ప్రపంచ హైడ్రోజన్ సమిట్ లో ఇందుకు సంబంధించి భారత్కు చెందిన జునో జౌలె గ్రీన్ ఎనర్జీ ప్రై.లి. జర్మనీ ఎనర్జీ ట్రేడింగ్ కంపెనీ అనుబంధ సంస్థ సెలెక్ట్ న్యూ ఎనర్జీస్ జీఎంబీహెచ్ సంస్థలు ఎంఓయూ కుదుర్చుకున్నాయి. ఏటా మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా తయారు చేసేలా ప్లాంట్ ఏర్పాటు చేయాలని సంస్థలు నిర్ణయించాయి. దీనిద్వారా ఇక్కడ ఎలక్ట్రోలసిస్ ద్వారా 180 వేల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ కూడా ఉత్పత్తి కానుంది. ఈ ప్రాజెక్టును మూడు దశల్లో అభివృద్ధి చేస్తారు. ఇందుకు మొత్తం 1.3 బిలియన్ డాలర్ల (రూ.10 వేల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నారు. సముద్ర నీటిని మంచి నీరుగా మార్చే ప్లాంట్నూ ఇందులోనే ఏర్పాటు చేస్తారు. ఈ ఎంఓయూపై జేజే గ్రీన్ ఎనర్జీ సంస్థ సీఈఓ రాయపాటి నాగశ రత్, సెలెక్ట్ న్యూ ఎనర్జీస్ జీఎంబీహెచ్ ఎండీ ఫెలిక్స్ దేంజ ర్లు సంతకాలు చేశారు.

# కరీంనగర్ వాసికే మావోయిస్టు పీఠం...

కరీంనగర్, మే 26 మావోయిస్టు పార్టీ చీఫ్ నంబాల కేశవరావు పోలీస్ ఎన్ కౌంటర్లో మరణించడంతో ఇప్పుడు తదుపరి చీఫ్ ఎవరు అన్న విషయంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. అందులో ముగ్గురి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వారిలో మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియాస్ గణపతి, ఆ తర్వాత ఆ పార్టీ సెంట్రల్ మిలిటరీక మిషన్ చీఫ్ గా ఉన్న తిప్పిరి తిరుపతి అలియాస్, వీరిద్దరితో పాటు పార్టీ సైద్ధాంతిక బాధ్యతలు చూస్తోన్న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ దేవ్ జి పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది.ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియాస్ గణపతి ప్రస్తుత జగిత్యాల జిల్లా సారంగ పూర్ మండలం బీర్ పూర్ లో 1945లో జన్మించారు. ముప్పాళ్ల గోపాల్, శేషమ్మ దంపతులకు జన్మించిన ఆయన సైన్స్ పట్టా పొది బీఏడీ పూర్తి చేశారు. కరీంనగర్ జిల్లాలో టీచర్ గా పని చేశారు.

ఆ తర్వాత ఆయన పీపుల్స్ వార్ పార్టీలో చేరారు. ఆ పార్టీలో దాదాపు 15 ఏళ్ల పాటు కేంద్ర కమిటీ కార్యదర్శిగా పని చేశారు. 2004లో పీపుల్స్ వార్, మావోయిస్ట్ కమ్యూనిస్ట్ సెంటర్ ఆఫ్ ఇండియా విలీనమయి సీపీఐ మావోయిస్టు పార్టీగా అవతరించింది. నాటి నుండి 2018 వరకు ఆయన పార్టీ జనరల్ సెక్రటరీగా నాయకత్వం వహించారు. దేశంలోని 13 రాష్ట్రాల్లో మావోయిస్టు పార్టీని బలోపేతం చేసి రెడ్ కారిడార్ ఏర్పాటు చేశారు. పార్టీ సిద్ధాంతాల పట్ల అత్యంత విధేయత, అద్భుత వ్యూహకర్త, పార్టీకి నిధుల సేకరణలోను విజయవంతమైన నాయకుడిగా మావోయిస్ట్ పార్టీ అతన్ని గుర్తించింది. భారత దేశంలో అత్యంత మోస్ట్ వాంటెడ్ లిస్ట్ లో ఉన్న వ్యక్తి గణపతి. ఇప్పటి దాకా పోలీసులు ఆయన ఆచూకి కనపెట్టిలేని రీతిలో అండర్ గ్రౌండ్ లో గడుపుతున్న వ్యక్తి. 2018 నవంబర్ లో ఆయన అర్థరైటిస్, ఉబ్బసం, మధుమేహం ఇతర వ్యాధుల కారణంగా , మరో వైపు వయో భారం వల్ల పార్టీ నాయకత్వ బాధ్యతల నుండి తప్పుకుని ప్రస్తుతం చత్తీస్ ఘఢ్ఎన్ కౌంటర్లో మరణించిన నంబాల కేశవరావుకు నాయకత్వం అప్పజెప్పారు. పార్టీ ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో మళ్లీ గణపతి బాధ్యతలు ఎత్తుకుంటున్నారన్న వార్తలు వస్తున్నాయి. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర బలగాలు పెద్ద ఎత్తున ఎన్ కౌంటర్లు చేస్తుండటంతో ఆ పార్టీ రక్షణకు ఆయన వ్యూ?హాలు, అనుభవం పనికి వస్తుందన్న చర్చ సాగుతోంది. అయితే వయో భారం కారణంగా మరో సారి ఆ బాధ్యతలు నిర్వర్తించలేరన్న ప్రచారం మరో వైపు వినబడుతుంది. అంతర్జాతీయ కమ్యూనిస్ట్ ఉద్యమ బాధ్యతల్లో ఆయన ఉన్నారన్న వార్తలు వస్తున్నాయి.మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి వినిపిస్తున్న మరో పేరు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జి. ఇతను మావోయిస్ట్ పార్టీలో అత్యంత నిపుణుడైన సైనిక నేతగా, గెరిల్లా దాడుల వ్యూహకర్తగా గుర్తింపు పొందారు. ఇతను కూడా గణపతి పుట్టిన ప్రాంతమైన జగిత్యాల జిల్లాకు చెందిన వాడే. పీపుల్స్ వార్ గ్రూప్ నడుస్తోన్న 1990లోనే ఉద్యమ పార్టీలో చేరారు తిరుపతి. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ని ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర కీలకమని మవోయిస్టు చరిత్ర చెబుతోంది. పీఎల్ జీఏ తొలి ప్లాటూన్ ఏర్పాటులో తిరుపతి అలియాస్ దేవ్ జి కీలక పాత్ర పోషించారు. 2007లో జరిగిన దంతేవాజ గిదం పోలీస్ స్టేషన్ దాడికి నాయకత్వం వహించింది దేవ్ జీనే. ఈ దాడితో ఆయన పేరు మార్మోగింది. ఆ తర్వాత 2013లో చత్తీస్ ఘఢ్ సుకామా జిల్లా దర్బాలోయలో జరిగిన దాడి దేశ చరిత్రలోనే అత్యంత విషాదంగా చెప్పుకున్న దాడి. ఈ దాడిలో 32 మంది కిపైగా చనిపోయారు.చత్తీస్ ఘఢ్ మాజీ హోం మంత్రి, సల్వాజుడం వ్యవస్థాపకుడు అయిన మహేంద్రకర్మ, నాటి చత్తీస్ ఘఢ్ పీసీసీ చీఫ్ నందకూమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి వీసీ శుక్లా కూడా చనిపోయారు. ఈ దాడిని దేవ్ జీ, మల్లోజుల వేణుగోపాల్ రావు కలిసి ప్లాన్ చేసి అమలు చేసినట్లు పోలీసులు చెబుతారు. ఇలా దాడలకు ప్లాన్ చేయడంలోను, దాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో నిపుణిడిగా తిరుపతి అలియాస్ దేవ్ జీకి పేరు ఉంది. గతంలో నంబాల కేశవరావు పని చేసిన మావోయిస్ట్ పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ కు చీఫ్ గా ప్రస్తుం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జి పని చేస్తున్నారు. నంబాల కేశవరావు మృతితో పా?ర్టీ చీఫ్ గా సైనిక నైపుణ్యం , దళిత సామాజిక వర్గం నుండి ఎదిగిన నేతగా దేవ్ జీకే అవకాశం ఉందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. ఒక వేళ దేవ్ జీ చీఫ్ గా పార్టీ ఎన్నుకుంటే అతని సారధ్యంలో మావోయిస్టు పార్టీ కేంద్రం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్రంగా స్పందించే దిశగా నడిపిస్తారని మాజీ మావోయిస్టులు చెబుతున్నారు.మావోయిస్టు పార్టీలో సీనియర్ గా మల్లోజుల వేణు గోపాల్ అలియాస్ సోను ఉన్నారు. ప్రస్తుతం పార్టీ కేంద్ర కమిటీలోను, పొలిట్ బ్యూరోలో సభ్యుడిగా ఉన్నారు. ఆజాద్ మరణం తర్వాత కేంద్ర కమిటి అధికార ప్రతినిధి బాధ్యతలను మల్లోజుల వేణు గోపాల్ నిర్వర్తిస్తున్నారు. ఈయన తెలంగాణ లోని పెద్ద పల్లి జిల్లా లో జన్మించారు, వెంకటయ్య, మధురమ్మకు ముగ్గురు కుమారులు, అందులో వేణు గోపాల్ చిన్న వాడు. పెద్ద పల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి ఆ తర్వాత ఐటీఐ లో రేడియో, టీవీ మెకానిజం కోర్సు పూర్తి చేశారు.

ఆ తర్వాత ఆ తర్వాత పై చదువులు చదివి ఎంటెక్ లో చేరారు. ఆస మయంలోనే ఉద్యమంలో చేరారు. ఉద్యమ నేతలు కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పార్టీ పిలుపు మేరకు వేణు గోపాల్ అటవీ బాట పట్టారు. మహారాష్ట్ర గడ్చిరోలి దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీకి నాయకత్వం వహించారు. పశ్చిమ కనుమల్లోని కేరళ నుండి గోవా వరకు పార్టీ విస్తరణలో వేణు గోపాల్ కీలక పాత్ర పోషించారు. 2010లో ఆజాద్ మరణం తర్వాత కేంద్ర కమిటీ అధికార బాధ్యతలు నిర్వర్తించారు. టెక్నాలిజీ వినియోగించే విషయంలో పార్టీని ముందుకు నడిపిన వ్యక్తిగా మల్లోజుల వేణుగోపాల్ కు పేరు. శాటిలైట్ ఫోన్ల వినియోగించే దిశగా పార్టీని తీసుకెళ్లారు.2010లో దంతెవాడ లో సీఆర్పీఎఫ్ బలగాలపై దాడి లో 70 మంది చనిపోయారు. దీని సూత్రదారుల్లో వేణు గోపాల్ ఒకరని పోలీసులు అనుమానిస్తున్నారు. 2013లో చత్తీస్ ఘఢ్ సుక్మ దాడిలో కాంగ్రెస్ నేతల పై దాడి లో దేవ్ జీతో పాటు మల్లోజుల వేణు గోపాల్ ప్రధాన సూత్రదారుడిగా పేరుంది. పార్టీ మిలిటరీ వ్యూహాలు, దాడుల్లో పాల్గొనడమే కాకుండా ఆయనకు పార్టీ సిద్ధాంతల పట్ల అత్యంత పట్టు కలిగిన వ్యక్తిగా పేరుంది. 69 ఏళ్ల వేణు గోపాల్ తదుపరి మావోయిస్ట్ చీఫ్ గా పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీ సిద్ధాంతాల పట్ల పట్టు, సీనియారిటీ వంటి అంశాలు కలిసి వస్తుందన్న విశ్లేషణ ఉంది. అయితే వయోభారం, అనారోగ్య సమస్యలు, మతి మరుపు వంటి సమస్యలు ఆటంకం కావచ్చు అన్న చర్చ సాగుతోంది. అయితే ఈ ముగ్గురిలో ఎవరు మావోయిస్ట్ పార్టీ చీఫ్ అయినా.. వారు తెలుగు వారు అందునా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వారే

# జూన్ 2 నుంచి స్లాట్ బుకింగ్..

హైదరాబాద్, మే 26 జూన్ 2 నుంచి అన్నిసబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి రానుంది.ఇప్పటికే 47 చోట్ల విజయవంతంగా అమలు కావటంతో... అన్ని కార్యాలయాల్లోనూ అమలు చేయనున్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి ప్రకటించారు.రిజిస్ట్రేషన్ల వ్యవస్థలో తెలంగాణ ప్రభుత్వం? స్లాట్ బుకింగ్ విధానం తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే 47 చోట్ల విజయవంతంగా అమలు కావటంతో... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కార్యాలయాల్లోనూ ఇదే విధానాన్ని అమలు చేయనున్నారు. ఇదే అంశంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. స్లాట్ బుకింగ్ విధానంతో మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు.ప్రయోగాత్మకంగా మొదటి దశలో ఏప్రిల్ 10వ తేదీన 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇక్కడ మంచి ఫలితాలు రావడంతో మే 12వ తేదీ నుంచి 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేశారు. ఈ రెండు విడతలు కలిపి 47 చోట్ల అమలు చేసిన విధానం విజయవంతమైందని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ రెండు విడతల్లో కలిపి దాదాపు 36 వేల రిజిస్ట్రేషన్‌లు జరిగాయని తెలిపారు.ఇప్పటికే అమలులో ఉన్న 47 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో మాదిరిగానే మిగిలిన 97 చోట్ల స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రారంభించనున్నామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. జూన్ 2 నుంచి అన్ని కార్యాలయాల్లోనూ స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి రావాలని.... ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా సులభతరమవుతుందని మంత్రి పొంగులేటి చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయింత్రం 5 గంటల వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ఆస్తుల క్రయ విక్రయ దారులు స్లాట్ బుకింగ్ తర్వాత లాగిన్‌లో డిపార్ట్‌మెంట్ పోర్టల్ లో పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని తెలిపారు.స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరణ చేస్తున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. పని భారం అధికంగా ఉన్న పఠాన్‌చెరువు, యాదగిరిగుట్ట, గండిపేట, ఇబ్రహీంపట్నం , సూర్యాపేట, జడ్చర్ల ,మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ మొత్తం తొమ్మిది చోట్ల అదనపు సబ్ రిజిస్ట్రార్‌తోపాటు సిబ్బందిని నియమిస్తున్నామని తెలిపారునిషేధిత జాబితాలోని ఆస్థులను ఎట్టి పరిస్థితుల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. భూ భారతి తరహాలో ప్రత్యేకంగా ఒక పోర్టల్ ను ఏర్పాటు చేశామని నిషేధిత ఆస్తుల వివరాలను అందులో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు. ఎక్కడైనా నిషేధిత జాబితాలోని భూమిని రిజిస్ట్రేషన్ చేస్తే క్షణాల్లోహైదరాబాద్ లోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ప్రధాన కార్యాలయంలో ఆన్‌లైన్ లో తెలిసిపోయేలా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.స్లాట్ బుకింగ్ విధానం ద్వారా డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షించే అవసరం ఉండదు. కేవలం 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.స్లాట్ బుకింగ్ చేసుకుంటేనే ఎంపిక చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ చేస్తారు. స్లాట్ బుకింగ్ చేసుకోకుండా వచ్చే వారి రిజిస్ట్రేషన్లు చేయరు. ఈ విధానంలో రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను అదే రోజు కొనుగోలుదారుకు అందజేస్తారు. నేరుగా తీవణతిబబితీజీబితినీని.బివశ్రీజీనిణజీనిజీ.ణనీల.తిని వెబ్‌సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని ఆ రోజు నిర్దేశించిన సమయానికి నేరుగా విచ్చేసి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చు.

# జూన్ 2 నుంచి కొత్త రెవెన్యూ..

హైదరాబాద్, మే 26 గతంలో రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో), గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్ఏ)లు ఉండేవారు. వీరు భూములకు సంబంధించిన క్షేత్రస్థాయి రికార్డులను నిర్వహించేవారు. అలాగే పలు ప్రభుత్వ పథకాల అమలులో కీలకంగా వ్యవహరించేవారు. అయితే.. ఆ వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసింది. ఆ సిబ్బందిని ఇతర శాఖలకు బదలాయించి బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుత ప్రభుత్వం.. గతంలో వీఆర్ఏ, వీఆర్వోలుగా పనిచేసిన అనుభవం ఉన్న వారికి జీపీవోలుగా అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు దరఖాస్తులు స్వీకరించారుగ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసే నాటికి.. వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేస్తూ ఉండేవారు. రెవెన్యూ వ్యవస్థ రద్దు చేయడంతో వారిని ఇతర శాఖలకు సర్దుబాటు చేశారు.వీరిలో.ఇంటర్ విద్యార్హతతో 5 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారు, డిగ్రీ విద్యార్హతతో నేరుగా జీపీవోల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది.దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అధికారులు.. కొందరిని రాత పరీక్షకు అర్హులుగా నిర్ధరించారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి జూన్ 2నుంచి ఎంపిక చేసిన గ్రామాల్లో జీపీవోలుగా సేవలు అందించనున్నారు.రెవెన్యూ గ్రామానికి ఒకరి చొప్పున నియమించాల్సి ఉండగా.. పరీక్షలకు కొందరు మాత్రమే అర్హత సాధించారు. ఇందులో ఎంత మంది ఉత్తీర్ణత సాధిస్తారో వారిని నియమించి.. మిగిలిన వారి కోసం ప్రభుత్వ మరోసారి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశాలున్నాయి.గ్రామస్థాయిలో అధికారులను నియమిస్తే.. పరిపాలన మెరుగుపడే అవకాశాలు ఉంటాయని భావించిన ప్రభుత్వం.. గ్రామ పాలన అధికారి వ్యవస్థను తెరపైకి తెచ్చింది.జీపీవోలతో గ్రామాల్లో రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# ముందుడబ్బులు ఎవరిస్తారు...

# ఇందిరమ్మ లబ్ధిదారుల ప్రశ్నలు

మెదక్, మే 26 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో ఊపందుకోవడం లేదు. డబ్బులేని కారణంగా.. నిరుపేద లబ్ధిదారులు ముగ్గు పోసుకునేందుకు ముందుకు రావడం లేదు. మరోవైపు గృహ విస్తీర్ణాన్ని 600 చదరపు అడుగులకు పరిమితం చేయడం కూడా ఈ పథకం ప్రగతికి ప్రతిబంధకమవు తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా.. రేవంత్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకొచ్చింది. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇళ్ల నిర్మాణానికి అనుమతి పత్రాలు పొందిన 47 వేల 235 మంది లబ్ధిదారుల్లో.. ఇప్పటివరకు కేవలం 17 వేల 982మంది మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభించారు. కొందరు అసలు తమకు ఇళ్లు వద్దని చెబుతున్నారు. సిమెంట్, ఇటుక, స్టీలు వంటి వాటి ధరలు భారీగా పెరగడంతో.. లబ్ధిదారులు పనులు ప్రారంభించేందుకు ముందుకు రావడం లేదు.ఇంటి నిర్మాణం మొదలుపెట్టాలంటే.. కొంత మొత్తంలో అయినా డబ్బు అవసరం. బేస్‌మెంట్ వరకు కట్టాలంటే కనీసం లక్షా యాభైవేల వరకు ఖర్చవుతుంది. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తయ్యాకే లక్ష రూపాయల బిల్లు వస్తుంది. అయితే.. తొలుత లక్షన్నర పెట్టుబడి పెట్టి పనులు ప్రారంభించడం పేదలకు కష్టమవుతోంది. అప్పుచేసి చేసి నిర్మాణం ప్రారంభిద్దామనుకున్నా.. బిల్లులు వస్తాయో, రావోననే ఆందోళన చాలామందిలో ఉంది.ఆర్థికంగా కాస్త మెరుగ్గా ఉన్న లబ్ధిదారులు.. 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపు ఇంటి నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదు. ఇంత చిన్న ఇల్లు కట్టుకుంటే ప్రయోజనం ఏంటనే అభిప్రాయంతో చాలామంది ఉన్నారు. పిల్లలకు, ఏదైనా ఫంక్షన్లు అయినా అసౌకర్యంగా ఉంటుందనే భావనలో ఉన్నారు. కానీ.. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 600 చదరపు అడుగులకు మించి ఇల్లు కట్టుకుంటే.. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిగా పరిగణించరని అధికారులు చెబుతున్నారు.ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు.. మంజూరు పత్రం తీసుకున్న 45 రోజుల్లోపు ఇంటికి అవసరమైన మెటీరియల్.. అంటే స్టీలు, సిమెంట్, ఇటుక, ఇసుక, కిటికీలు, తలుపులు సమకూర్చుకోవాలి. ఈ నిబంధన ఇబ్బందికరంగా ఉందని లబ్ధిదారులు చెబుతున్నారు. మార్క్ అవుట్ ఇచ్చాక.. 90 రోజుల్లోనే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఇదీ సమస్యగానే ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మంజూరు పత్రాలను కూడా వెనక్కి ఇచ్చేస్తున్నారు.సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామాన్ని తొలి విడత పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. మొత్తం 94 మంది లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేశారు. వీరిలో 56 మంది తమకు ఇల్లు వద్దంటూ మంజూరు పత్రాలు వెనక్కి ఇచ్చేశారు. నిర్మాణం ప్రారంభించేందుకు తమ వద్ద డబ్బులు లేని కారణంగానే మంజూరు పత్రాలను వెనక్కి ఇచ్చామని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు పైలెట్ గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందని తెలుస్తోంది.

# ఆ 96 వేల రేషన్ కార్డులు రద్దు

హైదరాబాద్, మే 26, తెలంగాణ పౌరసరఫరాల శాఖ చేపట్టిన క్షేత్రస్థాయి విచారణలో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గత ఆరు నెలలుగా బియ్యం తీసుకోని రేషన్‌కార్డుల వివరాలను సేకరించగా.. ఏకంగా 96 వేల కార్డులు అనుమానాస్పదంగా తేలాయి. అధికారులు చేపట్టిన విచారణలో మే 22 వరకు మొత్తం 6 వేలకు పైగా రేషన్ కార్డులు అర్హత లేనివిగా గుర్తించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అనేక సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డే ప్రాథమికంగా ఉండటంతో.. భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఈ అవకాశాన్ని కొందరు అనర్హులు సద్వినియోగం చేసుకుని అక్రమంగా రేషన్‌కార్డులు పొందుతున్నారని తెలుస్తోంది. మే మొదటి వారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 90.71 లక్షల రేషన్‌కార్డులు ఉండగా.. వాటి పరిధిలో 2.93 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నట్లు అంచనా. వీరి కోసం ప్రభుత్వం ప్రతి నెలా 1.90 లక్షల టన్నుల బియ్యాన్ని డీలర్లకు పంపిస్తోంది.సన్న బియ్యం పథకం అమలు అయిన తర్వాత ఎక్కువగా నిరుపేదలు రేషన్ తీసుకోవడానికి బారులు తీరుతున్నా.. 1.6 లక్షల మంది మాత్రం పత్తాలేకుండా పోయారు. ఎక్కడా వారు రేషన్ తీసుకుంటున్నట్లు రికార్డులు లేవు. దీంతో.. పౌరసరఫరాల శాఖ వారి జాబితా తీసి.. ఆయా మండలాల్లో తహసీల్దార్ల ద్వారా క్షేత్రస్థాయి విచారణ చేయిస్తోంది. లబ్ధిదారులు సదరు చిరునామాలో నివసిస్తున్నారా, లేదా మరణించారా అని పరిశీలిస్తున్నారు. విచారణలో.. వందేళ్ల వయస్సు పైబడి చనిపోయినవారు కూడా రేషన్ లబ్ధిదారుల జాబితాలో పెద్ద సంఖ్యలో ఉన్నట్లు గుర్తించారు. మరికొందరికి రెండు వేర్వేరు కార్డుల్లో పేర్లున్నట్లు కూడా సమాచారం. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయానికి పంపిస్తున్నారు.

రేషన్‌కార్డుల విచారణలో సూర్యాపేట జిల్లా 100 శాతం విచారణను పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత కామారెడ్డిలో 83 శాతం, సిరిసిల్లలో 68 శాతం, కరీంనగర్‌లో 63 శాతం విచారణ పూర్తయ్యింది. అయితే.. 12 జిల్లాల్లో మాత్రం ఈ విచారణ ఇంకా మొదలే కాలేదు. ఇప్పటివరకు జరిగిన విచారణలో, కామారెడ్డిలో 726, సిద్దిపేటలో 519, ఖమ్మంలో 371, సిరిసిల్లలో 360, కరీంనగర్‌లో 330, యాదాద్రిలో 176, మెదక్‌లో 106 కార్డులు అనర్హమైనవిగా తేలాయి.

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విచారణ పూర్తయిన తర్వాత.. వరుసగా ఆరు నెలల నుంచి రేషన్ తీసుకోని వారిని.. అర్హత లేకున్నా.. రేషన్ కార్డులు పొందిన వారి కార్డులను రద్దు చేసే అవకాశం ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ వర్గాల సమాచారం.


ఇది ప్రభుత్వ వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి సహాయపడుతుంది. అంతే కాకుండా.. ఈ కేవైసీ చేయించుకోని వారి కార్డులను కూడా తొలగించే అవకాశాలు ఉన్నాయి.

# విద్యుత్ తీగ పడి వివాహిత మృతి



మేడ్చల్ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో బైక్ పై వెళ్తున్న కుటుంబం మీద విద్యుత్ తీగ పడింది. ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలు అయ్యాయి. మేడ్చల్ జిల్లా కీసర నాగారం మున్సిపాలిటీ పరిధిలో దంపతులు సురేష్, మౌనిక, మూడేళ్ల బాబు శ్రేయాస్తో కలిసి బైక్పై వెళుండగా ఈదురు గాలులకు విద్యుత్ తీగ తెగిపడింది. దాంతో మౌనిక తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. సురేష్, బాబు శ్రేయాస్ల పరిస్థితి విషమంగా వుంది.

# వెంకటగిరి కోర్టు పరిసరాల్లో 144 సెక్షన్ అమలు.సిఐ ఏవీ రమణ




నెల్లూరు వెంకటగిరి కోర్టు పరిసరాల్లో 144 సెక్షన్ ఃఔా(భారతీయ న్యాయ సంహిత) ప్రకారం సెక్షన్ 163 అమలులో వుననట్లు స్థానిక సిఐ ఏవీ రమణ వెల్లడించారు. ఓ కేసుకు సంబంధించి పొదలకూరు పోలీసులు నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేసి వెంకటగిరి కోర్టులో హాజరు పరుస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు కు చోటు చేసుకోకుండా ఉండేందుకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. కోర్టు పరిసరాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసామని అన్నారు. కోర్టు పరిసరాలకు 200 మీటర్ల లోపు నలుగురికి మించి ఎవరు గుంపులుగా ఉండకూడదని ఈ సెక్షన్ కోర్టు కార్యక్రమం పూర్తయ్యే వరకు అమలులో ఉంటుందని అయన అన్నారు.

# గొప్ప స్ఫూర్తిప్రదాత, ఆదర్శమూర్తి రమాబాయి అంబెద్కర్ -నేడు ఆమె వర్ధంతి



రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబెద్కర్. ఈమె ఫిబ్రవరి 7న,1898 లో జన్మించింది. మాత రమాబాయి ప్రపంచ మేధావిని తీర్చిదిద్ది దేశానికే దీపమయ్యారు. రమాభాయి బాబా సాహెబ్ ను గుర్తించినంతగా తన స్వంత జాతి ప్రజలు బాబా సాహెబ్ విజయాలకు కారణమైన రామబాయిని గుర్తించలేదనే చెప్పాలి. తన త్యాగాల పునాదుల మీద బాబా సాహెబ్ ని ఒక మేను పర్వతంగా తాను నిలబెట్టింది. డాక్టర్ అంబేద్కర్ గారి ఒకొక్క మెట్టు వెనుక రమాబాయి అమ్మ పంటి బిగువున బిగపట్టిన బాధ తాలూకు గాయలున్నాయి. బాబా సాహెబ్ ఇదంతా గుర్తించారు. ఆమెకు గుర్తుగా 1941 ఆయన వ్రాసిన 'థాట్స్ ఆన్ పాకిస్తాన్' పుస్తకాన్ని అంకితమిచ్చారు. అతి తొందరగా "నా "అనుకునే వారిని పోగొట్టుకున్న రమాబాయితో బాబా సాహెబ్ వివాహం 1906 లో బైకుల్లా మార్కెట్ లో జరిగింది అప్పుడు బాబా సాహెబ్ కి పద్నాలుగు ఏళ్ళు, రమాబాయికి తొమ్మిది ఏళ్ళు. అతి చిన్నవయసులోనే వివాహం జరగడం వలన రమాబాయి చదువుకు దూరం అయ్యింది. బాబా సాహెబ్ తనకు చదువు చెప్పేంచాలని ప్రయత్నం చేయడం జరిగింది, ఈ ప్రయత్నంలో ఆమె కొద్దిగా వార్త పత్రికల హెడ్ లైన్ లు చదవవలగడం నేర్చుకుంది. తన పెళ్లి తరువాత బాబా సాహెబ్ మెట్రిక్యులేషన్ పాస్ అయ్యారు. డాక్టర్ అంబెద్కర్ గారికి ఎల్లవేళలా తోడుంటూ ఎన్నో కష్టాలను ఓర్చుకుంటూ జీవనం సాగించడం జరిగింది. ఉన్నత చదువులకు బరోడా రాజు ప్రోద్బలం తో బాబా సాహెబ్ లండన్ వెళ్లడం జరిగింది. ఆ సమయంలో ఇంటి బాధ్యతలు రమాబాయి ఒక్కరే నెరవేర్చుకున్నారు. బాబా సాహెబ్ ఉన్నత చదువులకోసం తాను ఎన్నో బాధలను అనుభవించింది. ఇల్లు గడవని స్థితిలో రమాబాయి పిడకలు చేసి అమ్మేవారు ఆ డబ్బులతో ఇల్లు గడిచేలా చూడటమే కాకుండా అందులో కొంత డబ్బు డాక్టర్ అంబెద్కర్ కి పంపించేవారు. ఆమె జీవిత కాల కష్టమే ఈ రోజున రాజ్యాంగం ద్వారా హక్కులు అణగారిన వర్గాల ప్రజలు అనుభవిస్తున్నారని అనడంలో సందేహం లేదు. ఈ విషయాలు స్వయంగా డాక్టర్ అంబెద్కర్ గారు 3 ఫిబ్రవరి 1928 న బహిష్కృత భారత్ పక్ష పత్రికలో తన సంపాదకీయంలో రాశారు. ఒకొక్కరుగా తన బిడ్డలు రాలి పోతున్నా మొక్కవోని ధైర్యం రమాబాయి సొంతం, ఎంతటి బాధనైన తన గుండెల్లోనే దాచుకుని బాబా సాహెబ్ కి ధైర్యాన్నీ నూరిపోసేవారు. 1907 నుండి మొదలయిన బాబా సాహెబ్ చదువు ప్రస్థానం 1953 ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ తో ముగిసింది. ఇవి సాధించటానికి వాళ్ళు ఇద్దరూ కారణమే, ఈ ప్రతీ చదువు వెనుక రమాబాయి త్యాగం ఉంది. బాబా సాహెబ్ లండన్ కి వెళ్తున్నపుడు రమాబాయి గర్భవతిగా ఉంది. రమాబాయి అమ్మ యొక్క కుమారుడు 'రమేష్' చనిపోయారు, 'గంగాదర్' చనిపోయారు, ఒక్కగానొక్క ఆడ కూతురు 'ఇందు' చనిపోయారు, చివరివారు బాబా సాహెబ్ కి అత్యంత ఇష్టుడు చిన్నవాడు అయినా 'రాజ్ రతన్' కూడా చనిపోయాడు, యశ్వంత్ అంబేద్కర్ ఒక్కరే మిగిలాడు. బాబా సాహెబ్ జీవితం అంటే పోరాటం ఆ పోరాటంలో తనతో పాటు రమాబాయి అమ్మకూడా తన వంతు పనిచేసింది. రమాబాయికి చదువు విషయంలో బాబా సాహెబ్ ని చూసి గర్వపడేది. అసమాన ఆయన ప్రతిభను చూసి నివ్వెర పోయేది. సమానత్వం కోసం ఆయన పడుతున్న తపనకు చలించిపోయేది. ఇదంతా చేస్తూ ఆయన ఆరోగ్యనీ కాపాడుకోలేక పోతున్నారు అంటూ అనుక్షణం తపన పడేది. రమాబాయి అమ్మ అంటే త్యాగనీ, రమాబాయి అమ్మ అంటే ఒక పోరాటం, చివరకు 1935 మే 27న ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె మరణించిన తర్వాత అంబేద్కర్ కన్నీరుమున్నీరుగా విలపించారు. చివరకు సన్యాసం తీసుకోవాలని భావించారు. ఎంతోమంది మిత్రులు నచ్చచెప్పి అంబేద్కర్‌ని మామూలు మనిషిగా మార్చారు. ఈవిధంగా కటికదారిద్ర్యంలో జీవితం కొనసాగించిన రమాబాయి ఏ రకమైన ప్రలోభాలనూ తన దరిదాపుల్లోకి రానివ్వలేదు. తన భర్త బారిష్టరైనా ఆమె పిడకలు వేసి సంసారాన్ని నడిపించారు. ఆమె ఇవన్నీ చూస్తూ కేవలం తన బాధ్యతలను నెరవేరుస్తున్నానని అనుకున్నాను. కాని తనకు తెలియకుండానే ఆత్మగౌరవంతో, మానసిక నిబ్బరంతో జీవించారు. ప్రపంచమేధావి అయిన అంబేద్కర్ జీవన గమనంలో రహదారిగా మారారు. ఇలాంటి ధన్యజీవి రమాబాయి అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శం.

# బార్ లో యువకుడి హత్య



హైదరాబాద్ రామంతపూర్ లోని గుడ్డే బార్ లో ఆదివారం రాత్రి పవన్ కుమార్ అనే యువకుడి హత్య జరిగింది.రాత్రి పటేల్ నగర్ కు చెందిన పవన్ కుమార్ అలియాస్ కళ్యాణ్ మిత్రులు శ్రవణ్ మరో ఇద్దరు రామంతపూర్ లోని గుడ్ డే బార్ లో మద్యం సేవిస్తున్నారు. శ్రవణ్ కు అతని మిత్రులకు మాట మాట పెరిగి గొడవ జరగడంతో మధ్యలో విడిపించడానికి వెళ్లిన పవన్ కుమార్ ను బలంగా కొట్టిన శ్రవణ్ దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయడు. పోలీసులు వెంటనే హాస్పిటల్ కి తరలించారు. పవపక అప్పటికే మృతి చెందాడు.ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో పవన్ కుమార్ అన్న యాక్సిడెంట్ లో చనిపోయాడు. ఉన్న ఇద్దరు కుమారులు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

# రాష్ట్రస్థాయి థీమ్ యోగా కార్యక్రమాలు సోమవారం ఉదయం ఘనంగా ప్రారంభం

విజయవాడ బీఆర్టీఆఎస్ రోడ్డులో రాష్ట్రస్థాయి థీమ్ యోగా కార్యక్రమాలు సోమవారం ఉదయం ఘనంగా ప్రారంభమైయాయి. నగరం నలుమూలల నుంచి యోగా ఔత్సాహికులు, విద్యార్థులు వేలాదిగా తరలివచ్చారు. 26 జిల్లాల్లో 26 రోజుల పాటు 26 ఇతివృత్తాలతో యోగాంధ్ర ప్రచార కార్యక్రమాలు జరగనున్నాయి. ప్రతి వర్గాన్ని యోగాంధ్రలో భాగం చేసే లక్ష్యంతోనే థీమ్ యోగా కార్యక్రమాలు వుంటాయి. రాష్ట్రంలో కనీసం రెండు కోట్ల మంది యోగాలో ప్రవేశించేలా అవగాహన, శిక్షణ జరగనుంది. నిపుణులు రూపొందించిన యోగా కామన్ ప్రోటోకాల్ ప్రకారం శిక్షణ, అభ్యాసం వుంటింది. రాష్ట్ర వ్యాప్తంగా 104 పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికీ యోగాను చేరువచేసేందుకు కృషి చేస్తున్నారు. జిల్లాలకు నాలుగైదు పర్యాటక ప్రాంతాల్లో యోగా ఔన్నత్యాన్ని చాటిచెప్పే కార్యక్రమాలు వుంటాయి. జూన్ 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరుగుతాయి. ప్రతిఒక్కరూ తమ జీవన మార్గంలో యోగా అభ్యసనాన్ని భాగం చేసుకోవాలి. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా యోగా పోటీల నిర్వహణ వుంటుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం) ఎంటీ కృష్ణబాబు హాజరయ్యారు. యోగాంధ్ర మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కమిషనర్ వీరపాండ్యన్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ గిరీశ పీఎస్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, పతంజలి యోగా, ఈషా ఫౌండేషన్, బ్రహ్మకుమారీలు, అమరావతి యోగా కేంద్ర యోగా ఔత్సాహికులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. ..

# శ్రీవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు అభిషేక సేవలో దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. సోమవారం నాడు శ్రీవారి దర్శనార్థం తిరుమల విచ్చేసిన గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి టి.సి.డి.శేఖర్ రావు, కర్ణాటక లోకాయుక్త జస్టిస్ బి.ఎస్.పాటిల్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి, సినీనటి సురేఖవాణి, మండలి బుద్ధప్రసాద్, ప్రభుత్వ విప్ వెంకట్రావు, గోల్డ్ మాన్ విజయ్ కుమార్, మల్లికార్జున అప్పు స్వామివారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయంలోని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

# ప్రజావాణి అర్జీలు పెండింగ్లో పెట్టవద్దు:: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

## మొత్తం 182 దరఖాస్తుల రాక
## పోత్గల్ వాసి వైద్యానికి రూ. రెండు లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం అందించిన కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే -26 (ప్రజాబలం ప్రతినిధి)**ప్రజావాణిలో వచ్చే అర్జీలు పెండింగ్లో పెట్టవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించి, వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.మొత్తం 182 దరఖాస్తులు వచ్చాయి.రెవెన్యూ శాఖకు 75, హౌసింగ్ శాఖకు 36, ఎస్డీసీకి 12, డీఆర్డీఓ, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్కు తొమ్మిది చొప్పున, ఎస్పీ కార్యాలయానికి 6, జిల్లా ఉపాధి కల్పన అధికారి, నీటి పారుదల శాఖ కు 5 చొప్పున, జిల్లా సంక్షేమ అధికారికి 4, వ్యవసాయ శాఖ, జిల్లా విద్యాశాఖ అధికారి, ఏడీ టెక్స్టైల్స్, సబ్ రిజిస్టర్, ఏడీ ఎస్ఎల్ఏ కు రెండు చొప్పున తదితర శాఖలకు దరఖాస్తులు వచ్చాయి.వైద్యానికి రూ. రెండు లక్షల ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్ ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన బొల్లె శ్రీనివాస్ పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నాడు. సాయం అందించాలని శ్రీనివాస్ భార్య శంకరవ్వ కలెక్టర్ కు విన్నవించారు. దీంతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పందించి, శ్రీనివాస్ వైద్యానికి రూ. రెండు లక్షల చెక్కును అందజేశారు. వైద్యానికి సహాయం అందించిన కలెక్టర్ కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజల అర్జీలను త్వరగా పరిష్కరించాలి
## మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 26:**జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను డిఆర్ఓ హరిప్రియ తో కలిసి మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (76) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమం



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 26:**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట్ మండలంలో కొత్తగా నియమితులైన 146 మంది లైసెన్స్ సర్వేయర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, శిక్షణ కార్యక్రమానికి సోమవారం జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ సర్వేయర్లు మీ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకొని, రేపటి నుండి ప్రారంభం కాకున్న శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హజరు కావాలని సూచించారు. శిక్షణ కార్యక్రమం 52రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని, ఈ శిక్షణ పొందిన తరువాత బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టరు తెలిపారు.

ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ తహశీల్దార్ యాదగిరిరెడ్డి, సర్వే ల్యాండ్రికార్డ్స్ ఎడి శ్రీనివాస్, బలరాం డిప్యూటి ఐఓస్, సత్యమ్మ డియోస్, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్, తహశీల్దార్, వ్యవసాయ %ూూ% తో కలిసి షామీర్పేట్ మండలం అలియాబాద్లోని వరి కేంద్రాన్ని పరిశీలించారు. అదనపు కలెక్టరు ధాన్యాన్ని పరిశీలించి రైతులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# ప్రజావాణికి 40 ఫిర్యాదులు.
## ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులకు సూచించారు.



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం)మే 26 ::** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో 40 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 13, గృహ నిర్మాణ శాఖకు 15, పెన్షన్ 02, ఉపాధి కల్పనకు 01, ఇతర శాఖలకు సంబంధించినవి 09 దరఖాస్తుల స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు.

# మంథని డిపోకు 30పల్లె వెలుగు బస్సులను మంజూరు చేయించండి
## -మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేసిన ఎస్ డబ్ల్యూ ఎఫ్- సిఐటియు నాయకులు



మంథని బస్సు డిపోలో ఇప్పుడున్న బస్సులకు అదనంగా మరో 30 పల్లె వెలుగు బస్సులను మంథని డిపోకు తెప్పించాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబును స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్- సిఐటియు నాయకులు కోరారు.

సోమవారం మంథని పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఎస్ డబ్ల్యూ ఎఫ్- సిఐటియు నాయకులు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ని కలిసి వినతి పత్రం అందించారు. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు వినతిపత్రాన్ని చదివి వివరాలు తెలుసుకున్నారు. మంథని డిపోలో ఆర్డినరీ బస్సులు తక్కువగా ఉండటం వల్ల చిన్న చిన్న గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, బస్సులలో అధిక రద్దీ కారణంగా వృద్ధులకు , విద్యార్థులకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు. అదేవిధంగా మంథని డిపోలో చాలా బస్సులు కాలం చెల్లి ఉన్నాయని, వాటి స్థానాల్లో కొత్తగా ఒక పది బస్సులు, బస్సులలో అధిక రద్దీని నివారించడానికి మరొక పది బస్సులు, మంథని నియోజకవర్గంలోని అనేక గ్రామాలకు బస్సు సౌకర్యం లేదని, వాటి కొరకు మరొక పది బస్సులు మొత్తంగా 30 పల్లె వెలుగు బస్సులను ఇప్పుడున్న బస్సులకు అదనంగా మంథని డిపోకు తెప్పించాలని వారు మంత్రిని కోరారు. అన్ని విషయాలను సావధానంగా విన్న మంత్రి బస్సులు తెప్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ డబ్ల్యూ ఎఫ్- సిఐటియు పక్షాన మంత్రికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంథని డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి రాపెల్లి రాజయ్య, సిఐటియు పెద్దపల్లి జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్, ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్ లతో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# శ్రీశైలం వెళ్లే భక్తులకు గుడ్న్యూస్..

శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్లే మల్లన్న భక్తులకు ఆలయ అధికారులు గుడ్ న్యూస్ చెప్పారు.ఆలయంలో ప్రస్తుతం శని, ఆది, సోమవారాల్లో ఉదయం, రాత్రి మాత్రమే మల్లన్న స్పర్శదర్శనాన్ని కల్పిస్తున్నారు. దీనికి టికెట్లను ఆన్ లైన్లోనే ఉంచుతున్నారు. అయితే, స్పర్శ దర్శనం మధ్యాహ్నం స్లాట్ను ఆలయ అధికారులు పున: ప్రారంభించారు. తాజా నిర్ణయంతో ఇకపై శని, ఆది, సోమవారాల్లో మధ్యాహ్నం కూడా భక్తులు స్పర్శ దర్శనం చేసుకోవచ్చు. ఆ మూడ్రోజులు మధ్యాహ్నం మల్లన్న స్పర్శదర్శనం చేసుకునే వారికి ఆన్ లైన్లో 350 టికెట్లు, కరెంట్ బుకింగ్లో 200 టికెట్లు అందుబాటులో ఉంచారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు ఇటీవల ఆలయ అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వైదిక కమిటీ, వసతి విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్నం వేళల్లో స్పర్శ దర్శనం కల్పించేందుకు వైదిక కమిటీ, అధికారులు సుముఖత వ్యక్తం చేయడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

# సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంప్ ఆఫీస్ వద్ద హై టెన్షన్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 26 (ప్రజాబలం ప్రతినిధి)**సిరిసిల్ల ఎమ్మెల్యే (బీఆర్ఎస్) క్యాంపు కార్యాలయం వద్ద హై టెన్షన్ వాతావరణం నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట చోటు చేసుకుంది.జిల్లాలోని సిరిసిల్ల నియోజకవర్గంలోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంప్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టేందుకు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రయత్నించారు. అయితే వారిని బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య తోపులాట చోటు చేసుకుంది. పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో పలువురికి గాయాలయ్యాయి. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టేందుకు లాఠీఛార్జ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేసి సిరిసిల్ల పోలీస్ స్టేషన్కు తరలించారు. అయితే సీఎం డౌన్ డౌన్ అంటూ బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేయగా.. మరోవైపు కేటీఆర్ డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది.ఇటీవల ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్ ఫోటో పెట్టడం లేదని పలు సందర్భాల్లో బీఆర్ఎస్ నేతలు ప్రోటోకాల్ విషయంలో ఆందోళనకు దిగారు. తాజాగా కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం రేవంత్ రెడ్డి ఫోటోను కేటీఆర్ క్యాంప్ కార్యాలయంలో ఎందుకు పెట్టకూడదంటూ ప్రశ్నిస్తూ.. సీఎం ఫోటోతో కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో గేటు అప్పటికే పోలీసులు భారీ బందోబస్తు మధ్య ఇరు పార్టీల కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు పార్టీల నేతల మధ్య తీవ్ర వాగ్వివాదం నెలకొంది.తోపులాట చోటు చేసుకోగా. సిఐ కృష్ణ కుడి చెయ్యి వేలికి , ముగ్గురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. దాదాపు 15 నిమిషాల పాటు రెండు పార్టీల నేతలు ఒకరికొకరు వ్యతిరేకంగా నినాదాలు చేసుకున్నారు. వెంటనే కాంగ్రెస్ శ్రేణులను అరెస్ట్ చేసి సిరిసిల్ల పోలీస్ స్టేషన్కు బిఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేసి తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్కు తరలించారు.అలాగే కేటీఆర్ కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో సిరిసిల్లలో టెన్షన్ వాతావరణం నెలకొంది. కేటీఆర్ క్యాంపు ఆఫీసు వద్ద మరల ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా చేరుకుంటున్నారు.

# జూన్ 15 నుండి 30 వరకు ధర్తీ ఆభా అభియాన్ క్యాంపులుజిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) మే 26 :** జూన్ 15 నుండి 30 వరకు
ధర్తీ ఆభా అభియాన్
క్యాంపులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.
అధికారులను ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో
ధర్తీ ఆభా అభియాన్ కార్యక్రమం పై
జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ
జూన్ 15 నుండి 30 వరకు
ధర్తీ ఆభా అభియాన్ క్యాంపులను ప్రతి గ్రామంలో నిర్వహించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ క్యాంపులలో ఆధార్ కార్డు, రేషన్ కార్డ్ ఆయుష్మాన్ భారత్ కార్డ్ పీఎం జే ఏ వై, క్యాస్ట్ సర్టిఫికెట్, డొమెసియల్ సర్టిఫికెట్, కిసాన్ క్రెడిట్ కార్డ్ కే సి సి, పి యం కిసాన్, జన్ ధాన్ అకౌంట్, ఇన్సూరెన్స్ కవరేజ్ పి ఎం జె జె బి వై/ పీఎం ఎస్బిఐ, సోషల్ సెక్యూరిటీ ఓల్డ్ ఏజ్ పెన్షన్, విడో పెన్షన్, దివ్యాన్ పెన్షన్, ఎంప్లాయిమెంట్ అండ్ లివింగ్ హెూల్ స్కీమ్ తదితర స్కీములకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు.
ప్రతి గ్రామంలోని గిరిజన ప్రజలు ఇట్టి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్షర సూరీడు ప్రముఖ జర్నలిస్టు ఎం.డి మునీర్ అస్తమయం

## -సంతాపం ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, సీ.అండ్ ఎండీ బలరాం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మే 26:** కోల్ బెల్ట్ సింగరేణి సీనియర్ పాత్రికేయులు, తెలంగాణ ఉద్యమకారులు, ఎం.డి మునీర్ కన్నుమూసారు. గత కొంతకాలంగా అనారోగ్యం బారినపడి హైదరబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూన్న వీరు ఆదివారం రాత్రి కన్నురీమూశారు. విద్యార్థి దశ నుండే వామపక్ష భావజాలంతో ఎదిగిన వీరు మందమర్రిలో గుండాలు రాజ్యమేలుతున్న సమయంలో గుండాలపై తిరుగుబాటు చేశారు. సామాన్య ప్రజలు స్వేచ్ఛగా తిరిగే వాతావరణాన్ని కల్పించిండు. బాంచన్ దొర అనే నినాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన పోరాట యోధుడు, శ్రీపతి రావు హత్య కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. అనంతరం విలేఖరిగా తన ప్రస్థానం మొదలు పెట్టిన వీరు ఆంధ్రప్రభ , ఈనాడు, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, జనం సాక్షి పత్రికలో పని చేసారు. కార్మికుల సమస్యలను పై తన కలం ద్వారా ఎలుగెత్తి ఎప్పటికప్పుడు యజమాని దృష్టికి తీసుకెల్లేవాడు. బాంచన్ దొర అనే కాలంలో దాన్ని రూపుమాపడానికి ఎంతో కృషి చేశాడు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో జరిగిన సకలజనుల సమ్మె కాలంలో సింగరేణి జె.ఏ. సి చైర్మన్ గా కీలక పాత్ర పోషించారు. నాలుగు దశాబ్దాల పాటు పాత్రికేయ వృత్తిలో ఉంటూ తన కలం ద్వారా ప్రజా చైతన్యానికి బాటలు వేశారు. మంచిర్యాలలో ఉంటున్న మునీర్ కు భార్య కళావతి ముజిబా, రేష్మ, తనూజ, కుమారుడు మయూర్ లు ఉన్నారు.

**ప్రముఖుల సంతాపం**

సీనియర్ పాత్రికేయుడు ఎం.డి మునీర్ మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కే. సి.ఆర్, సింగరేణి సీ అండ్ ఎండీ ఎన్. బలరాం లు ప్రకటించారు. పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్న మునీర్ సామజిక సమస్యలపై వార్త కథనాలను అందిస్తూ సమాజ నిర్మాణానికి తోడ్పాటును అందించారని వారు అన్నారు. అంతకుముందు మంచిర్యాల లోని తన నివాసంలో పార్థివ దేహాన్ని ఉంచగా పెద్దపెల్లి ఎంపీ గడ్డ వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఎన్ దివాకర్ రావు, తెలంగాణ కనీస వేతనాల బోర్డు చైర్మన్ బి. జనక్ ప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, కడసారి భౌతకకాయానికి నివాళులు అర్పించారు. ఆదివారం మందమర్రిలో అంత్యక్రియలు నిర్వహించగా ఎమ్మెల్సీ కోదండ రామ్, కార్మిక నేతలు కెంగర్ల మల్లయ్య, సలేంద్ర సత్యనారయణ, సుదర్శన్, మేడిపెల్లి సంపత్, సబ్బని కృష్ణ, సీనియర్ పాత్రికేయులు హెచ్ రవీందర్, బొడ్డు మల్లేష్, తెలంగాణ ధూమ్ ధాం ఫౌండర్ అంతడుపుల నాగరాజు, తెలంగాణా వాదులు పాత్రికేయులు, ఆయన అభిమానులు పాల్గొన్నారు.

# రామంతపూర్ తండాలో త్రాగునీటి కష్టాలు

## అధికారులు స్పందించాలి.

## తాండవాసుల ఆవేదన.






**నర్సాపూర్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి :-** త్రాగునీటి కష్టాలు తాండవాసులను ఇబ్బందికి గురిచేస్తున్నాయి. గత వారం రోజులుగా త్రాగునీటి సరపరలేక తాండవాసులు.

మెదక్ జిల్లా మాసాయిపేట్ మండలం రామంతపూర్ తండాలో త్రాగునీటి సరఫరా లేక వారం పది రోజుల నుండి అష్ట కష్టాలు పడుతున్నామని ,

వ్యవసాయ బోరు బావుల నుండి నీళ్లు తెచ్చుకుంటున్నామని ,విద్యుత్ సరఫరా సరిగలేక బోరు బావుల నుండి తెచ్చుకుందామన్న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వలన ఇబ్బందులకు గురి అవుతున్నామని అధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న పట్టించుకునే నాధుడే కరువాయాడని ఇకనుండి అయినా ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మా తాండకు నీటి సదుపాయం కల్పించాలని , కోరారు.

# పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుంది.

## క్రమ సంఖ్య ప్రకారం రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నాం. జిల్లాలో పలుచోట్ల కావాలని కొందరు ధర్నాలు చేస్తున్నారు. రెండు రోజుల్లో కొనుగోలు పూర్తి చేస్తాం. డి ఆర్ డి ఓ శేషాద్రి.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, చందుర్తి, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లోని రైతుల నుంచి పారాదర్శకంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని డిఆర్డిఓ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. చందుర్తి మండల కేంద్రంలో కొందరు వ్యక్తులు కావాలనే ధర్నా చేశారని ఆమె పేర్కొన్నారు. చందుర్తి మండలం లో సరస్వతి గ్రామ సంఘం ఆధ్వర్యంలో 14-04-2025 వ తేదీన ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని ఆమె గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్రతిరోజు నాలుగు కాంటాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు 283 మంది రైతుల నుంచి 31,150 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. దీనిలో29,349 క్వింటాళ్లు రైస్ మిల్లులకు తరలించామని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రం పరిధిలో దాదాపు 20 మంది రైతుల ధాన్యం ఇంకా సేకరించాల్సింది ఉంది అని తెలిపారు. మరో రెండు రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి చేసి రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తామని, కొనుగోలు కేంద్రాన్ని మూసి వేయనున్నామని, ఐకెపి చందుర్తి మండల బాధ్యులు పి. మమత, ఎం. మంజుల, ఏం. వినోద తెలిపారు.

జిల్లాలో సజావుగా ధాన్యం కొనుగోలు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యం సేకరణ సజావుగా సాగుతుందని, ఎలాంటి ఇబ్బందులు లేవని డిఆర్డిఓ తెలిపారు. జిల్లాలో మొత్తం 242 కేంద్రాల్లో 35,902 మంది రైతుల నుంచి 2,40,695 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వెల్లడించారు. రూపాయలు558 కోట్ల విలువైన ధాన్యం సేకరించామని తెలిపారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

## -ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

## -మందమర్రి ఏరియా జీఎం జి దేవేందర్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మే 26:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని మందమర్రి ఏరియా జి.యం జి. దేవేందర్ అన్నారు. సోమవారం మందమర్రి ఏరియాలోని సి.ఈ.ఆర్ క్లబ్ లో ఏర్పాటు చేసిన క్రీడా శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం మందమర్రి, బెల్లంపల్లి, సోమగూడెం, రామకృష్ణాపూర్, స్టేడియాలలో వాలీబాల్ అథ్లెటిక్స్, ఫుట్ బాల్ వంటి క్రీడలలో నిష్ణాతులైన కోచులను నియమించి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షులు రమేష్, స్పోర్ట్స్ గౌరవ సెక్రెటరీ కార్తీక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివ, స్పోర్ట్స్ జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, గ్రౌండ్ ఇన్చార్జ్ నస్పూరి తిరుపతి కోచ్ లు క్రీడాకారులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 26 :** జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వివేకానంద లతో కలిసి హాజరై వివిధ శాఖల జిల్లా అధికారులు,తహశిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు,మున్సిపల్ కమీషనర్లు,ఇంజనీరింగ్ విభాగం అధికారులతో చెన్నూర్ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా ప్రయోజనక కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గంలో చేపట్టిన పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రజలకు త్రాగునీటికి ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ, అమృత్ 2.0 పథకాల ద్వారా శుద్ధమైన త్రాగునీటిని సరఫరా చేయాలని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో అంతర్గత రహదారులు, మురుగు కాలువలలో చెత్త చెదారం లేకుండా పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని, ప్రతి రోజు తడి చెత్త, పొడి చెత్తలను ఇంటింటి నుండి సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని తెలిపారు. ఆస్తి పన్ను వసూలు ప్రక్రియను 100 శాతం పూర్తి చేసేలా చూడాలని తెలిపారు. కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా శాఖ అధికారులు పర్యవేక్షించాలని, విద్యుత్ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్నందున వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు,సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉ ండాలని, విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని, పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా గుత్తేదారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల ఇంజనీరింగ్ విభాగం అధికారులు తమకు కేటాయించిన అభివృద్ధి నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి జి.సత్యం,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్,జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి

# రాయినిగూడెం పిఏసీఎస్ ముందు రైతుల ఆందోళన

సూర్యాపేట గరిడేపల్లి మండలం కీతవారి గూడెం గ్రామంలో రాయినిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముందు రైతులు ఆందోళనకు దిగారు. అఖిలపక్ష ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. సొసైటీ చైర్మన్ అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడని అతనిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఈఓ కి వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లా లో రాయిని కూడా సొసైటీ అభివృద్ధిలో రెండవ స్థానంలో ఉంది. ఫిబ్రవరి నెలలో చైర్మన్ పై కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు. రాయినిగూడెం సొసైటీ ఉపవిభాగమైన వెలిదండ సొసైటీలో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టి ఆరు లక్షల 62 వేల రూపాయలు డ్రా చేసినడని అఖిలపక్ష ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేసారు. ప్రహరీ గోడ నిర్మాణం 70 వేల రూపాయల ఖర్చయింది. మిగిలిన పాత గోడకి కూడా రంగులు వేసి బిల్లు డ్రా చేసాడని రైతులు ఆందోళన చేసారు. లాభాలలో ఉన్న సొసైటీ ని నష్టాలలో తీసుక వచ్చిన ఘనత చైర్మన్ కే దక్కుతుంది. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నా చైర్మన్ ని తొలగించాలని డిమాండ్ చేసారు.

సీఈఓ వివరణ ఇస్తూ ఫిబ్రవరి నెలలో అఖిలపక్ష ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు. చైర్మన్ పై విచారణ పూర్తి చేసి పై అధికారులకు సమర్పించడం జరిగింది. పై అధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# మణికొండ బాల్ బ్యాడ్మింటన్ ద్వారా క్రీడా సామగ్రి వితరణ







**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 26 మే 2025**మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంస్థ ప్రధాన కార్యదర్శి వీ.శ్రీనివాస్ రావు, కోశాధికారి హరిహరనాథ్ రెడ్డి, సంఘ సభ్యుడు సీతారామరాజు వార్ల ఆద్వర్యంలో, అత్తాపూర్ జర్మంటెన్ హాస్పిటల్ వారి సహాయ సహకారాలతో హాస్పిటల్ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్ సమక్షంలో ఆదివారం రోజున జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ములుగు ఘనపూర్ లో సమ్మర్ కోచింగ్ క్యాంప్ లో పాల్గొంటున్న యువ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా కారులకు సంబంధించిన విలువైన బ్యాటులు, టీ - షర్టులు మరియు బంతులు వితరణ గావించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.వి రమణ, స్థానిక జయశంకర్ భూపాలపల్లి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి సాంబయ్య, రవి, నవీన్, స్వామి, టీ.రవి తది తరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం కావించినారు.

# రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

## తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

## ఖరీఫ్ సీజన్ కు సింగూరు జలాలు ఇవ్వాలి

## ఎమ్మెల్సీ అంజిరెడ్డి



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (మే26 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, ఆరోపించారు, ఉమ్మడి పుల్కల్ మండల పరిధిలోని తాడుదాన్ పల్లె చౌరస్తాలో, ఆదివారం పాలకేంద్రం ప్రారంభోత్సవానికి అంజిరెడ్డి, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు , ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, 122వ మణికి బాత్,కార్యక్రమాన్ని వీక్షించారు, శివంపేట సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, రైతులతో మాట్లాడారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 10, ఏళ్లలో బిఆర్ఎస్, ప్రభుత్వం చేసిన తప్పిదాలనే,నేడు కాంగ్రెస్ సర్కారు చేస్తుందని ఆరోపించారు, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలఅయిందని విమర్శించారు, యాసంగి సీజన్ వరి ధాన్యం కొను గోళ్ళలో, తీవ్ర జాప్యం జరుగుతుండడంతో, రైతులు పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, ధాన్యం సేకరణ పై మంత్రులు జిల్లా స్థాయి అధికారులు, సమీక్షించిన పాపాన పోలేదని మండిపడ్డారు, ధాన్యం కొనుగోలులో జాప్యంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తుతున్నాయని, విచారం వ్యక్తం చేశారు, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు, రానున్న ఖరీఫ్ సీజన్ కు, సింగూరు జలాలను రైతులకు అందించాలని అన్నారు, ఆధునీకరణ పేరుతో, సింగూరు ఎడమ కాలువ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని, క్రాప్ హాలిడే ప్రకటించడంతో, రైతులు నష్టాలకు గురవుతున్నారని వాపోయారు, కాలువ పనులను త్వరగా పూర్తిచేసి, ఈ ఏడాది సాగునీటిని సరఫరా చేయాలన్నారు, కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వం, కొత్త జంటలకు కొత్త రేషన్ కార్డులు అందజేయాలని సూచించారు, 20వేల కోట్లు రుణమాఫీకి కేటాయించామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలిస్తే నిజాలు నిగ్గు తేలుతాయని, రుణమాఫీ కానీ రైతుల జాబితాను సేకరించి, 100% రుణమాఫీ అయ్యేలా చొరవ చూపాలని ఆయన ఇతవు పలికారు, ఈ కార్యక్రమంలో, బిజెపి జిల్లా అధ్యక్షురాలు చిన్న మైల్ గోదావరి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, నాయకులు రాజేశ్వరరావు దేశ్ పాండే, పుల్కల్ మండల బిజెపి అధ్యక్షుడు నవీన్,ఏ,వెంకట నరసింహారెడ్డి, పల్వట్ల జగదీశ్వర్, కొల్కురి రాజశేఖర్ రెడ్డి, డాకూరి భూమయ్య, శ్యామ గౌడ్, గాజుల అనిల్ కుమార్, ఆత్మారి లక్ష్మణ్, మిను పూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.....

# సూర్యాపేట: జాన్ పహాడ్ దర్గా వద్ద షాపులు దగ్ధంభారీ ఆస్తి నష్టం

సూర్యాపేట పాలకవీడు మండలం, జాన్ పహాడ్ దర్గా వద్ద నిన్న రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మూడు పూజా సామాగ్రి దుకాణాలు పూర్తిగా కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన ఈ ఘటనలో లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లింది.దర్గా ఆవరణలో ఉన్న కరెంట్ స్తంభం నుండి వైరు తెగిపోయి సమీపంలోని మూడు షాపుల పైన పడటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. నిమిషాల వ్యవధిలోనే దుకాణాల్లోని పూజా సామాగ్రి, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి.ప్రాణ నష్టం తప్పింది.అగ్నిప్రమాదం రాత్రి సమయంలో జరగడం, దుకాణాల్లో ఎవరూ లేకపోవడం వల్ల ×ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో× స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

# ప్రజావసరాలేమో సున్నా ఆస్తి పన్నేమో మిన్న



గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట శుక్రవారం రోజున మణికొండ పరిధిలోని అల్కాపూర్ టౌన్షిప్ రోడ్డు 4 మరియు 25 మార్గ మధ్యలో బి.ఆర్.ఎస్ పార్టీ తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో స్థానికులు పాల్గొని పలు సమస్యలను లేవనెత్తారు.

1. ముఖ్యంగా మొదట్లో వేసిన చిన్నపాటి డ్రైనేజ్ పైప్ ల ద్వారా మురికి నీరు, వర్షపు నీరు సాఫీగా వెళ్ళలేక, బయటకు వెళ్లగక్కుతూ ప్రవహించడం వల్ల వీధులన్నీ మురికి కుపమై దోమలకు నిలయమౌ తున్నవని పై పెచ్చు ఖాళీగా ఉన్న ప్లాట్ లు చెత్తా చెదారంతో నిండి ఉన్న కారణముగా వర్షము వలన తడిసి ముద్దగా మారి కంపు వాసన వెదజల్లుతూ అక్కడ కూడా దోమలకు నిలయమై విలయ తాండవం చేస్తున్నావని తమ వ్యధను వెళ్లబోసు కున్నారు.
2. మునిసిపల్ అధికారులు ఆస్తి పన్ను వసూలు మీద ఉన్న శ్రద్ధ ప్రజా అవసరాలు తీర్చడంలో చూపడం లేదని ప్రజాభిప్రయ సేకరణలో తేలినది.
3. రహదారులు మొత్తంగా దెబ్బ తిని గుంతల మయంగా మారినను మునిసిపల్ అధికారులు గమ్మున ఉండడం ఇందుకు ఉదాహరణగా తెలిపారు.
4. వీధి శునకాల బెడద తీవ్రంగా ఎదుర్కుంటున్నామని వాపోయారు.
5. జలమండలి లైన్ మెన్ ల బదిలీలు చేయ నందున వారి ఇష్టానుసారం వ్యవహరిస్తూ నీటి సరఫరా చేస్తున్నారని తెలియ చేసినారు.

ఇట్టి కార్యక్రమంలో స్థానిక మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, ఏర్పుల శ్రీకాంత్, సంఘం శ్రీకాంత్, యాలాల కిరణ్, భాను చందర్, సుమనళిని, చెరుకూరి బాలాజీ, రాజేంద్రప్రసాద్, కందాడ ప్రవీణ్ మొదలగు వారు పాల్గొన్నారు.

# ప్రభుత్వ గోదాములు ఏర్పాటు చేయాలి

## తహసిల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (మే 26 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, అందోల్ నియోజకవర్గం లోని అల్లాదుర్గం మండల కేంద్రంలో, రైతుల కొరకు ప్రభుత్వం గోదాములను ఏర్పాటు చేయాలని, డిమాండ్ చేస్తూ స్థానిక తహసిల్దార్ మల్లయ్య కు అల్లాదుర్గం అసెంబ్లీ సాధన కమిటీ అధ్యక్షులు, కంచరి బ్రహ్మయ్య, వినితిపత్రం అందజేశారు, ఈ సందర్భంగా కంచరి బ్రహ్మయ్య,మాట్లాడుతూ, మెదక్ జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లో గోదాములు ఏర్పాటు చేశారని, అయితే అల్లాదుర్గం మాత్రం గోదాముకు నోచుకోలేకపోతుందని , విచారం వ్యక్తం చేశారు, అల్లాదుర్గంలో గోదాము లేక రైతులు పడుతున్న పాట్లు చెప్పనలివిగా ఉన్నాయని అన్నారు, కొనుగోలు కేంద్రానికి దాన్యం తరలించిన, రైతులకు జాప్యం లేకుండా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు, అధికారులు పాలకులు స్పందించి, అల్లాదుర్గంలో గోదామును ఏర్పాటు చేసి, రైతులు పడుతున్న పాట్లను పరిష్కరించాలని, బ్రహ్మం, డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో రైతులు,హన్మనాయక్, పరశురాం, తదితరులు పాల్గొన్నారు...

## 15 మంది ఏ.ఎస్ఐ లకు సబ్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి

# పదోన్నతి పొందిన ఎస్ఐ లను అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపియస్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 26(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:1990లో పోలీసు కానిస్టేబుల్ గా నియామకమై గడిచిన 35 సంవత్సరాలుగా ఉమ్మడి మెదక్ జిల్లా పోలీసుశాఖలో విశిష్ట సేవలందించిన,ప్రస్తుత సంగారెడ్డి జిల్లాకు చెందిన 15-మంది ఏ.ఎస్ఐ లకు ఎస్ఐ లుగా పదోన్నతి కలిస్తూ మల్టీ జోన్- 2 ఐజి వి.సత్యనారాయణ ఐపియస్ ఉత్తర్వులు వెలువరిచారని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపియస్ తెలియజేశారు,ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గత 35 సంవత్సరాలకు పైగా పోలీసు శాఖలో విధులు నిర్వహించి, సుధీర్ఘ సర్వీస్ లో ఎలాంటి రిమార్క్ లేకుండా సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా పదోన్నతి పొందడం జరిగిందని, పదోన్నతి పొందిన అధికారులు కే.గంగయ్య, కే.సుధాకర్, శ్రీహరి, సంజీవ రెడ్డి, షాబుర్ రహేమాన్, యం.లక్ష్మీనారాయణ, దుర్గయ్య, జి. నారాయణ, వై.మల్లేశ్వర్, జి.బిక్షపతి. లను జిల్లా ఎస్పీ గారు అభినందించి, ఎస్ఐ ర్యాంక్ చిహ్నంను అలకరించి శుభాకాంక్షలు తెలియజేశారు,పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత మరింత పెరుగుతుందని,పెరిగిన బాధ్యతను క్రమశిక్షణతో నిర్వర్తిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల ఉన్న నమ్మకాన్ని, గౌరవాన్ని మరింతగా పెంచే విధంగా కృషి చేస్తూ సర్వీసులో మరిన్ని ఉత్తమ సేవలను అందించి రాష్ట్ర పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు,ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి,రోజు వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని,మానసికంగా,శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే ఎలాంటి విధులనైనా సమర్ధవంతంగా నిర్వహించగలమని,కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపగలం అన్నారు.మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి శారీరక శ్రమ,యోగా అవసరమని ఎస్పీ అన్నారు.

# టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట ప్రచార జాత

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంచుదాం

సర్కారు బడిని బలోపేతం చేద్దాం:టీఎస్ యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 26 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంచి బలోపేతం చేసుకోవడం కోసం సంగారెడ్డి జిల్లాలో టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నుండి వారం రోజులపాటు నిర్వహిస్తున్న బడిబాటలో భాగంగా ప్రచార జాత నిర్వహించడం జరుగుతుంది,ఈ ప్రచార జాతను జెడ్పి హై స్కూల్ పోతిరెడ్డిపల్లి నుండి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయ సంఘంగా టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ ప్రయోజనాలు మాత్రమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవడం కోసం ఒక ప్రచార యాత్రను నిర్వహిస్తుండడం అభినందనీయమని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవడం కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,యువత,ప్రభుత్వ యంత్రాంగం అంతా సంకల్పించాల్సిన అవసరం ఉన్నదని గుర్తు చేశారు.మంచి సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వ పాఠశాలలు ఉండాలని వాటి ద్వారా మాత్రమే విలువలతో కూడిన విద్య అందించబడుతుందని తెలిపారు. ఈరోజు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం బోధిస్తున్నారని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం పాఠశాలకు కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని తల్లిదండ్రులు గమనించి ప్రభుత్వ పాఠశాలలకు మీ విద్యార్థులను పంపించాలని కోరారు,ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పడిపోతుందని దానికి కారణం ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇవ్వడం మరియు ప్రభుత్వ పాఠశాలలను అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దక నిర్లక్ష్యం చేయడమేనని,ఈ సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం బడిబాటను ముందుగానే ఏర్పాటు చేసి పాఠశాలల్లో సౌకర్యాలను కూడా అందించే ప్రయత్నం చేయడం అభినందనీయమని, అదే సందర్భంలో ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా హైస్కూలలో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా చూడాలని ఖాళీగా ఉన్న హెడ్మాస్టర్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల బలోపేతం మే లక్ష్యంగా జూన్ 6 నుండి ప్రభుత్వం నిర్వహించబోతున్న బడిబాటలో ప్రభుత్వ యంత్రాంగం అంతా పాల్గొని బడిబాట జయప్రదం చేయడానికి ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి లింబాజీ, సంగారెడ్డి మండల విద్యాధికారి విద్యాసాగర్ మరియు భూమి మీద పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞాన మంజరి,జిల్లా అధ్యక్షులు కే అశోక్,ప్రధాన కార్యదర్శి బి.సాయిలు,కోశాధికారి పి .శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శిలు బి.అరుణశ్రీ,బి.సాయి తేజ, చందర్ రాథోడ్,ప్రసన్న నాయకులు ధనరాజ్, దిలీప్ సింగ్ ఠాగూర్,తారా సింగ్,రాజేశ్వరి,చంద్రశేఖర్, శ్రీరామ్ నాయక్, సంతోష్,లక్ష్మణ్,జ్యోతి మేరీ హెలెన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాబలం వార్తాకు స్పందించిన ఆర్ అండ్ బి అధికారులు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** శనివారం రోజున ప్రజాబలం దినపత్రికలో వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలోని వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిలో గతంలో నిర్మించిన హై లెవెల్ బ్రిడ్జ్ కి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు మెటల్ రోడ్డు వేయకపోవడంతో వేసవి కాలంలో దుమ్ము, ధూళితో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. మే నెలలో కురిసిన అకాల వర్షాలకు మర్రిపల్లి హైలెవర్ బ్రిడ్జి ఇరువైపులా అప్రోచ్ రోడ్లో భారీ గుంతలు ఏర్పడి ఆ గుంతలలో వర్షం నీరు నిలిచి వాహనదారులకు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వేములవాడ రూరల్ బిజెపి మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో హై లెవెల్ బ్రిడ్జి పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే ఇట్టి బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డును మెటల్ రోడ్డుగా మార్చి వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తొలగించాలని ప్రజాబలం దినపత్రికలో వార్త రావడంతో ఆర్ అండ్ బి అధికారులు ఆలస్యంగా నిద్రలేచి సోమవారం రోజున మూడపల్లి నుండి మర్రిపల్లి వైపుగా వచ్చే అప్రోచ్ రోడ్డుకు కంకర వేసి రోడ్డును చదును చేయడం ప్రారంభించారు. మర్రిపల్లి నుండి మూడపల్లి వైపు వెళ్లే అప్రోచ్ రోడ్డును మాత్రం



ఆ రోడ్డుపైన ఉన్న మట్టిని చదును చేసి గుంతలను పూడ్చడం జరిగింది. అట్టి గుంతలలో మళ్లీ వర్షం కురిస్తే పరిస్థితి యధావిధిగా ఉంటుందని మర్రిపల్లి గ్రామస్తులు తమ ఆవేదనను వెలుబుర్చుచున్నారు. ఆర్ అండ్ బి అధికారులు ఇప్పటికైనా అప్రోచ్ రోడ్డును ఇరువైపులా మెటల్ రోడ్డు గా మార్చి వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (మే26 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, అందోల్ నియోజకవర్గం పరిధిలోని మునిపల్లి మండలం పెద్ద గోపులారం గ్రామానికి, చెందిన, నేతి వీరన్నకు, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశానుసారం, సీఎం రిలీఫ్ పండ్ కింద, మంజూరైన చెక్కును, తాజా మాజీ ఎంపిటిసి, బురకల పాండు, నేటి వీరన్నకు అందజేశారు, ఈ కార్యక్రమంలో, మార్కెట్ కమిటీ డైరెక్టర్, అమరేశ్వర్, మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, నరేందర్ చారి, మండల యువజన కాంగ్రెస్ నాయకులు, మహేందర్, సోషల్ మీడియా నాయకులు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా దామోదర్ రాజనర్సింహకు, కృతజ్ఞతలు తెలియజేశారు....

# యాచకురాలు తన పెళ్లి రోజు సందర్భంగా 1116/- అన్నదాన ట్రస్ట్ కు విరాళం అందజేత.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద యాచక వృత్తి చేసుకొనే వంగల సుజాత అనే యాచకురాలు మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న నిత్య అన్నదానానికి స్ఫూర్తి చెంది తన పెళ్లి రోజు సందర్భంగా ఆమె పేర అన్నదానం చేయాలంటూ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ కు 1116/- అందించడం స్ఫూర్తిదాయకం. నిజానికి రాజన్న ఆలయం వద్ద యాచకురాలుగా ఉన్న వంగల సుజాత తన పెళ్లి రోజు సందర్భంగా అన్నదానాన్ని నిర్వహించడానికి నిత్యం భక్తుల నుండి యాచక వృత్తిలో సేకరించిన రూపాయి, రూపాయి జమ చేస్తూ మిగితా పేదలకు, అన్నార్తులకు అన్నదానం చేయాలనే సంకల్పంతో ట్రస్టు ద్వారా చేసే అన్నదానానికి సహకరించినందుకు ఆమెకు, ఆమె కుటుంబ సభ్యులకు శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఇలాగే ఎంతో మందికి స్ఫూర్తి కలిగి ఆడంబరాలకు ఖర్చు చేయకుండా, పేదలకు, అన్నార్తులకు నిర్వహించే అన్నదానం, వస్త్ర దానం, ఇలాంటి కార్యక్రమాలకు ప్రోత్సాహం అందిస్తే ఎంతోమంది కడుపు నింపిన వారం అవుతామని, ఇంకా ఎంతో మందికి ఆదర్శవంతంగా ఉండేలా ఆలోచన చేయాలని మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కోరుతున్నారు.

# రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని సోమవారం రోజున తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. భక్తులు వేకువ జాము నుండి తలనీలాలు సమర్పించి, కుటుంబ సమేతంగా పవిత్ర ధర్మగుండములో పుణ్యస్నానాలు ఆచరించి, క్యూలైన్ల ద్వారా వెళ్లి శివునికి అత్యంత ప్రీతికరమైన కోడమొక్కులను చెల్లించుకొని, పరివార దేవతలను దర్శించుకుని, తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు గండ దీపం వెలిగించి, నిలువెత్తు బంగారాన్ని ( బెల్లం )ను స్వామి వారికి సమర్పించి తమ పిల్లలను, తమ కుటుంబాలను, తమ పాడి పంటలను చల్లగా చూడాలని అ పరమేశ్వరున్ని వేడుకున్నారు. రాజన్న ఆలయానికి అనుబంధ ఆలయాలైన భీమేశ్వరాలయం, బద్ది పోచమ్మ ఆలయాలలో భక్తుల రద్ద విపరీతంగా పెరిగింది. విద్యాసంస్థలకు వేసవి సెలవుల సందర్భంగా, మరియు సోమవారం రోజుతో కాళేశ్వర ముక్తేశ్వర స్వామి సన్నిధి త్రివేణి సంగమంలో సరస్వతీ పుష్కరాలు చివరి రోజు కావడంతో, కాళేశ్వరంలో పుష్కర స్నానాలు ఆచరించే భక్తులు మొదట వేములవాడ రాజన్న ని దర్శించుకుని కాళేశ్వరం వెళ్లడం ఆనవాయితీగా వస్తున్న సందర్భంలో రాజన్న ఆలయానికి భక్తులు పోటెత్తినారు. సోమవారం రోజున సుమారు 60 వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేసినారు.

# తెలంగాణ టీజీ ఈసెట్ 2025 ఫలితాలలో14వ ర్యాంకు సాధించిన కోలా. వైష్ణవి.



TG ECET (FDH & B.Sc.(MATHEMATICS)) - 2025 :: OU HYDERABAD, TELANGANA
ENGINEERING
RANK CARD

Diploma Branch : EEE - ELECTRICAL AND ELECTRONICS ENGINEERING
Branch appeared : EEE - ELECTRICAL AND ELECTRONICS ENGINEERING

Reg.No. : 4511311485
Candidate Name : KOLA VAISHNAVI
Father Name : KOLA VENKATESH
Mother Name : KOLA RENUKA
Date of Birth : 24/01/2007
Gender : FEMALE
Category : BC-B
Area : Local(OU Area i.e, Telangana)
Address : 7-98 , NIZAMABAD , KONARAOPET , RAJANNA SIRCILLA , TELANGANA - 505301

Hall Ticket No. 1410024304

| Subject (Max. Marks) | MATHEMATICS (50) | PHYSICS (25) | CHEMISTRY (25) | ENGINEERING (100) | TOTAL (200) |
|---|---|---|---|---|---|
| Marks Secured | 26 | 14 | 16 | 45 | 101 |

| Total Marks in Words | One * Zero * One | Status | QUALIFIED |
|---|---|---|---|
| Branch Rank in Words | One * Four | Branch Rank in Figure | 14 |

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, కొనరావుపేట, ( ప్రజాబలం ),** ఆదివారం రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన టీజీ ఈసెట్ -2025 ఫలితాలలో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన కోలా రేణుక - వెంకటేష్ కుమార్తె కోలా వైష్ణవి అత్యుత్తమైన 14వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా కోలా వైష్ణవి మాట్లాడుతూ నా ఈ విజయానికి నా తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల శిక్షణ, మరియు నిమ్మపల్లి గ్రామంలో సబ్ స్టేషన్ నిర్వహణ ఏ ఈ అధికారి పూర్ణచందర్ సలహాలు, సూచనలు దోహదం చేశాయని, వారికి కోలా వైష్ణవి కృతజ్ఞతలు తెలిపారు. కోలా వైష్ణవి తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తె టీజీ ఈసెట్లో 14వ ర్యాంకు సాధించినందుకు చాలా గర్వంగా ఉందని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ గ్రామస్తులు మాట్లాడుతూ మా గ్రామ ముద్దుబిడ్డ కోలా వైష్ణవి అత్యున్నతమైన ర్యాంకు సాధించి మా గ్రామ పేరు నిలబెట్టినందుకు అభినందనలు తెలియజేస్తూ, మునుముందు మరెన్నో విజయాలు సాధించి తాను కోరుకున్న గమ్యాన్ని చేరుకోవాలని, అలాగే పేద ప్రజలకు సేవ చేయాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# కాలేశ్వరం సమస్యను పక్కదారి పట్టించడానికి కవిత లేఖ నాటకం.

## కెసిఆర్ ఆధ్వర్యంలోనే ఫ్యామిలీ షో నడుస్తుంది.
## రేవంత్ రెడ్డిని విమర్శించే హక్కు కేటీఆర్ కు లేదు.
## డిసిసి ఉపాధ్యక్షుడు సంఘ స్వామి యాదవ్.





**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కాజేసిన కేసీఆర్ కుటుంబ సభ్యులు దోషులుగా జైలుకు వెళ్లే సమయం ఆసన్నమవుతున్న తరుణంలో సమస్యను పక్కదారి పట్టించేందుకు, రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ షో నడుస్తుందని కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు సంఘ స్వామి యాదవ్ ఆరోపించారు. బి ఆర్ ఎస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలు, సీఎం రేవంత్ రెడ్డి పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం సంఘ స్వామి యాదవ్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ఎమ్మెల్సీ కవిత లేఖ ఒక పెద్ద కట్టు కథ అని, రాష్ట్ర ప్రజలతో పాటు మీడియా దృష్టిని కాళేశ్వరం సమస్య నుండి మళ్లించేందుకే కవిత లేఖ విషయం బయటకు వచ్చిందని ఇదంతా కెసిఆర్ ఆధ్వర్యంలోనే నడుస్తుందని, ఈ సమస్యపై ఎవరు మాట్లాడవద్దని తాజాగా కేసీఆర్ పార్టీ శ్రేణులకు ఇచ్చిన సూచననే దీనికి నిలువెత్తు నిదర్శనం అన్నారు. వాస్తవానికి కెసిఆర్ కుటుంబంలో ఎలాంటి గొడవలు లేవని కేవలం డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు వారు చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడం కొరకు ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీ పట్ల డ్యామేజ్ కాకుండా ఉండేందుకు ఎమ్మెల్సీ కవిత లేఖ పేరుతో కొత్త నాటకానికి తెర లేపారని, రాష్ట్ర ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకు వెళ్తుందని, ఆరు గ్యారెంటీల అమలను ఒక్కొక్కటి అమలు చేస్తున్నామని, దీంతో తెలంగాణ ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని, ఇది చూసి ఓర్వలేని ట్విట్టర్ టిల్లు కేటిఆర్ కాంగ్రెస్ పార్టీపై, సీఎం రేవంత్ రెడ్డి పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని కేటీఆర్ అనడం విడ్డూరంగా ఉందని, అసలు లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని మింగిన కేసీఆర్ అండ్ ఫ్యామిలీ మొత్తం రాజకీయాలకు శాశ్వతంగా రాజీనామా చేయాలని తప్పితే ప్రజా నాయకుడు అభివృద్ధి ప్రదాత సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయాలో కేటీఆర్ చెప్పాలని సంఘ స్వామి యాదవ్ సవాల్ విసిరాడు. ఏది ఏమైనా ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన, రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి ఇక స్థానం లేదని, రాష్ట్ర ప్రజలందరూ కాంగ్రెస్ వైపే ఉన్నారని, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పూర్తి ఆధిపత్యాన్ని కొనసాగించడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశాడు. ఇంకోసారి కాంగ్రెస్ పార్టీ పైన గాని, తమ నాయకుల పైన గాని బి ఆర్ ఎస్ నాయకులు అర్థంపర్థం లేని వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆయన ఘాటుగా హెచ్చరించాడు. మీరు చేసే తప్పుడు వ్యాఖ్యలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తను తమ కాంగ్రెస్ పార్టీ సైన్యం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశాడు.

# పేకాట స్థావరంపై దాడి



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మే 26 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామంలో పేకాటస్థావరంపై ఎస్సై జి సురేష్ పోలీస్ సిబ్బందితో దాడి చేయడం జరిగింది. ఈదాడిలో ముగ్గురు పేకాటరాయుళ్లను పట్టుకోగా ఒకరు పరార్ అయ్యారు. పట్టుకున్న నిందితుల నుండి రూ.1860/-తో పాటు 52పేకముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగింది.

పట్టుబడ్డ నిందితుల వివరాలు

01.చుంచు రత్నాకర్. తిమ్మాపూర్

02.దుర్గం భీమలింగు. తిమ్మాపూర్

03.ఆవునూరి శంకరయ్య, తిమ్మాపూర్, పరార్ అయిన నిందితుడు

04.కాంద్రపు తిరుపతి, తిమ్మాపూర్. ఈదాడిలో లక్షెట్టిపేట ఎస్సై జి సురేష్ తో పాటు పిసిలు సత్యనారాయణ,ప్రేమ్ కుమార్ ఉన్నారు.

# రామంతపూర్ తండాలో త్రాగునీటి కష్టాలు

## అధికారులు స్పందించాలి . , తాండవాసుల ఆవేదన.
## పది రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్.
## బోర్ల పొలాల వెంట త్రాగు నీటికి గ్రామస్తుల పరుగులు.



**నర్సాపూర్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి :**-మెదక్ జిల్లా మాసాయిపేట మండలం రామంతపూర్ తండాలో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో గ్రామస్తులు తాండ వాసులు గత రోజుల నుండి తీవ్ర అవస్థలు ఎదుర్కొంటూ తాగునీరుకై బోర్ల పొలాల వెంట పరుగులు తీస్తున్నారు. వివరాల ప్రకారం మాసాయిపేట మండలం రామంతపూర్ తండాలో గత రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గ్రామస్తులు తాండవాసులు త్రాగునీరుకై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్రాగునీటికి బోర్ల పొలాల వెంట పరుగులు తీస్తున్నారు త్రాగునీరు లేకపోవడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని సంబంధిత మిషన్ భగీరథ అధికారులు స్పందించి నిర్లక్ష్యం వహించకుండా వెంటనే సదరు పైపులైను మరమ్మతులు చేపట్టి వెంటనే త్రాగునీటిని పునరుద్ధరించాలని తాండావాసులు డిమాండ్ చేస్తున్నారు. లేనిచో తాండవాసులు పెద్ద ఎత్తున సమీప జాతీయ రహదారిపై మండల కార్యాలయం వద్ద ధర్నాకు దిగి తమ నిరసనను వ్యక్తం చేస్తామని సంబంధిత అధికారులను ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నారు. విద్యుత్ సరఫరా సరిగా లేక బోరుభవుల నుండి నీళ్ల తెచ్చుకుందామని అనుకుంటే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వల్ల ఇబ్బందులకు గురి అవుతున్నామని ఇకనైనా ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ పెద్దలు ప్రజా ప్రతినిధులు స్పందించి మా తాండకు నీటి సదుపాయం కల్పించాలని కోరారు.

# కాకా కుటుంబాన్ని విమర్శించే అర్హత కాంపెల్లి సమ్మయ్యకు లేదు

## -పట్టణ కాంగ్రెస్ నాయకులు సుదర్శన్, ఉపేందర్, నర్సింగ్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మే 26:**కేంద్ర మాజీ మంత్రి కాకా వెంకట స్వామి కుటుంబ సభ్యులయిన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పార్లమెంట్ సభ్యుడు వంశీకృష్ణ లను విమర్శించే అర్హత ఐ ఎన్ టి యూ సి నాయకులు కాంపల్లి సమ్మయ్యకు లేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు పేర్కొన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారు. కాంపల్లి సమ్మయ్య విమర్శించినట్లుగా చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ పార్లమెంటు సభ్యుడు వంశీకృష్ణ లు ఎస్సీ వర్గీకరణకు ఎప్పుడు వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. మాలలకు రిజర్వేషన్లలో తగినంత ప్రాతినిత్యం కల్పించాలని మాత్రమే తెలపడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ఎమ్మెల్యే వెంట తిరుగుతూ వారికి వ్యతిరేకంగా మాట్లాడడం పత్రిక ప్రకటనలు ఇవ్వడం సమంజసం కాదని వారు అన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మరియు పార్లమెంట్ సభ్యులు వంశీకృష్ణ లు దళితుల్లో చీలిక తెస్తున్నారని ఆరోపణలు సత్య దూరమని తెలిపారు. ఇకముందు ఎమ్మెల్యేను ఎంపీని విమర్శించడం మానుకోవాలని వారు హితువు పలికారు. ఈసమావేశంలో ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సొత్కు సుదర్శన్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పుల్లూరు లక్ష్మణ్, పైడిమల్ల నర్సింగ్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నెరువట్ల శ్రీనివాస్, మైనార్టీ అధ్యక్షులు ఎండి జమీల్, గుడ్ల రమేష్, ఎండి పాషా, కనకం రాజు, ఎండి సుక్కుర్, మంద తిరుమల్ రెడ్డి, తిరుపతి, సోతుకు ఉదయ్, మాయ తిరుపతి, దుర్గం ప్రభాకర్, బుర్ర ఆంజనేయులు, అందుగుల లక్ష్మణ్, బండి శంకర్ గౌడ్, ఎర్ర రాజు, ఆలం శంకర్, సురేందర్, జావిద్ ఇసాక్, లక్ష్మణ్, సామ్యూల్, వీరన్న, వెంకటాద్రి, అంజి, ఆడెపు వేణు, గట్ల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 26 :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్,మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్రావు, హరికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం నర్వాయిపేట గ్రామానికి చెందిన జాడిశంకర్ మండలంలోని మెట్పల్లి శివారులో తనకు గల పట్టా భూమి వేరొకరి పేరిట చూపుతోందని,సవరించి తన పేరిట మార్పు చేసి పట్టా పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన బోయిన రవీందర్,నెన్నెల మండలం మెట్పల్లి గ్రామానికి చెందిన దుగుట రాజేశ్వరి తమ ప్రాంతంలో మీ-సేవ కేంద్రం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,మీ-సేవా కేంద్రం ఏర్పాటు చేసేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.జన్నారం మండలం ఇంధన్పల్లి గ్రామానికి చెందిన లసెట్టి గంగవ్వ గ్రామ శివారులో తనకు గల భూమికి సంబంధించి హద్దులు నిర్ధారించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామపంచాయతీ నాయక్ గూడెంకు చెందిన మంగ శారద తనకు గ్రామ శివారులో ఉన్న భూమి రాళ్లవాగు ఎడమ కాలువలో పోయిందని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.కోటపల్లి మండలం కొండపేట గ్రామానికి చెందిన అలం మహేందర్ తనకు ఇందిర సౌర గిరి జల వికాసం పథకం క్రింద బోరు,మోటార్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 32 దరఖాస్తులు వచ్చాయని, అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 22 వేల 20 మంది రైతుల ఖాతాలలో 218 కోట్ల రూపాయల జమ

## జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 26 :** జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 320 కేంద్రాలు ద్వారా 22 వేల 20 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 57 వేల 710 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 218 కోట్ల 13 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 131 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 6 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యంను కరీంనగర్ లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు.ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్ ఎ, సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు,నీడ,ఓ. ఆర్.ఎస్.,గోనె సంచులు, టార్పాలిన్లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని,రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com